


# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





# హరితాంధ్ర శంఖారావం

- రాష్ట్రంలో 50% గ్రీన్ కవర్ లక్ష్యం!
- విశాఖలో ముఖ్యమంత్రి పర్యావరణ సంకల్పం
- మండుటెండలో 5.5 కిలోమీటర్లు సైకిల్ తొక్కిన చంద్రబాబు

రాష్ట్రంలో పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ 50 శాతం గ్రీన్ కవర్ (హరిత విస్తీర్ణం) సాధించడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం సరికొత్త హరిత విప్లవానికి శ్రీకారం చుట్టింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ మెగా ప్లాన్‌ను ప్రకటించారు. వాతావరణ మార్పులతో ఎండలు, తుఫాన్లు ముంచుకొస్తున్న తరుణంలో పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 2.5 కోట్ల విత్తన బంతుల (Seed Balls) పంపిణీతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ దిశగా అడుగులు వేస్తున్నారని సీఎం వెల్లడించారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా, ప్రజల్లో పర్యావరణ స్పృహ, ఫిట్‌నెస్ పెంచేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్ నుంచి బీచ్ రోడ్ మీదుగా నోవాటెల్ హోటల్ వరకు 5.5 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 21 నిమిషాల్లో సైకిల్‌పై అధిగమించి సరికొత్త రికార్డు సృష్టించారు.

3



## బ్లూ ఎకానమీతోనే ప్రగతి



- ఆక్వా హబ్‌గా ఆంధ్రప్రదేశ్
- ఆరు నగరాలను కలుపుతూ ప్రత్యేక ఆక్వా కారిడార్
- సీఎం చంద్రబాబు మెగా ప్లాన్
- రూ.72 కోట్లతో కాకినాడ పోర్టు ఆధునికీకరణ: కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్

2

భవిష్యత్తు అంతా 'బ్లూ ఎకానమీ' (సముద్ర ఆధారిత ఆర్థిక వనరుల)దేనని, దేశ ఆక్వా రంగానికి ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన కేంద్ర బిందువుగా (లైట్‌హౌస్‌లా) తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం విశాఖలో నిర్వహించిన సీఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రాష్ట్రంలో ఆక్వా రంగానికి అవసరమైన సరికొత్త ఎకో సిస్టమ్‌ను నిర్మించడంలో భాగంగా అమరావతి, భీమవరం, కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, నెల్లూరు ప్రాంతాలను కలుపుతూ 'ప్రత్యేక ఆక్వా కారిడార్ (Aqua Corridor)' అభివృద్ధి చేస్తామని సీఎం ప్రకటించారు. రూ. 72 కోట్లతో కాకినాడ పోర్టును ఆధునికీకరిస్తామని కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వెల్లడించారు.

# రష్యా వేదికగా ఏపీ 'స్మార్ట్' వ్యూహం

- పారిశ్రామిక దిగ్గజాలతో మంత్రి నారా లోకేష్ కీలక భేటీలు
- ఉమ్మడి వర్కింగ్ గ్రూపు ఏర్పాటుకు శ్రీకారం





రష్యా పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేష్ సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరుగుతున్న గ్లోబల్ లాజిస్టిక్స్ సదస్సులో పాల్గొన్న ఆయన రష్యా విదేశాంగ ప్రతినిధులు, పారిశ్రామిక దిగ్గజాలతో కీలక భేటీలు నిర్వహించారు. ఏపీలో సేఫ్, స్మార్ట్ సిటీస్, డీశాలినేషన్ ప్లాంట్లు, సరికొత్త స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల ఏర్పాటుకు రష్యా భాగస్వామ్యాన్ని ఆహ్వానించారు. సురక్షిత,స్మార్ట్ నగరాల నిర్వహణకు రష్యాతో కలిసి ఒక ఉమ్మడి వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుకు ఆయన శ్రీకారం చుట్టారు.

- వివరాలు లోపలి పేజీల్లో...

## డీఎస్సీ-2025 నియామకాలు పూర్తి పారదర్శకం: ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్



- ప్రతి నియామకం పారదర్శకం: విద్యా శాఖ కార్యదర్శి శశిధర్
- ధృవీకరణ ఆధారంగానే స్పోర్ట్స్ కోటా ఎంపికలు: శాప్ ఎండి భరణి

- వివరాలు 6 లో..

## కుట్ర రాజకీయాలకు అలవాటుపడ్డారు



- గులాకరాయి నాటకంనుండి వైఎస్ఆర్ విగ్రహాల ధ్వంసం వరకు
- రోజుకొక అబద్ధం.. వారానికో కుట్ర.. నెలకో కృత్రిమ వివాదం
- ఇదే వైసీపీ రాజకీయ సంస్కృతి
- 11 అసెంబ్లీ స్థానాలకు పరిమితం చేసినా పాఠాలు నేర్చుకోలేదు
- వైసీపీపై నిప్పులు చెరిగిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా

- వివరాలు 7 లో..

## నేటినుంచి 'యోగాంధ్ర' రిజిస్ట్రేషన్లు

- గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా కోటి మందిని భాగస్వామ్యులను చేసే చర్యలు
- 5,600 మంది యోగా మాస్టర్ల ద్వారా 2.5 లక్షలమంది ట్రైనర్లకు శిక్షణ
- అధికారులతో సమీక్షించిన వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్



- వివరాలు 10 లో..

చైతన్యరథం

# రాష్ట్రంలో ఆక్వా రంగ అభివృద్ధికి ఎకో సిస్టం

## ఆరు ప్రాంతాలు కలుపుతూ కారిడార్

- బ్లూ ఎకానమీతోనే భవిష్యత్తు... ఆర్థికాభివృద్ధి సాధ్యం
- కేంద్ర మత్స్య శాఖ ప్రాంతీయ కార్యాలయానికి 15 రోజుల్లో భూ కేటాయింపులు
- దేశాన్ని అగ్రప్రధాన నిలిపేలా అద్భుతంగా పని చేస్తున్న ప్రధాని మోదీ
- సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రూ.72 కోట్లతో కాకినాడ పోర్టును ఆధునికీకరిస్తామన్న కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్




విశాఖపట్నం (చైతన్యరథం): రాష్ట్రంలో ఆక్వా రంగం అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టం ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొ న్నారు. ఆక్వా రంగానికి భారతదేశం లైట్‌హౌస్‌లా ఉంటే... దానికి ఏపీని కేంద్ర బిందువు చేస్తామన్నారు. అమరావతి, భీమవరం, కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, నెల్లూరు ప్రాంతాలను కలుపుతూ ఆక్వా కారిడార్ అభివృద్ధి చేస్తామని సీఎం ప్రకటించారు. ఈ కారిడార్లో ఆక్వా అభివృద్ధికి అవసరమైన రీసెర్చ్, ఇన్నోవేషన్, స్టార్టప్స్, టెక్నాలజీని అందుబాటులోకి తెస్తామని తెలిపారు. అతి తక్కువ వ్యయంతో అత్యధిక ఉత్పత్తి సాధించడమే లక్ష్యమని చెప్పారు. ఆక్వా ఉత్పత్తులకు సంబంధించిన ఉప ఉత్పత్తులతో కూడా ఆర్థిక ప్రగతి సాధించవచ్చన్నారు. శుక్రవారం విశాఖలో జరిగిన సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్‌లో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 'ఆంధ్రా ష్రింప్, ఇండియా సీ-ఫుడ్' బ్రాండ్ ఎస్టాబ్లిష్ చేస్తున్నామని చెప్పారు. ఆక్వా రంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన నాలుగు శాఖలకు చెందిన కేంద్ర మంత్రులు ఒకే వేదికపైకి రావడాన్ని శుభపరిణామంగా అభివర్ణించారు.

### రాష్ట్రంలో మెగా సీ-ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులు

'రూ.72 కోట్లతో కాకినాడ పోర్ట్ మోడ్రనైజేషన్ చేపడతామని కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రకటించినందుకు సంతోషం. కేంద్ర మత్స్య శాఖకు ప్రాంతీయ కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని 15 రోజుల్లో కేటాయిస్తాం. నెల రోజుల్లో కార్యాలయానికి శంకుస్థాపన చేసి నిర్మాణం ప్రారంభించాలని కేంద్రాన్ని కోరుతున్నాను. ఆక్వా ఉత్పత్తులను మరింత పెద్ద స్థాయిలో ఎగుమతులు చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఆక్వారంగ అభివృద్ధికి కేంద్రం తీసుకునే చర్యలకు రాష్ట్రం వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుంది. మెగా సీ-ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు సహకరిస్తామని కేంద్రం ఇప్పటికే చెప్పింది. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడానికి బ్లూ ఎకానమీ ఎంతో కీలకం. పాండ్ టు పోర్టు, ఫార్మర్ టు గ్లోబల్ కన్స్యూమర్, బ్లూ ఎకానమీ టు వికసిత్ భారత్ అనే విధానంతో పని చేయాలి. భారత ఆశలను... ఆశయాలను నెరవేర్చేందుకు ఏపీ బ్లూ ఎకానమీ దోహదపడుతుందని భావిస్తున్నా. ప్రపంచ వ్యాప్తంగా జరిగే సీ-ఫుడ్ బిజినెస్‌లో ఇండియా వాటా కేవలం 5 శాతం మాత్రమే ఉంది. ఈ రంగంలో ఇండియాకు పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయి.' అని ముఖ్యమంత్రి అన్నారు.

### ఏటా రూ.28వేల కోట్ల ఎగుమతులు

'భవిష్యత్ అంతా బ్లూ ఎకానమీదే. బ్లూ ఎకానమీ ద్వారా ఆర్థిక వృద్ధి సాధ్యం. నీరు ఉన్నచోట నాగరికతలు విలసిల్లుతాయి... ఏపీలో గోదావరి, కృష్ణ వంటి జీవ నదులు ఉన్నాయి. సీ-ఫుడ్ ఉత్పత్తిలో ఏపీ రెండో అతి పెద్ద రాష్ట్రం. 197 లక్షల మెట్రిక్ టన్నుల సీ-ఫుడ్ ఉత్పత్తి ఏపీలో జరుగుతోంది. ఏపీలో బ్లూ ఎకానమీ పెరిగితే దేశ ప్రగతికి దోహదపడుతుంది. భారతదేశం మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28శాతంగా ఉంది. భారతదేశం మొత్తం రొయ్యల ఉత్పత్తిలో ఏపీ షేర్ 66 శాతం. భారతదేశం మొత్తం సముద్ర ఆహార ఎగుమతుల్లో దాదాపు 38 శాతం ఆదాయం ఏపీ నుంచే వస్తోంది. సంవత్సరానికి రూ. 28వేల కోట్లకు పైగా సముద్ర ఆహార ఎగుమతులు ఏపీ నుంచే జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందితే, భారతదేశ సముద్ర ఆహార ఎగుమతులు కూడా వృద్ధి చెందుతాయి. ఆక్వా రంగంలో ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలు చేస్తే, భారతదేశ బ్లూ ఎకానమీ నిస్సందేహంగా ముందుకు సాగుతుంది. ఏపీలో 1,053 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. ఏపీలో పోర్టులు, ఎయిర్ పోర్టులు ఉన్నాయి. ఏ రంగం, ఏ ఉత్పత్తి అయినా సక్సెస్ కావాలంటే క్వాలిటీ, సస్టైనబుల్టీ, ట్రేసబులిటీ, ఇన్నోవేషన్, జీరో పొల్యూషన్ అనేది ముఖ్యం. సీ-ఫుడ్ ఎగుమతుల అభివృద్ధికి ప్రతీ స్టేక్ హోల్డర్ బాధ్యత తీసుకోవాలి, సహకరించాలి.' అని సీఎం కోరారు.

### ప్రధాని మోదీని మరింత బలపరుద్దాం

'ఆక్వా పరిశ్రమలో ఇన్నోవేషన్లు చేసే వారిని ఆంధ్రప్రదేశ్ ఆహ్వానిస్తోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో ఏపీ పనిచేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెడితే.. ఆ పెట్టుబడులకు ప్రోత్సాహమిచ్చి... అభివృద్ధి చేస్తాం. ఆక్వా ఉత్పత్తులతో చక్కటి ఆరోగ్యం లభిస్తుంది. ప్రజలు ఇప్పుడు ప్రొటీన్ ఉత్పత్తులనే ఆహారంగా తీసుకుంటున్నారు. ఆక్వా ఉత్పత్తుల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. ప్రొటీన్ ఫుడ్ తీసుకోవడంతో పాటు... రోజూ సైక్లింగ్ చేయాలి. ఇవాళ ఈ సమావేశానికి సైక్లింగ్ చేసుకుంటూనే వచ్చాను. సైకిల్ తొక్కితే ఆరోగ్యం బాగుంటుంది... ఖర్చులూ తగ్గుతాయి. సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యమిస్తున్నాం. సరైన సమయంలో సరైన నేత నరేంద్ర మోదీ ప్రధానిగా ఉండటం అదృష్టం. 21వ శతాబ్దం నరేంద్ర మోదీదే... భవిష్యత్తులో భారతదేశాన్ని అగ్ర భాగంలో నిలపడానికి ఆయన అద్భుతంగా పని చేస్తున్నారు. ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న మోదీని మరింత బలపర్చాల్సిన అవసరం ఉంది.' అని చంద్రబాబు చెప్పారు.

### కొత్త మార్కెట్లకు భారత ఆక్వా ఉత్పత్తులు

ఆక్వా రంగం అభివృద్ధిపై కేంద్ర మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమ్మడి ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆక్వా రంగం విషయంలో కేంద్ర ప్రభుత్వం సంక్షోభం నుంచి అవకాశాలను అన్వేషిస్తోందని ఈ సందర్భంగా చెప్పారు. అమెరికా టారిఫ్‌లు విధించినప్పటికీ... గతేడాది కంటే మిన్నగా ఆక్వా ఎగుమతులు చేసుకోగలిగామని, అంతర్జాతీయంగా కొత్త మార్కెట్లకు భారత ఆక్వా ఎగుమతులు వెళ్లాయన్నారు. ఇప్పుడు మన ఆక్వా ఉత్పత్తులకు మరిన్ని మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆక్వా ఎగుమతులతో ఆర్థికాభివృద్ధితో పాటు మత్స్యకారులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. మోడ్రనైజ్డ్ బోట్లను మత్స్యకారులకు అందించడానికి సిద్ధంగా ఉన్నామని, 200 మోడ్రనైజ్డ్ బోట్లు ఏపీకి వస్తున్నాయని చెప్పారు. ప్రజల ఆహార అలవాట్లు మారాయి. ప్రొటీన్ ఆహారాన్ని అధికంగా తీసుకుంటున్నారు. దీంతో ప్రొటీన్ ఎక్కువ ఉండటం వల్ల ఆక్వా ఉత్పత్తులకు డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోందన్నారు.

### సీ-ఫుడ్ ప్రాసెసింగ్‌లో విస్తృత అవకాశాలు

ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 'ఆక్వాలో కేవలం 12 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చేస్తున్నాం... సీ-ఫుడ్ ప్రాసెసింగ్ విషయంలో మరింత అభివృద్ధి చేయాలి. ఆక్వాలో టెక్నాలజీ, ఇన్నోవేషన్లకు పెద్దపీట వేయాలి. వ్యవసాయంతో పోల్చుకుంటే ఆక్వాలో ఎక్కువ అభివృద్ధి కనిపిస్తోంది. ఆక్వాకు రూ.1.50కే విద్యుత్ ఇస్తున్నాం. ఫిష్ ఫీడ్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఫిష్ మీల్ ఎగుమతులను 50శాతానికి పరిమితం చేయాలని కోరుతున్నాం. సోయా విషయంలోనూ కేంద్రం నుంచి సహకారం అవసరం. ఇతర దేశాలతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లు జరగాల్సి ఉంది. దీనికి కేంద్రం ఇప్పటికే సహకరిస్తోంది. ప్రపంచంలోని ప్రతీ కిచెన్‌లోకి ఇండియన్ ఆక్వా ఉత్పత్తులు వెళ్లేలా కేంద్రం ప్రణాళికలు రూపొందించడం సంతోషంగా ఉంది.' అన్నారు.

### సర్క్యులర్ ఎకానమీతో 'ఆక్వా' అనుసంధానం

'పీఎంఎంకేఎస్ఎస్‌వై (గ్రావీవీఖూ‌ఫ్) పథకాన్ని ఏపీలో అమలు చేస్తాం... విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో సమస్యలుంటే పరిష్కరిస్తాం... ఏడాది 30 బిలియన్ యూఎస్ డాలర్ల విలువైన ఎగుమతులు చేయాలని కేంద్ర ప్రభుత్వ లక్ష్యం పెట్టుకుంది. దాంట్లో 30 శాతం ఏపీ వాటా ఉంటుందని హామీ ఇస్తున్నాం. సర్క్యులర్ ఎకానమీకి ఆక్వా రంగాన్ని అనుసంధానం చేసేలా భీమవరంలో ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందిస్తోంది. మార్కెట్ ఇబ్బందులతో మద్దతు ధర కోల్పోయిన వివిధ పంటల రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరుతున్నాం. ప్రపంచవ్యాప్తంగా భారతదేశానికి గౌరవం దక్కడానికి కారణం ప్రధాని నరేంద్ర మోదీనే. చాలా దేశాల్లో చాలా ఇబ్బందులు, సమస్యలు ఉన్నాయి. భారత దేశాన్ని ప్రధాని సమర్థవంతంగా నడిపిస్తున్నారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి వాటిని కేంద్రం ప్రోత్సహిస్తోంది. అమెరికాలో నాలుగు పవర్ గ్రిడ్లు ఉన్నాయి. భారతదేశంలో ఒకే సెంట్రల్ పవర్ గ్రిడ్ ఉంది. భారత దేశంలో ఏ మారుమూల విద్యుత్ ఉత్పత్తి చేసినా... కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎక్కడైనా వినియోగించుకునే అవకాశం ఉంది. ఈ పరిణామాలన్నీ 2014 తర్వాతే జరిగాయి. గతంలో సోలార్ విద్యుత్ యూనిట్‌కు ఉత్పత్తి వ్యయం రూ.14గా ఉండేది. ఇప్పుడు యూనిట్‌కు రూ.2.40కు వ్యయం తగ్గింది. గతంలో సోలార్ ప్యానెళ్లను దిగుమతి చేసుకోవాల్సి వచ్చేది. కానీ ప్రధాని మోదీ నిర్ణయాలతో ఇప్పుడు ఏపీలో సోలార్ ప్యానెళ్లు ఉత్పత్తి చేసుకుంటున్నాం.' అన్నారు.







# రాష్ట్రంలో 50శాతం గ్రీన్ కవర్ లక్ష్యం

- స్వచ్ఛతకు, పచ్చదనానికి ఏయూ ఆదర్శం కావాలి
- పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏయూలో మొక్క నాటిన ముఖ్యమంత్రి
- స్టీల్ సిటీలో చంద్రబాబు సైకిల్ సవారీ
- ఐదున్నర కిలోమీటర్ల ప్రయాణం









విశాఖపట్నం (చైతన్యరథం): రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యత రోజు రోజుకూ దెబ్బతింటోందని... ఓవైపు విపరీతమైన ఎండలు, లేదంటే తుఫానులు వస్తున్నాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరి పైనా ఉందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రాయూనివర్శిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. శాసనసభ స్పీకర్ చింత కాయల అయ్యన్నపాత్రుడు, జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏయూ గ్రౌండ్‌లో సీఎం మొక్క నాటారు. తిరుమల తరహాలో ఏయూ క్యాంప స్‌లోనూ గ్రీనరీ పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం క్యాంపస్‌లో 25 శాతమే గ్రీనరీ ఉందని... దీనిని 50శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలం టూ ఏయూ వీసీని ఆదేశించారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ... 'స్వచ్ఛత, పచ్చదనం, పర్యావరణానికి ఏయూ క్యాంపస్ ఆదర్శంగామారాలి. నెట్ జీరో క్యాంపస్‌గా ఏయూను నిలపాలి. ఆంధ్ర యూనివర్శిటీకి 450 ఎకరాల సువిశాల క్యాంపస్ ఉంది. ఖాళీ ప్రదేశాల్లో చెట్లు పెంచడంతోపాటు... భవనాలపై మీద సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి. క్యాంపస్‌కు అవసరమైన విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకోవాలి. ఇప్పటికే రూ.5,18,000 విలు వైన విద్యుత్ ఆదా అయింది. క్యాంపస్‌ను బయోడై వర్శిటీ పార్కుగా తీర్చిదిద్దాలి.హాస్టళ్లు, కాలేజీల నుంచి వచ్చే చెత్త, చెట్ల ఆకులను కంపోస్ట్‌గా మార్చాలి. సాలిడ్‌వేస్ట్ మేనేజ్మెంట్,వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, వ్యర్థాల నుంచి బయో గ్యాస్ ఉత్పత్తిపై దృష్టి పెట్టాలి. వేస్ట్ వాటర్ మేనేజ్మెంట్ చేపట్టాలి. క్యాంపస్ నుంచి ఒక్క చుక్క నీరు కూడా బయటకు వెళ్లకూడదు.శుద్ధి చేసిన నీటిని చెట్లకు ఉపయోగించాలి. పీఎన్జీ,ఎలక్ట్రికల్ స్టవ్స్ వంటలకు వినియోగించుకోవాలి. నెట్ జీరో విధానం అమలు చేయడానికి ప్రొఫెసర్స్ టీమ్ ఏర్పాటు చేయాలి. పర్యావరణానికి సంబంధించి విద్యార్థులకు ఏయూ క్యాంపస్ ఓ నాలెడ్జ్ హబ్‌గా తయారవ్వాలి. ప్రపంచంలోని టాప్ నాలెడ్జ్ వర్సిటీల సరసన ఏయూను నిలపాలి. క్యాంపస్ లోపల ఎలక్ట్రికల్ సైకిళ్లను అందుబాటులోకి తీసుకురావాల'న్నారు.

## విశాఖలో కాలుష్య నియంత్రణ చర్యలు

విశాఖలో కాలుష్యాన్ని తగ్గించేందుకు పోర్టు దగ్గర నుంచి మొదలుకుని అన్ని ప్రాంతాల్లోనూ ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు. మొక్కలు బాగా పెంచిన వాళ్లకే వచ్చే ఎన్నికల్లో టిక్కె ట్లంటూ సీఎం సరదాగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 2.5 కోట్ల సీడ్ బాల్స్‌తో గ్రీనరీ పెంచేలా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషిచేస్తున్నారని చెప్పారు. విశాఖ లో సైక్లింగ్,వాకింగ్ కోసం ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేస్తామన్నారు. సైక్లింగ్ ద్వారా రెండు విధాలుగా లాభం ఉందని... కాలుష్యం తగ్గడమే కాకుండా ఫిట్‌నెస్ పెంచుకోవచ్చని సీఎం అన్నారు.

## సీఎం సైక్లింగ్

ఏయూ గ్రౌండ్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశం అనంతరం... పర్యావరణ పరిరక్షణపై అందరిలో చైతన్యం తెచ్చేలా విశాఖలో సీఎం సైకిల్‌పై ప్రయాణించారు. ఎర్రటి ఎండ కాస్తున్నా.. సీఎం ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. దారి పొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్ నుంచి తీ్రటౌన్ పీఎస్ జంక్షన్, పోలమాంబ గుడి, వుడా పార్క్, వైఎంసీఏ, బీచ్ రోడ్ మీదుగా నోవోటెల్‌కు సైకిల్‌పై వెళ్లారు. మొత్తం ఐదున్నర కిలోమీటర్ల దూరాన్ని 21 నిమిషాల్లోనే చేరుకున్నారు. ముఖ్యమంత్రితో పాటు సైకిల్ ర్యాలీలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, విశాఖ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



### పర్యావరణం, ఆరోగ్య హితం కోసం సైకిల్

## తిరుగు ప్రయాణంలోనూ సీఎం సైక్లింగ్

విశాఖపట్నం (చైతన్యరథం): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు తన తిరుగు ప్రయాణంలోనూ సైకిల్ తొక్కారు. నోవోటెల్ హోటల్ నుంచి బీచ్ రోడ్డు మీదుగా వైఎంసీఏ, వుడా పార్కు సర్కిల్, పోలమాంబ గుడి మీదుగా ఏయూలోని ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్ దగ్గర ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు సైకిల్‌పై ప్రయా ణించారు. సీఎం 5.5కిలోమీటర్ల దూరాన్ని 17 నిమిషాల్లోనే చేరుకున్నారు. దారిలో ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. పర్యావరణ హితంతో పాటు వ్యక్తిగత ఆరోగ్యం కోసం సైకిల్ వినియోగించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. సుందర నగరమైన విశాఖలో సైకిల్‌పై ప్రయాణించ డం మరింత ఆహ్లాదం కలిగించిందన్నారు. విశాఖలో సైకిల్ పాత్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. మన రాష్ట్రాన్ని కాలుష్య రహితంగా తయారు చేసేందుకు ఉద్దేశించిన నెట్ జీరో కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏ కార్యక్రమాన్ని ప్రారంభించినా విశాఖ వాసులు విజయవంతం చేస్తారని .. వివిధ సందర్భాల్లో నగరవాసులు తనకు అండగా నిలబడ్డారని సీఎం అన్నారు. విశాఖకు మరిన్ని పెట్టుబడులు తీసుకురావడం ద్వారా రుణం తీర్చుకుంటానని స్పష్టం చేశారు. విశాఖను నాలెడ్జ్ హబ్‌గా చేయాలని ప్రయత్నిస్తుంటే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, వచ్చే రోజుల్లో అనేక అవకాశాలకు విశాఖ కేంద్రం అవుతుంద న్నారు. వివిధ ప్రాజెక్టులతో సమీప భవిష్యత్తులోనే అనేక అవకాశాల కేంద్రంగా విశాఖ రూపుదిద్దుకుంటుందన్నారు. పోలవరం ఎడమ కాలువ పనులను త్వరలోనే పూర్తి చేసి విశాఖకు గోదావరి నీళ్లు తీసుకువస్తామన్నారు. విశాఖను మరింత సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు సంపద సృష్టికి కేంద్రంగా మారుస్తామన్నారు.

# కైలాసగిరి నుంచి భోగాపురం వరకు

# బే సిటీ ప్రాజెక్టు

- ఏజెన్సీ ప్రాంతాల్లో టూరిజం ప్రాజెక్టులు
- విశాఖ ఎకనమిక్ రీజియన్ సమీక్షలో అధికారులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ నగరాన్ని బే సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన విశాఖ ఎకనామిక్ రీజియన్‌పై తొమ్మిది జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. విశాఖలోని కైలాసగిరి నుంచి భోగాపురం వరకు బే సిటీ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. వీఈఆర్‌పై ఓ ప్రాజెక్టు మోనిటరింగ్ యూనిట్ కూడా ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచనలు ఇచ్చారు. గ్రేహౌండ్స్‌కు చెందిన 303 ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలని ఆదేశించారు. కైలాసగిరి ప్రాంతాన్ని ఆధ్యాత్మికంగా, పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలకు ఆహ్లాదం కలిగించేలా బీచ్ వాటర్ స్పోర్ట్స్‌తోపాటు వినోదం కలిగించే వివిధ ప్రాజెక్టులు చేపట్టేలా పెట్టుబడులు ఆహ్వానించాలన్నారు. విశాఖలోని జంతు ప్రదర్శనశాలను కూడా ఆధునికీకరించి పర్యాటకుల్ని ఆకర్షించేలా చూడాలని సూచించారు.

విశాఖలో ఎర్రమట్టి దిబ్బలు, బౌద్ధ క్షేత్రాలను అభివృద్ధి చేయాలన్నారు. రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ప్రాజెక్టుతో పాటు పోలవరం ప్రాజెక్టు, పాపికొండలు లాంటి పర్యాటక ప్రాంతాలు అదనపు ఆకర్షణగా నిలుస్తాయ న్నారు. ఈ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా పెద్ద ఎత్తున పర్యాటక ప్రాజెక్టులు వచ్చే అవకాశముందని తెలిపారు. వివిధ ప్రాజెక్టుల వద్ద పారిశ్రామిక ప్రాంతాలను ఆనుకుని ఏర్పాటు చేసే టౌన్‌షిప్‌ల అభివృద్ధిపై కూడా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. నీతి ఆయోగ్ సమర్పించిన వీఈఆర్ ప్రాజెక్టు నివేదికను ప్రజల్లో చర్చకు ఉంచాలని... విద్యార్థులు, మేధావుల నుంచి అభిప్రాయాలు, ఆలోచనలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

సమావేశంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి, విశాఖ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, శ్రీకాకుళం నుంచి తూర్పు గోదావరి వరకు తొమ్మిది జిల్లాల కలెక్టర్లు, వీఈఆర్ కన్వీనర్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, వైద్యారోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి సౌరబ్ గౌర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, విశాఖ జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పాల్గొన్నారు.

## శ్రీసిటీలో రైలు విడి భాగాల అసెంబ్లింగ్ ప్లాంటు ఏర్పాటుకు ఆహ్వానం

- ట్రాన్స్ మాస్ హోల్డింగ్ ప్రతినిధులతో మంత్రి లోకేష్ సమావేశం
- లోకోమోటివ్, బోగీ తయారీ కేంద్రం ఏర్పాటుకు సహకరించాలని వినతి

సెయింట్ పీటర్స్‌బర్గ్ (రష్యా): రష్యాలోని అతి పెద్ద రోలింగ్ స్టాక్ తయారీదారు & అగ్రశ్రేణి ప్రపంచ సరఫరాదారు అయిన ట్రాన్స్ మాస్ హోల్డింగ్ జేఎస్‌సీ (Transmasholding JSC)హెడ్ ఆఫ్ గ్లోబల్ ఫైనాన్స్ Vakhromov Ilya, నిర్వాహకులతో ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... శ్రీసిటీ (తిరుపతి జిల్లా)లోని ఆల్స్టోమ్ భారీ మెట్రో రోలింగ్ స్టాక్ సదుపాయానికి ఆనుకొని ఒక ప్రధాన రైలు విడి భాగాల అసెంబ్లీ ప్లాంటు స్థాపించాలని ఆహ్వానించారు. దక్షిణాసియా అంతటా భారీ పారిశ్రామిక రైలు ప్రాజెక్టులకు సరఫరా చేయడానికి, ప్రత్యక్ష రహదారి అనుసంధానాన్ని ఉప యోగించుకుంటూ అధిక సామర్థ్యం గల సరుకు రవాణా లోకోమోటివ్ & బోగి తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాబోయే మెట్రో నెట్‌వర్క్‌ల కోసం కీలకమైన సాంకేతిక ఏకీకరణను అందించే స్మార్ట్ సిగ్నలింగ్, ట్రాఫిక్ నియంత్రణ ఆర్‌డడీ కేంద్రాల స్థాపనలో భాగస్వాములు అవ్వాలని కోరారు. పోర్టుల్లో ప్రాథమిక రోలింగ్ స్టాక్ ఓవర్‌హాల్ & సముద్ర ఎగుమతి యార్డును అభివృద్ధి చేయడం, భారీ రైలు వాహనాలను ప్రపంచ మార్కెట్లకు సజావుగా రవాణా చేయడానికి ప్రత్యేకమైన రైల్-సైడింగ్ బెర్తులను అందించేందుకు ఏపీని ఎగుమతి కేంద్రంగా చేసుకోవాలని సూచించారు. ప్రముఖ మెకానికల్ & రైల్ ఇంజనీరింగ్ సంస్థలతో అనుసంధానించడం ద్వారా అత్యంత నైపుణ్యం కలిగిన తయారీరంగ ప్రతిభావంతులను నిరంతర సరఫరా చేయవచ్చని, దీని కోసం ఆంధ్రప్రదేశ్‌లో టెక్నికల్ స్కిల్ అప్‌గ్రేడేషన్ & ఇంజనీరింగ్ నెట్ వర్క్ ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

ట్రాన్స్ మాస్ హోల్డింగ్స్ జేఎస్‌సీ ప్రతినిధులు మాట్లాడుతూ... భారత్‌లో 120 వందే భారత్ స్లీపర్ రైళ్లను సరఫరా చేసేందుకుకుదిరిన భారీ $6.5 బిలియన్ల కాంట్రాక్టు అమలు చేయడానికి, TMH భారతీయ జాయింట్ వెంచర్ కైనెట్ రైల్వే సొల్యూషన్స్ పని చేస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని టీఎంహెచ్ ప్రతినిధులు చెప్పారు.



ఏపీలో సేఫ్ & స్మార్ట్ సిటీ నిర్వహణకు

## ఉమ్మడి వర్కింగ్ గ్రూపు ఏర్పాటు

**సెయింట్ పీటర్స్‌బర్గ్ గవర్నమెంట్ రీజనల్ ఫారిన్ ఎఫైర్స్ విభాగం చీఫ్ ఎక్స్‌పర్ట్ పోలినా పోలుఖినాతో మంత్రి లోకేష్ భేటీ**



సెయింట్ పీటర్స్‌బర్గ్ (రష్యా): సెయింట్ పీటర్స్‌బర్గ్ గవర్నమెంట్ రీజనల్ ఫారిన్ ఎఫైర్స్ విభాగం చీఫ్ ఎక్స్‌పర్ట్ పోలినా పోలుఖినాతో ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సేఫ్ & స్మార్ట్ సిటీ కోసం పౌరులతో చర్చలు, డేటా ఆధారిత నగర నిర్వహణ, డిజిటల్ ఎడ్యుకేషన్, విశ్వసనీయ మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. పోలినా పోలుఖినా మాట్లాడుతూ... డిజిటలైజేషన్ ద్వారా సెయింట్ పీటర్స్‌బర్గ్ ఖర్చును తగ్గించి రెండు లక్షల పని గంటలను ఆదా చేసిందని చెప్పారు.

సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - సెయింట్ పీటర్స్‌బర్గ్ గవర్నమెంట్ మధ్య ఒక వర్కింగ్ గ్రూపు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ప్రపంచంలో అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దాలని తాము కృతనిశ్చయంతో ఉన్నామని, ఇందుకు సంబంధించిన పనులు ఇప్పటికే వేగవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు.







# ఆర్కిటిక్ జల రవాణా మార్గంతో ఎన్నో ప్రయోజనాలు

- ఇంధనం, ఖర్చులు తగ్గి ఆదా పెరుగుతుంది
- ఆసియా, ఐరోపా మధ్య దూరం 40శాతం తగ్గుతుంది
- ఎరువుల రవాణా ఏపీకి ప్రయోజనకరం
- సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో గ్లోబల్ లాజిస్టిక్స్‌పై సదస్సులో మంత్రి నారా లోకేష్

సెయింట్ పీటర్స్‌బర్గ్ (రష్యా): సూయజ్ కాలువతో పోలిస్తే ఆర్కిటిక్ ఉత్తర సముద్ర మార్గం ఆసియా, ఐరోపా మధ్యదూరాన్ని దాదాపు 40శాతం తగ్గిస్తుంది. దీనివల్ల ప్రయాణ సమయం భారీగా తగ్గుతుందని, ఇంధనం-ఖర్చులు తగ్గి భారత దేశానికి ఆదా అవుతుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. గ్లోబల్ లాజిస్టిక్స్‌లో కొత్త అవకాశాలు-ఆర్కిటిక్‌లో లాజిస్టిక్స్ రూపురేఖలు (New Horizons of Global Logistics and Logistics Contour of the Arctic) అంశంపై సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన సదస్సులో మంత్రి లోకేష్ మాట్లాడారు.





## పొడవైన తీరం మాకు వరం

నేను భారతదేశంలోని తూర్పు తీరం నుంచి వచ్చాను. ఆంధ్రప్రదేశ్‌లో 1053 కి.మీ.లకు పైగా సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. మా రాష్ట్రంలో ఇప్పటికే ఆరు ఓడరేవుల్లో సముద్ర రవాణా కార్యకలాపాలు కొనసాగుతుండగా మరో నాలుగు ప్రధాన ఓడరేవులు నిర్మాణంలో ఉన్నాయి. భౌగోళికంగా సముద్ర తీర రాష్ట్రంగా ఉన్న ఏపీ ఇప్పటికే ప్రపంచంతో అను సంధానమై మారిటైమ్ కార్యకలాపాలు కొనసాగిస్తోంది. మాకు ఆర్కిటిక్ చాలా ముఖ్యమైనది. బంగాళాఖాతం తీరంలోని ఒక రాష్ట్రానికి, ఆర్కిటిక్ గుండా వెళ్లే నౌకా మార్గానికి ఏం సంబంధం అనే ప్రశ్న మీలో ఉదయించవచ్చు. అందుకు సమాధానం వ్లాడివోస్టాక్. వ్లాడివోస్టాక్ ఉత్తర సముద్ర మార్గానికి తూర్పు కొన. ఇది గత సంవత్సరం ప్రారంభమైన చెన్నై-వ్లాడివోస్టాక్ సముద్ర కారిడార్ ద్వారా భారతదేశ తూర్పు తీరానికి నేరుగా అనుసంధానమైంది. విశాఖపట్నంతో పాటు మా తీర ప్రాంతంలోని ఇతర ఓడరేవుల నుంచి ఓడలు ఇప్పటికే 24 రోజులు వ్లాడివోస్టాక్‌కు ప్రయాణిస్తున్నాయి. వ్లాడివోస్టాక్ నుంచి ఆర్కిటిక్ కారిడార్ పశ్చిమం వైపుగా ఐరోపా వరకు మార్గం తెరిచి ఉంటుంది. ఇది భారతదేశ తూర్పు తీరాన్ని, ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌ను ఈ మొత్తం వ్యవస్థలోకి సహజమైన దక్షిణ ప్రవేశ ద్వారంగా చేస్తుంది.

## ఎరువుల రవాణాకు ఎంతో ఉపయోగకరం

వ్యవసాయం ప్రధాన జీవనాధారమైన భారతదేశంలో అన్ని రాష్ట్రాలు పెద్ద ఎత్తున ఎరువులను వినియోగిస్తాయి. ప్రపంచంలో అతిపెద్ద ఎరువుల ఉత్పత్తిదారుల్లో రష్యా ఒకటి. ఇప్పుడు ఆ ఎరువులు బాల్టిక్ సముద్రం గుండా సూయజ్ మీదుగా హిందూ మహాసముద్రం దాటి మా ఓడరేవులకు ఒక సుదీర్ఘమైన, ప్రమాదకరమైన మార్గంలో ప్రయాణిస్తాయి. ఇది ఎక్కువ సమయం తీసుకోవడంతోపాటు అంతరాయాలకు గురయ్యే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న తాజా పరిణామాలే ఇందుకు నిదర్శనం. ఇప్పుడు అదే ఎరువులు రష్యాలోని ఆర్కిటిక్ ఓడరేవులో లోడ్ అయ్యి ఉత్తర సముద్ర మార్గం గుండా తూర్పుగా వ్లాడివోస్టాక్‌కు, ఆపై జపాన్ సముద్ర మార్గం నుంచి బంగాళాఖాతం గుండా దక్షిణంగా విశాఖపట్నానికి ప్రయాణిస్తే సమయం ఆదా కావడంతోపాటు దూరం తగ్గుతుంది. అంతరాయాలు కూడా తక్కువగా ఉంటాయి. ఎరువులతోపాటు ముడి చమురు, ఎల్ఎన్‌జీ, కీలక ఖనిజాలు... అన్నింటి రవాణా ఖర్చులు తగ్గి, కాలం కలిసి వస్తుంది.

ఉత్తర సముద్ర మార్గం ప్రస్తుతం సంవత్సరంలో సుమారు నాలుగు నుంచి ఐదు నెలల పాటు మాత్రమే పూర్తిగా తెరిచి ఉంటుంది. శీతాకాలంలో ఈ మార్గంలో రవాణా చాలా కఠినంగా ఉంటుంది. ఐస్‌బ్రేకర్ మద్దతు అవసరం, ఖర్చులు పెరుగుతాయి, ఆ నెలల్లో సరుకు రవాణా ఆర్థికంగా లాభదాయకం కాదు. కానీ ప్రయాణ దిశ స్పష్టంగా ఉంది. రష్యా తన ఐస్‌బ్రేకర్ నౌకాదళాన్ని విస్తరిస్తోంది. ఏడాది పొడవునా నౌకాయానం కోసం ప్రణాళికలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయి. ఈ మార్గం సంపూర్ణంగా అందుబాటులోకి వస్తే దానిని ఉపయోగించుకునేందుకు మాలాంటి తీర ప్రాంతాలు ఎదురు చూస్తున్నాయి.

ఇటీవలి సంవత్సరాల్లో ఎర్ర సముద్రం, సూయజ్ కాలువలో జరిగిన అంతరాయాలు, ఒకే కారిడార్‌పై ఆధారపడటం ప్రమాదకరమని ప్రతి వాణిజ్య దేశానికీ గుర్తు చేశాయి. ఆర్కిటిక్ మార్గాన్ని వినియోగించుకోవడానికి ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాల్లో పెట్టుబడి పెడుతోంది. లోతైన నీటి ఓడరేవులు, లాజిస్టిక్స్ పార్కులు, తీరం వెంబడి పారిశ్రామిక క్లస్టర్లు ప్రారంభ దశలో ఉన్నాయి. అందరి సహకారంతో ఈమార్గంలో అద్భుత అభివృద్ధిలో మేం భాగస్వాములవుతాం అని లోకేష్ వివరించారు.





చైతన్యరథం

# ఏపీలో స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు ఏర్పాటు చేయండి

**ఇండస్ట్రియల్ పార్కుల్లో డీశాలినేషన్ ప్లాంట్లు పెట్టండి**

**రోసాటమ్ ప్రతినిధులతో భేటీలో ఏపీ మంత్రి నారా లోకేష్ ప్రతిపాదనలు**



సెయింట్ పీటర్స్‌బర్గ్ (రష్యా): రష్యాకు చెందిన గ్లోబల్ న్యూక్లియర్ టెక్నాలజీ లీడర్ రోసాటమ్ (Rosatom) డైరెక్టర్ (ఐటీ & డిజిటలైజేషన్) అబాకుమోవ్ ఎవ్‌జెనీ (Mr Abakumov Evgeny), ఇంటర్నేషనల్ డైరెక్టర్ జనరల్ క్యాట్కోవ్స్కీ ఎగోర్ (Mr Kvyatkovsky Egor)తో ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సెయింట్ పీటర్స్ బర్గ్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... ఖాళీగా ఉన్న తీర ప్రాంత భూమిని ఉపయోగించి భారతదేశంలోని భారీ పారిశ్రామిక జోన్‌లకు స్వచ్ఛమైన, 24/7 క్యాప్టివ్ విద్యుత్ అందించడానికి, తదుపరి తరం స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లను ఏర్పాటుచేసేందుకు ఆంధ్రప్రదేశ్‌కు రావాలని ఆహ్వానించారు. భారతదేశ ఫార్మా రంగాన్ని, వ్యవసాయ ఎగుమతులను ప్రోత్సహించడానికి, సిద్ధంగా ఉన్న ప్లగ్-అండ్-ప్లే స్థలాన్ని ఉపయోగించుకుని ఒక న్యూక్లియర్ మెడిసిన్, ఫుడ్ ఇర్రాడియేషన్ సెంటర్ స్థాపించాలని కోరారు. ఏపీ మెగా ఇండస్ట్రియల్ పార్కుల్లో ఒక న్యూక్లియర్ డీశాలినేషన్ ప్లాంటు నిర్మాణానికి చొరవ చూపాలని ప్రతిపాదించారు. భారతదేశ ఏరోస్పేస్, రక్షణ రంగాలను నేరుగా అనుసంధానించేలా, మినరల్ బెల్ట్/ కారిడార్ పరిధిలో న్యూక్లియర్-గ్రేడ్ మిశ్రమ లోహాలు, కార్బన్-ఫైబర్ కాంపోజిట్‌ల తయారీ యూనిట్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

రోసాటమ్ డైరెక్టర్ అబాకుమోవ్ ఎవ్‌జెనీ మాట్లాడుతూ... తమ సంస్థ భారత్‌లో ఢిల్లీ కేంద్రంగా న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (NPCIL)తో కలిసి భారత్-రష్యా అణుశక్తి ఒప్పందాలు, ఇంజనీరింగ్ కాంట్రాక్టులు, పరికరాల స్థానికీకరణ నిర్వహిస్తుందని తెలిపారు. అధునాతన VVER-1000 రియాక్టర్లు, అణు ఇంధనం, జీవితకాల సాంకేతిక మద్దతు సరఫరా చేయడం ద్వారా ప్రతిష్టాత్మకమైన కూడంకుళం అణు విద్యుత్ ప్లాంట్ ప్రాజెక్టును ముందుకు నడిపిస్తుందని వివరించారు. భారీ పారిశ్రామిక విడిభాగాలు, వాల్వ్‌లు, పవన శక్తి పరికరాలను దేశీయంగా ఉత్పత్తి చేయడానికి రోసాటమ్ భారతీయ తయారీదారులతో భాగస్వామ్యం కుదుర్చుకుంటుందని వివరించారు. మంత్రి లోకేష్ చేసిన ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.

# ఆటోమోటివ్, ఏరోస్పేస్ అల్లాయ్ ప్లాంట్ ఏర్పాటు చేయండి

**అల్యూమినియం ఫాయిల్ తయారీ యూనిట్ నెలకొల్పండి**

**రుసాల్ సీనియర్ మేనేజ్‌మెంట్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ**



సెయింట్ పీటర్స్‌బర్గ్ (రష్యా): ప్రపంచంలోనే అతిపెద్ద అల్యూమినియం సంస్థల్లో ఒకటైన రుసాల్ (RUSAL) సీనియర్ మేనేజ్‌మెంట్‌తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారతదేశ పారిశ్రామిక కారిడార్లలో రెన్యువబుల్ ఎనర్జీని ఉపయోగించుకుని లో-కార్బన్ గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ & ఎక్స్‌ట్రూషన్ యూనిట్ నిర్మించండి.
భారతదేశంలోని డీప్‌వాటర్ పోర్టుల వద్ద ప్రత్యేకమైన వాటర్‌ఫ్రంట్ బెర్త్‌లు, క్రమబద్ధమైన కస్టమ్స్ క్లియరెన్స్‌లను ఉపయోగించుకుని ఒక కోస్టల్ అల్యూమినియం రిఫైనరీ, బాక్సైట్ దిగుమతి హబ్ అభివృద్ధి చేయడానికి భాగస్వామ్యం వహించండి.
భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్ ఎకో సిస్టమ్‌లకు నేరుగా అనుసంధానం చేస్తూ, విశాఖపట్నం-చెన్నై కారిడార్‌లో హైవాల్యూ ఆటోమోటివ్ & ఏరోస్పేస్ అల్లాయ్ ప్లాంట్ ఏర్పాటు చేయండి.
దక్షిణాసియాలో వేగంగా విస్తరిస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్, FMCG రంగాలకు సరఫరా చేయడానికి, ఒక పర్యావరణ అనుకూల అల్యూమినియం ఫాయిల్ తయారీ యూనిట్ నెలకొల్పాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

రుసాల్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు మాట్లాడుతూ... యూసీ రుసాల్ (UC RUSAL) మార్చి 2025లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పయనీర్ అల్యూమినియంలో 243 మిలియన్ డాలర్లకు 26% వాటా కొనుగోలు చేసిందని తెలిపారు. భారత్‌లోని ముంబై, న్యూఢిల్లీల్లో గల రుసాల్ కీలక వాణిజ్య కేంద్రాలు వాణిజ్య లాజిస్టిక్స్, కస్టమ్స్ క్లియరెన్స్‌లు, సాంకేతిక క్లయింట్ మద్దతును సమన్వయం చేస్తాయి. ఇక్కడి నుంచే రుసాల్ దక్షిణాసియా అంతటా ప్రాథమిక అల్యూమినియం, ప్రత్యేక మిశ్రమ లోహాల కోసం భారీస్థాయి పంపిణీ, సరఫరా ఒప్పందాలను నిర్వహిస్తుంది. భారతదేశంలోని ఆటోమోటివ్, ఏరోస్పేస్, పవర్ రంగాలకు అనుగుణంగా రూపొందించిన ప్రీమియం అల్యూమినియం-సిలికాన్, అల్యూమినియం-మెగ్నీషియం మిశ్రమ లోహాలను అందిస్తుంది. ద్వైపాక్షిక కారిడార్ల కింద, రుసాల్ ఒక కీలకమైన సప్లయ్ చైన్ భాగస్వామిగా పనిచేస్తూ, భారీ స్థాయి అంతర్జాతీయ రవాణాతో దేశీయ ముడి పదార్థాల కొరతను తీరుస్తుందని తెలిపారు. మంత్రి లోకేష్ చేసిన ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.

*రుసాల్ (RUSAL) సంస్థ గురించి:*

మాస్కో కేంద్రంగా పనిచేస్తున్న రుసాల్ సంస్థ ప్రపంచంలోనే అతిపెద్ద అల్యూమినియం ఉత్పత్తిదారుల్లో ఒకటి. ఇది బాక్సైట్ మైనింగ్, అల్యూమినా రిఫైనింగ్, అధునాతన గ్రీన్ అల్యూమినియం తయారీ (ALLOW బ్రాండ్) వంటి రంగాల్లో సమగ్రంగా విస్తరించి ఉంది. ఐదు ఖండాల్లోని 20 దేశాల్లో 90వేల మందికిపైగా ఉద్యోగులు కలిగిన ఈ సంస్థ గత ఏడాది సుమారు 12.2 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది.

# డీఎస్సీ-2025 నియామకాలు పూర్తి పారదర్శకం: ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్

- **ప్రతి నియామకం పారదర్శకం: విద్యా శాఖ కార్యదర్శి శశిధర్**
- **ధృవీకరణ ఆధారంగానే స్పోర్ట్స్ కోటా ఎంపికలు: శాప్ ఎండి భరణి**




అమరావతి(చైతన్యరథం): డీఎస్సీ-2025 నియామకాల్లో సుప్రీం కోర్టు మార్గదర్శకాలు, జీవోఎంఎస్ నెం.77ప్రకారమే హారిజాంటల్ రిజర్వేషన్లను అమలు చేస్తూ పూర్తి పారదర్శకతతో నియామక ప్రక్రియ నిర్వహించినట్టు సర్వీసెస్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ స్పష్టం చేశారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, శాప్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ భరణితో కలిసి పాత్రికేయులతో మాట్లాడిన ఆయన నియామకాలపై సోషల్ మీడియాలో వ్యాపిస్తున్న తప్పుడు ప్రచారాలను తీవ్రంగా ఖండించారు.
హారిజాంటల్ రిజర్వేషన్ విధానాన్ని వివరిస్తూ రావత్ మాట్లాడారు. రిజర్వేషన్లు రెండు రకాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు వెర్టికల్ రిజర్వేషన్లు వర్తిస్తాయని, మహిళలు,దివ్యాంగులు, మాజీ సైనికులు, క్రీడాకారులకు హారిజాంటల్ రిజర్వేషన్లు వర్తిస్తాయని వివరించారు. వెర్టికల్ రిజర్వేషన్లకు 100 పాయింట్ల రోస్టర్ వ్యవస్థలో నిర్దిష్ట రోస్టర్ పాయింట్లు ఉంటాయని,అయితే హారిజాంటల్ రిజర్వేషన్లకు స్థిరమైన రోస్టర్ పాయింట్లు ఉండవని స్పష్టం చేశారు. స్పోర్ట్స్ కోటా లేదా దివ్యాంగుల కోటా అభ్యర్థి ఏ సామాజికవర్గానికి చెందినవారైనా, ఆ కమ్యూనిటీ వర్గం పరిధిలోనే సంబంధిత రిజర్వేషన్ పరిగణించబడుతుందని తెలిపారు.

ఇంద్రసాహ్నీ కేసు (1992), రాజేష్‌కుమార్ దర్యా కేసు(2007), ఉత్తరాఖండ్ ప్రభుత్వం వర్సెస్ మమతా బిష్ట్(2010)వంటి సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం హారిజాంటల్ రిజర్వేషన్లకు ఫిక్స్‌రోస్టర్ పాయింట్లు ఉండవని, నిర్దిష్ట శాతం పరిధిలోనే రిజర్వేషన్లు అమలు కావాలని, మెరిట్ ఆధారంగా ఎంపికైన అభ్యర్థులను సంబంధిత కమ్యూనిటీవర్గాల్లోనే సర్దుబాటు చేయాలని ఆయన వివరించారు. ఈఅంశాలపై ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీ నివేదిక సమర్పించిన అనంతరమే జీవోఎంఎస్ నెం.77 జారీ చేసినట్టు తెలిపారు.

## ప్రతి నియామకం పారదర్శకం: విద్యా శాఖ కార్యదర్శి శశిధర్

రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ జీవోఎంఎస్ నెం.77అమలులోకి వచ్చిన తర్వాత జరిగిన తొలి భారీనియామక ప్రక్రియ డీఎస్సీ-2025 కావడంతో,హారిజాంటల్ రిజర్వేషన్ల అమలుపై కొంత రిలో సందేహాలు వ్యక్తమవడం సహజమేనని అన్నారు. అయితే మొత్తం ఎంపిక ప్రక్రియలో ఎటువంటి నిబంధనల ఉల్లంఘన జరగలేదని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పూర్తిగా పాటించినట్టు స్పష్టం చేశారు.

హారిజాంటల్ రిజర్వేషన్ విధానాన్ని సులభంగా అర్థమయ్యేవిధంగా ఆయన ఒక ఉదాహరణ ఇచ్చారు. ముందుగా మెరిట్ ఆధారంగా ప్రయాణికులను బస్సులో ఎక్కించిన తర్వాత, మహిళలు లేదా ఇతర హారిజాంటల్ వర్గాల శాతం తక్కువగా ఉంటే అదే కమ్యూనిటీ పరిధిలో సర్దుబాటు చేయడమే హారిజాంటల్ రిజర్వేషన్ విధానమని వివరించారు. ముందుగానే ప్రత్యేక రోస్టర్ పాయింట్లు కేటాయించడం హారిజాంటల్ రిజర్వేషన్ విధానం కాదని నొక్కి చెప్పారు. దివ్యాంగుల కోటాలో దరఖాస్తు చేసిన ప్రతి అభ్యర్థిని మెడికల్ బోర్డుకు రిఫర్ చేసి, 40శాతం లేదా అంతకంటే ఎక్కువ దివ్యాంగత ధృవీకరణ పొందిన వారినే అర్హులుగా పరిగణించినట్లు తెలిపారు. 3.36 లక్షలకు పైగా అభ్యర్థులు పోటీ పడిన ఈ ప్రక్రియలో పోస్టుల సంఖ్య పరిమితంగా ఉండటంతో నిరాశ సహజమేనని,అయితే ఆధారరహిత ఆరోపణలతో ఎంపిక ప్రక్రియను తప్పుగా చిత్రీకరించడం సరికాదని హెచ్చరించారు.

## ధృవీకరణ ఆధారంగానే స్పోర్ట్స్ కోటా ఎంపికలు: శాప్ ఎండి భరణి

స్పోర్ట్స్ కోటా నియామకాల విషయంలో అన్ని నిబంధనలు, జి.ఓ.మార్గదర్శకాలు,ధృవీకరణ ప్రక్రియలను కచ్చితంగా అమలు చేసినట్లు శాప్ వి.సి. & ఎం.డి. భరణి స్పష్టంచేశారు. స్పోర్ట్స్ సర్టిఫికెట్లు ప్రభుత్వం జారీ చేయదని, రాష్ట్రస్థాయి క్రీడా సంఘాలు, జాతీయ ఫెడరేషన్లు, విశ్వవిద్యాలయాలు, గుర్తింపు పొందిన క్రీడా సంస్థలే వాటిని జారీ చేస్తాయని తెలిపారు. అభ్యర్థులు సమర్పించిన ప్రతి సర్టిఫికెట్‌ను సంబంధిత సంస్థల ద్వారా ధృవీకరించిన తర్వాతే పరిగణనలోకి తీసుకున్నట్లు వెల్లడించారు.

ఒలింపిక్స్, కామన్వెల్త్, జాతీయస్థాయి పోటీలు, రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌లు, ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలు, యూనివర్సిటీ గేమ్స్, స్కూల్ గేమ్స్, సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ క్రీడా పోటీలకు జి.ఓ.ల ప్రకారం నిర్దిష్ట ప్రాధాన్యత క్రమం అమలులో ఉందని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుసమయంలో అప్‌లోడ్‌చేసిన సర్టిఫికెట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారని నోటిఫికేషన్‌లో ముందే స్పష్టం చేసినట్లు తెలిపారు. నకిలీ సర్టిఫికెట్లు సమర్పిస్తే అభ్యర్థిత్వం రద్దు, చట్టపరమైన చర్యలు, అవసరమైతే సంబంధిత అధికారులపై విచారణ జరుపుతామని హెచ్చరించారు. నిజంగా లోపాలు లేదా తప్పు ఎంపికలు జరిగాయని ఆధారాలతో ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని భరణి హామీ ఇచ్చారు. ఈసమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ పాల్గొన్నారు.

# కుట్ర రాజకీయాలకు అలవాటుపడ్డారు



- గులాకరాయి నాటకంనుండి వైఎస్ఆర్ విగ్రహాల ధ్వంసం వరకు
- రోజుకొక అబద్ధం.. వారానికో కుట్ర.. నెలకో కృత్రిమ వివాదం
- ఇదే వైసీపీ రాజకీయ సంస్కృతి
- 11 అసెంబ్లీ స్థానాలకు పరిమితం చేసినా పాఠాలు నేర్చుకోలేదు
- వైసీపీపై నిప్పులు చెరిగిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా

అమరావతి (చైతన్య రథం): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ రావు శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్‌పై తీవ్రంగా విరుచుకుపడ్డారు. అబద్ధాలు, కుట్రలు, తప్పుడు ప్రచారాలు, ప్రజాస్వామ్య సంస్థలపై అపనమ్మకం కలిగించే ప్రయత్నాలే వైసీపీ రాజకీయ సంస్కృతికి పునాదిగా మారాయని మండిపడ్డారు. అయిదేళ్ల దుష్పరిపాలన, అవినీతి, రాజకీయ కక్షపూరిత చర్యలు, పాలనాపరమైన అరాచకాలను ఓర్చుకున్న తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రజలు రెండేళ్ల క్రితం చారిత్రాత్మకంగా వైసీపీని తిరస్కరించారని ఆయన గుర్తుచేశారు. అయినప్పటికీ శాసనసభలో కేవలం 11 స్థానాలకు పరిమితమైన పార్టీ ఇంత వరకు ఆత్మవిమర్శకు దిగడం లేదని విమర్శించారు.

ఎన్నికలకు ముందు వెలుగులోకి వచ్చిన గులాకరాయి ఘటన నుండి తాజాగా రాజశేఖరరెడ్డి విగ్రహాల ధ్వంసం వివాదం వరకు -వైసీపీ నాయకత్వం ప్రతిసారీ సున్నితమైన సంఘటనలను సానుభూతి రాజకీయాల వేదికగా మార్చుకుంటూ సంకీర్ణ ప్రభుత్వంపై అపనమ్మకం రగిలించే పనిలో నిమగ్నమైందని పల్లా ఆరోపించారు.

**అధికారంలో దుష్పాలన, ప్రతిపక్షంలో కుట్రలు**

అయిదేళ్ల పాలనలో వైసీపీ సామాజిక, ప్రాంతీయ, రాజకీయ విభజనలను పెంచిపోషిస్తూ ఘర్షణ వాతావరణాన్ని ప్రోత్సహించిందని టీడీపీ నేత పేర్కొన్నారు. ప్రజలచే తీవ్రంగా తిరస్కరించబడిన తర్వాత తప్పుడు సమాచారం, కృత్రిమ వివాదాల ద్వారా రాజకీయంగా జీవించి ఉండేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. సంకీర్ణ ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాల వేగం, సంక్షేమ చొరవలు వైసీపీ నాయకత్వాన్ని కలవరపెట్టడంతో విమర్శలు, వాస్తవ వక్రీకరణల ప్రచారాన్ని ఆపకుండా కొనసాగిస్తోందని ఆయన అన్నారు. నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించడానికి బదులు నిరాశావాదాన్ని, గందరగోళాన్ని వ్యాప్తి చేయడానికే పార్టీ ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

రాజకీయ ఎదురుదెబ్బలు తగిలినప్పుడల్లా సానుభూతి రాజకీయాలపై ఆధారపడడం వైసీపీకి అలవాటైన విధానంగా మారిపోయిందని పల్లా శ్రీనివాస్ రావు ఆరోపించారు. ఎన్నికలవేళ సంచలనం సృష్టించిన గులాకరాయి ఘటన విడిపడిన సంఘటనలను రాజకీయ లబ్ధి కోసం విస్తరింపజేసే విస్తృత ధోరణిలో భాగమేనని పేర్కొన్నారు. పరిపాలన, జవాబుదారీతనంవంటి కీలకమైన ప్రశ్నల నుండి దృష్టి మళ్లించేందుకు వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి భావోద్వేగ సమస్యలను పదేపదే వాడుకుంటున్నారని ఆరోపించారు. అసౌకర్యకరమైన వాస్తవాలను దాచిపెడుతూ కల్పిత కథనాలు నిర్మించడం పార్టీ రాజకీయ విధానంలో విధిగా మారిందని వ్యాఖ్యానించారు.

**అభివృద్ధిని అడ్డుకొనే నిరంతర ప్రయాస**

ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని క్రమపద్ధతిలో వ్యతిరేకిస్తోందని పల్లా వైసీపీపై ఆరోపించారు. అమరావతి పునర్నిర్మాణం, పోలవరం ముమ్మర వేగం, సంక్షేమ సంస్కరణలు, పారిశ్రామిక వికాసం లేదా పెట్టుబడుల ఆకర్షణ.. ప్రతి విషయంలోనూ ప్రతిపక్షం అడ్డంకులు సృష్టించడానికి, అనిశ్చితి వ్యాప్తి చేయడానికి యత్నిస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా విశాఖపట్నంలో గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి అంతర్జాతీయ సంస్థలకు కేటాయించిన భూముల విషయంలో వ్యాజ్యాలు, ప్రతికూల ప్రచారాల ద్వారా పెట్టుబడిదారుల్లో అభద్రతను నింపేందుకు పదేపదే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, యువతకు ఉపాధి అవకాశాలకు నష్టం కలిగిస్తాయని హెచ్చరించారు.

**మతసంస్థల రాజకీయీకరణ**

పవిత్ర మతసంస్థలను రాజకీయాలలోకి లాగడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, తిరుమల, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాలను కూడా పక్షపాత రాజకీయ ప్రచారాల్లో వాడుకుంటున్నారని పల్లా ఆరోపించారు. ఆలయ పరిపాలన, ప్రసాదాల నాణ్యత, గోశాలలు, యాత్రికుల సౌకర్యాలకు సంబంధించి తప్పుడు కథనాలు పదే పదే ప్రచారం చేస్తూ భక్తుల్లో అపనమ్మకం కల్పించడానికి, ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయడానికి వైసీపీ యత్నిస్తోందని ఆరోపించారు. సాధారణ పరిపాలనా విషయాలను సంచలనంగా చూపిస్తూ పెద్ద వివాదాలుగా అభివర్ణించడం మతసంస్థల పవిత్రత పట్ల తీవ్రమైన అగౌరవాన్ని ప్రకటిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.

**ఘర్షణ సృష్టించేందుకే పర్యటనలు**

జగన్మోహన్‌రెడ్డి ఇటీవలి నెలల్లో చేపట్టిన పలు పర్యటనలు ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కాకుండా ఘర్షణలు రగిలించడానికే ఉద్దేశించినట్లు తీవ్రమైన ఆరోపణలు చేశారు. రైతులతో సంఘీభావం పేరైనా, స్థానిక సమాజాలతో సంవాదం పేరైనా.. ఇలాంటి పర్యటనలు తరచూ వివాదాలకు, అశాంతికి, రాజకీయ ఆందోళనలకు దారితీస్తున్నాయని పేర్కొన్నారు. దళితులు, అట్టడుగు వర్గాలకు సంబంధించిన సున్నితమైన సామాజిక విషయాలను రాజకీయ లబ్ధి కోసం ఉద్రేకాలు రగిలించడానికి ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. తీవ్రమైన నేర ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను బాధితులుగా చిత్రించే ప్రయత్నాలు న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని బలహీనపరుస్తాయని, సమాజ వ్యతిరేక శక్తులను ప్రోత్సహించడమవుతుందని పల్లా విమర్శించారు.

నంద్యాల జిల్లాలో వైఎస్ఆర్ విగ్రహాల ధ్వంసం ఘటనలకు సంబంధించి వెలుగులోకి వస్తున్న వాస్తవాలు తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని, ఒక ప్రశాంత వాతావరణంలో రాజకీయ ప్రయోజనాల కోసం అశాంతిని రగిలించే పెద్ద కుట్రను బయటపెడుతున్నాయని ఆయన అన్నారు.

**ప్రజలు తిరస్కరించినా మారని తీరు**


అవినీతి, కక్షపూరిత పాలన, అభివృద్ధి వ్యతిరేక విధానాలు, రాజకీయ అవకాశవాదం వంటి వాటిపై ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమ తీర్పు ఇచ్చేశారని పల్లా పేర్కొన్నారు. పార్టీ 11 స్థానాలకు కుంచించుకుపోవడం కేవలం ఎన్నికల ఓటమి మాత్రమే కాదు.. ఘర్షణ, అబద్ధాలు, పాలనాపరమైన అరాచకాలపై ఆధారపడిన రాజకీయ విధానాన్ని ప్రజలు తిరస్కరించిన చారిత్రాత్మక నిర్ణయమని ఆయన అన్నారు. అంత స్పష్టమైన ప్రజాదేశం ఉన్నప్పటికీ వైసీపీ తన పాత విధానాలను వదులుకోవడానికి సిద్ధంగా కనిపించడం లేదని, ఆరోపణలు, కుట్రలు, రాజకీయ నాటకాల చక్రాన్ని అదే వేగంతో తిప్పుతూనే ఉందని వ్యాఖ్యానించారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

పెట్టుబడులను నిరుత్సాహపరచడం, ప్రాజెక్టులను ఆలస్యం చేయడం, అనిశ్చిత వాతావరణం నెలకొల్పడం ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణాన్ని అడ్డుకోవడమే వైసీపీ ప్రధాన లక్ష్యంగా మారిందని పల్లా ఆరోపిస్తూ పౌరులను అప్రమత్తంగా ఉండాలని పిలుపు ఇచ్చారు. రాష్ట్రం ఆర్థికాభివృద్ధి, పారిశ్రామిక వికాసం, ఉపాధి కల్పన దిశగా స్థిరంగా పురోగమిస్తుండగా కొన్ని రాజకీయ శక్తులు సంకుచిత పక్షపాత ప్రయోజనాల కోసం ఆ పురోగతిని అడ్డుకోవడానికే పట్టుదలగా ఉన్నాయని పేర్కొన్నారు. "ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు, ఇక్కడి యువత ఆకాంక్షలు, రాష్ట్ర అభివృద్ధి గమనం -వ్యూహాత్మక రాజకీయ ఆటలకు బలయ్యే పరిస్థితి రాకూడదు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అభివృద్ధి, స్థిరత్వం, పురోగతి వైపు దృఢంగా నిలబడాలి" అని పల్లా శ్రీనివాస్ రావు స్పష్టం చేశారు.

# వర్చువల్ అకాడమీకి డీపీఆర్ సిద్ధం

**- తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్‌డి విల్సన్**



విజయవాడ (చైతన్య రథం): తమిళనాడు తరహాలో తెలుగు వర్చువల్ అకాడమీ ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధం చేసినట్టు తెలుగు మరియు సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్ ఏ శరత్‌చంద్ర వెల్లడించారు. శుక్రవారం వద్దేశ్వరంలోని అకాడమీ కార్యాలయంలో జరిగిన పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతూ తమిళనాడులో 45 దేశాలకు తమిళం నేర్పిస్తున్న తరహాలో తెలుగు భాష నేర్పించడానికి వర్చువల్ అకాడమీ ఏర్పాటు చెయ్యాలన్న సంకల్పంతో బృహత్ కార్యక్రమాన్ని చేపట్టామని, దీనికి సంబంధించిన డీపీఆర్ మంత్రి లోకేష్‌కి సమర్పిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమం విజయవంతంగా ముందుకు పోవడానికి ప్రాథమికంగా కనీసం వందకోట్లు కేటాయించాలని కోరినట్టు తెలియచేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన మైగ్రేటెడ్ లేబర్‌తోపాటు ఇతర దేశాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొన్న వారికి కూడా భాషను పరిచయం చేస్తామన్నారు. అకాడమీ ముద్రించే ఇంటర్ పుస్తకాలు బుక్ షాప్స్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు అకాడమీ పుస్తకాలు కొనుగోలు చేయడం లేదని, దానివల్ల అకాడమీకి తీరని నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వ సిలబస్‌తో తయారైన పుస్తకాలు కొనుగోలు చేయకుండా తాము తయారు చేసుకొనే కంటెంట్ వినియోగించు కోవడం సరైనది కాదన్నారు. ముఖ్యంగా చైతన్య, నారాయణ, బాష్యంలాంటి సంస్థలు తమ విద్యార్థులు కొనుగోలు చేసేలా మార్గదర్శకత్వం చెయ్యాలన్నారు. భవిష్యత్తులో ప్రతి కాలేజీ సందర్శిస్తామని, 2010లో ఉమ్మడి రాష్ట్రములో అకాడమీ పుస్తకాలు కొనుగోలు చేసేలా జీవో విడుదల చేశారని దానిని ఇప్పటికీ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుందని అకాడమీ నష్టాలలోకి పోకుండా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే లోకేష్‌ను కోరినట్టు విల్సన్ తెలియచేశారు. తెలుగు అకాడమీ కంటెంట్ వాడకుండా పైరసీ చేస్తే కాపీరైట్ ఉల్లంఘనకు పాల్పడినట్టు అవుతుంది అన్నారు. లక్షలాది ఇంటర్ విద్యార్థుల హక్కులు కాపాడ్డానికి అకాడమీ సిద్ధంగా ఉందన్నారు. అకాడమీ కంటెంట్ వాడే ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలకు సిఫారస్ చేస్తామన్నారు.

**యోజన తరహాలో మ్యాగజైన్**

యోజన తరహాలో త్వరలో మ్యాగజైన్ విడుదల చేస్తున్నామన్నారు. విద్యా, వైజ్ఞానిక, సాహిత్యం మహిళా సాధికారిత లక్ష్యంగా మ్యాగజైన్ రూపొందిస్తున్నట్టు విల్సన్ తెలియచేసారు.

**అకాడమీ పోస్టుల భర్తీ**

అకాడమీ పోస్టుల భర్తీ విషయంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు లేఖ రాయడం జరిగిందన్నారు. ఏపీపీఎస్సీ ఆలస్యం చేసే పరిస్థితి ఉంటే ఇతర ప్రభుత్వ ఏజెన్సీలకు అప్పగించాలన్నారు. తెలుగు మరియు సంస్కృత అకాడమీ ఔనత్యం కాపాడాలంటే కేబినెట్ క్యాడర్ ఇవ్వాలని విల్సన్ కోరారు. తిరుపతి కేంద్రంగా సంస్కృత అకాడమీ అభివృద్ధి చేస్తామని అందుకు తిరుమలలో ఐదు ఎకరాలు కేటాయించాలని విల్సన్ కోరారు. ఈమేరకు టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడుకి విజ్ఞప్తి చేశామన్నారు. జాతీయ సంస్కృత యూనివర్సిటీ తిరుపతిలోవున్న నేపథ్యంలో స్థల సేకరణ అనివార్యమన్నారు. సంస్కృత భాష అభివృద్ధికి తిరుమల తిరుపతి నిధులు కేటాయించాలని కోరారు. తెలుగు అకాడమీ ప్రధాన భవనం కోసం రెండు ఎకరాల స్థలం కోరామని, త్వరలో స్థలం కేటాయిస్తే అకాడమీ నిధులతో భవన నిర్మాణం చేపడతామని విల్సన్ పేర్కొన్నారు.



# సైకిల్ తొక్కిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

***సూరంపాలెం ఎంఎస్ఎంఈ పార్కు పరిశీలన***

పెద్దాపురం (చైతన్య రథం): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా పెద్దాపురంలో పర్యటించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూటమి నాయకులతో కలిసి సైకిల్‌పై పట్టణం చుట్టి అందరి దృష్టిని ఆకర్షించారు. దర్గా సెంటర్ నుండి మమ్మీ చర్చ్ వరకు 3 కిలోమీటర్ల దూరం సైకిల్ తొక్కిన మంత్రి, మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్పతో కలిసి మమ్మీ చర్చ్ వద్ద మొక్కలు నాటారు. రాష్ట్రంలో ప్రస్తుతం 31 శాతంగా ఉన్న గ్రీన్ బెల్ట్‌ను 50 శాతానికి పెంచాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు, అటవీశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు మంచి గ్రీన్ జోన్ అందించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే చినరాజప్పతో కలిసి సూరంపాలెంలో నిర్మాణంలో ఉన్న ఎంఎస్ఎంఈ పార్కును పరిశీలించిన మంత్రి, ఆ పార్కు అభివృద్ధి తీరును ప్రశంసించారు.

చైతన్యరథం

# పేర్ని నాని ఓ కామెడీ పీస్!

- ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకం, అకృత్యాలు, విధ్వంసం తప్ప ఏమీ లేదు
- బందరులో పేర్ని ఆధ్వర్యంలో అక్రమ కేసులు, అరెస్టులతో విద్వేష పాలన
- పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై విద్వేషాలు సృష్టిస్తామంటే తోలు వలిచేస్తాం
- ప్రజా సమస్యల పరిష్కారంతో సమగ్రాభివృద్ధి సాధిస్తామన్న మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్య రథం): ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో విధ్వంసం, విద్వేషం రాజ్యమేలితే.. ప్రస్తుతం అభివృద్ధి, సంక్షేమం దిశగా రాష్ట్రం అడుగులు వేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. పలు సమస్యలకు అక్కడే పరిష్కారం చూపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా నడుచుకుంటోందన్నారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. "గత ఐదేళ్లు రాష్ట్రంలో అరాచకం, అకృత్యాలు, విధ్వంసం లక్ష్యంగా పాలన సాగింది. మచిలీపట్నంలో ఆ విధ్వంసం విద్వేషాలు, అరాచకాలు, అక్రమ కేసులు, అరెస్టులతో మరోస్థాయికి తీసుకెళ్లిన దుర్మార్గుడు పేర్ని నాని. పోలీస్ స్టేషన్లపై దాడులు చేశారు. అధికారులపై దాడులు చేశారు. మచిలీపట్నంలో గతంలో ఎప్పుడూ కనీవినీ ఎరుగని భయానక పరిస్థితులు కల్పించారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డి ఒక రకమైన విధ్వంసం సృష్టిస్తే.. మచిలీపట్నంలో పేర్ని నాని తన కుమారుడిని అడ్డం పెట్టుకుని షాడో రాజకీయాలు చేశాడు. ప్రజల్ని, ప్రత్యర్థుల్ని నానా అవస్థలకు గురి చేశారు. ఫలితంగా 52 వేల ఓట్ల తేడాతో పేర్ని అరాచకానికి ప్రజలు సమాధి కట్టారు" అన్నారు.

"కూటమి అధికారంలోకి వచ్చిన రోజునుండి మచిలీపట్నంలో అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చాం. అవసరం మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నాం. మచిలీపట్నం నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. త్వరలోనే ఆ ప్రణాళిక ప్రజలకు వివరిస్తాం. స్పెషల్ పర్పస్ వెహికిల్ ఏర్పాటు చేసి మచిలీపట్నంలో పోర్టు, ఆక్వా, గోల్డ్ కవరింగ్ వర్క్స్, రోడ్లు, రైల్వే, టూరిజం, పరిశ్రమలు వంటి అన్ని రంగాలను అనుసంధానిస్తాం. భవిష్యత్తులో రాబోయే పరిశ్రమల్లో స్థానిక యువతకు భాగస్వామ్యం కల్పిస్తాం. మహిళా స్వయం సమృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తున్నాం. సీ వీడ్‌పై మహిళలకు ప్రత్యేక శిక్షణ కల్పించబోతున్నాం. మచిలీపట్నాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకూ ఆ ప్లాన్ విస్తరిస్తాం. కృష్ణా జిల్లా మొత్తాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి చేస్తాం. చేసింది చెప్పి ప్రజల్లోకి వెళ్తాం. 2029 ఎన్నికల్లో అన్ని ఎమ్మెల్యే స్థానాలు, ఎంపీ స్థానాలు గెలిచి చూపిస్తా"మని మంత్రి కొల్లు రవీంద్ర ధీమా వ్యక్తం చేశారు.

"ఈ జిల్లా నుండి మంత్రులుగా పని చేసిన కొడాలి నాని, పేర్ని నాని, జోగి రమేష్ సహా ఎమ్మెల్యేల్లో ఏ ఒక్కరు కూడా జిల్లా అభివృద్ధి కోసం ఆలోచించలేదు. మంత్రిగా ఉన్న పేర్ని నాని మచిలీపట్నం మున్సిపాలిటీకి ఏం చేశాడో కూడా చెప్పుకోలేకపోతున్నాడు. కృష్ణా జిల్లాలోని వైసీపీ నేతలంతా పిట్టల దొరల్లా జగన్ రెడ్డికి భజన చేయడం, గంగిరెద్దులా తలూపడం తప్ప చేసిందేమీ లేదు. జిల్లా అభివృద్ధికి నేను చేసింది ఇదీ అని చెప్పలేని పరిస్థితి. పిచ్చి పట్టినట్లు ఏదేదో వాగి పేర్ని నాని కామెడీ పీస్‌లా మారిపోయాడు. పూటకో ప్రాంతంలో మీటింగు పెట్టి అక్కడ ఎమ్మెల్యేల గురించి మాట్లాడుతున్న పేర్ని నానికి భవిష్యత్తులో టికెట్ కూడా దక్కదు. బియ్యం కేసులో అరెస్టు చేయనపుడు చంద్రబాబు దేవుడు అన్నాడు. బెయిల్ తెచ్చుకుని ఇప్పుడు అరెస్టు చేయలేదు.. అరెస్టు చేయలేరు అంటున్నాడు. మిస్టర్ పేర్ని నానీ.. మేము కొట్టే దెబ్బకు కుంభస్థలం పగలడం తథ్యం. 2024లో 50 వేల ఓట్ల తేడాతో గెలిచాం. వచ్చే ఎన్నికల్లో మెజార్టీని డబుల్ చేస్తాం. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి కనీసం డిపాజిట్లు కూడా రావు. సింగిల్ డిజిట్‌కి పరిమితం చేయడం తథ్యం" అని మంత్రి హెచ్చరించారు.

'సర్' కార్యక్రమంలో భాగంగా 2002 తర్వాత ఓటర్ జాబితాను సవరిస్తున్నారు. చనిపోయిన వారిని జాబితా నుండి తీసి, కొత్త ఓటర్లను చేర్చడమే ఈ కార్యక్రమం లక్ష్యం. 2019 ఎన్నికల్లో ఓటర్ జాబితాల్లో చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. చింతగుంటపాలెంలోని ఒక కుటుంబంలో 11 ఓట్లు ఉంటే.. ఒక ఓటు మాత్రమే ఓటర్ జాబితాలో ఉంచారు. ఓటర్ జాబితాలో మోసాలకు పాల్పడి అధికారంలోకి వచ్చారు. అందుకే నేడు ప్రతి ఓటును పరిశీలిస్తున్నాం. ఓటు హక్కున్న ప్రతి ఒక్కరూ తమ ఓటు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. ఓటు హక్కును హరిస్తామంటే కఠిన చర్యలు తప్పవు. కూటమి నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లను పరిశీలిస్తారని, అడ్డుకుంటే ఉపేక్షించేది లేదని మంత్రి కొల్లు హెచ్చరించారు.

అమరావతి రైతులకు తాను అండగా ఉంటానంటూ జగన్ రెడ్డి వారితో సమావేశాలు పెట్టి మొసలి కన్నీరు కార్చడం హాస్యాస్పదం. గత ఐదు సంవత్సరాలు అమరావతి రైతులపై సాగించిన దుర్మార్గాలు మరిచిపోయారా? న్యాయ స్థానం నుండి దేవస్థానం నినాదంతో పాదయాత్రగా వెళ్తున్న అమరావతి మహిళా రైతుల పొత్తి కడుపుల్లో బూటు కాళ్లతో తన్నించారు. లాఠీలతో రక్తాలు కారేలా దాడులు చేశారు. వారు కట్టుకున్న చీరల్ని అవహేళన చేశారు. వారిపై మద్యం బాటిళ్లతో దాడులు చేశారు. చేయాల్సిన ఘోరాలన్నీ చేసి ఇప్పుడు నీతులు చెబుతున్నారంటూ మంత్రి కొల్లు ఎద్దేవా చేశారు.

చంద్రబాబుపై నమ్మకం, చంద్రబాబు విజన్‌పై నమ్మకం, పాలనా దక్షతపై నమ్మకంతో అమరావతికి భూములిచ్చేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ప్రపంచానికి ఆదర్శంగా అమరావతి నిర్మాణం చేపట్టాం. ప్రపంచంలోని ప్రతి పర్యాటకుడికి డ్రీమ్ డెస్టినేషన్‌గా అమరావతి తయారు కాబోతోంది. గత ఐదు సంవత్సరాలు అభివృద్ధి చేతకాక, పరిశ్రమల్ని తరిమేశారు. ఈ రోజు వస్తున్న పెట్టుబడుల్ని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. కార్యక్రమంలో రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యన్నారాయణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హాస్టళ్లలో పారిశుద్ధ్యంపై రాజీ లేదు

### విద్యార్థుల సంరక్షణలో నిర్లక్ష్యానికి చోటులేదు: మంత్రి సవిత



విజయవాడ (చైతన్యరథం): బీసీ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని బీసీ సంక్షేమ శాఖామంత్రి సవిత స్పష్టం చేశారు. బీసీ హాస్టళ్ల వార్డెన్లు, గురుకులాల ప్రిన్సిపాళ్లతో ఆమె శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. త్వరలో 1,291 పారిశుద్ధ్య సిబ్బంది పోస్టులు భర్తీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. కొత్తగా 142 మంది కుక్కులు, కమాటీలను నియమించనున్నారు. 222మంది సచివాలయ సిబ్బందిని బీసీ హాస్టళ్లకు డిప్యూటేషన్‌పై పంపనున్నారు. హాస్టళ్ల పనితీరు ఆధారంగా గ్రేడింగ్ విధానం అమలు చేయనున్నారని, ఆ గ్రేడింగ్ ఆధారంగానే వార్డెన్లకు బదిలీలు, పదోన్నతుల్లో ప్రాధాన్యత నిర్ణయిస్తారని పేర్కొన్నారు. 6 ఎంజేపీ స్కూళ్లను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. అదనంగా 10 కొత్త ఎంజేపీ స్కూళ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. హాస్టళ్లు, గురుకులాల్లో కిచెన్ గార్డెన్ పేరిట కూరగాయల పెంపకం చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు హెల్త్ చెకప్‌లు తప్పనిసరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. జూన్ 12నుండి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుందని గుర్తు చేసిన మంత్రి, హాస్టళ్లు, గురుకులాల పరిసరాలు, మరుగుదొడ్లు, తరగతి గదులు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల సంరక్షణలో నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆరోపణలకు, అవకతవకలకు ఆస్కారం లేకుండా హాస్టళ్లు నిర్వహించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఎంజేపీ స్కూళ్ల కార్యదర్శి మాధవీలత, డీబీసీడబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు పాల్గొన్నారు.

### ఏపీటీఎస్ సైబర్ హ్యాకథాన్ విజేతలకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు

## నెలకు రూ.10,000 స్టైఫండ్

- ప్రత్యేక సైబర్ శిక్షణ: ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ




విజయవాడ (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైబర్ సెక్యూరిటీ హ్యాకథాన్‌లో విజేతలైన అభ్యర్థులకు ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎస్ ఎండీ మల్లవరపు సూర్య తేజ కూడా పాల్గొని విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్యం కలిగిన సైబర్ సెక్యూరిటీ నిపుణులను తయారు చేయాలనే లక్ష్యంతో ఏపీటీఎస్ ఈ హ్యాకథాన్‌ను నిర్వహించిందని తెలిపారు. వేలాదిమంది దరఖాస్తు చేసుకున్న ఈ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించడమైందని పేర్కొన్నారు. ఎంపికైన ప్రతి అభ్యర్థికి నెలకు రూ.10,000 స్టైఫండ్‌తోపాటు సైబర్ సెక్యూరిటీ భద్రతా విధానాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో డిజిటల్ పరిపాలనను బలోపేతం చేయడంతోపాటు సైబర్ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం పలు వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్వహణ, అప్లికేషన్ డెవలప్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ మానిటరింగ్ అండ్ ఆడిటింగ్, డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్లు, ఆధార్ వాలిడేషన్, ఈ-ప్రొక్యూర్మెంట్ తదితర సేవలను ఏపీటీఎస్ సమర్థవంతంగా అందిస్తోందని వివరించారు.

ప్రజలను సైబర్ మోసాల నుంచి రక్షించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిషింగ్ దాడులు, హ్యాకింగ్, ఓటీపీ మోసాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ సైబర్ భద్రతపై చైతన్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక "సైబర్ సెక్యూరిటీ మానిటరింగ్ సెంటర్" ద్వారా ప్రభుత్వ డేటా సెంటర్లు, కార్యాలయాలు, ఐటీ మౌలిక వసతులను 24 గంటలూ, ఏడాది పొడవునా పర్యవేక్షిస్తున్నామని మోహనకృష్ణ వెల్లడించారు. ఏపీటీఎస్ ఆధ్వర్యంలో 3,000కు పైగా ఐటీ ఆస్తులు మరియు ప్రభుత్వ ఐటీ మౌలిక సదుపాయాలపై నిరంతర నిఘా కొనసాగుతోందన్నారు. ప్రారంభంలో 12,500 ఈవెంట్స్ పర్ సెకండ్ సామర్థ్యంతో మొదలైన ఈ వ్యవస్థ ప్రస్తుతం 32,500 ఈపీఎస్ సామర్థ్యానికి చేరుకుని రాష్ట్ర సైబర్ భద్రతను మరింత బలోపేతం చేస్తోందని వెల్లడించారు. సైబర్ సెక్యూరిటీ ఆడిట్స్, వెబ్ అండ్ మొబైల్ సెక్యూరిటీ ఆడిట్స్, నెట్‌వర్క్ సెక్యూరిటీ ఆడిట్స్, రెడ్ టీమ్ అసెస్‌మెంట్స్, వల్నరబిలిటీ అసెస్‌మెంట్ మరియు పెనెట్రేషన్ టెస్టింగ్ వంటి అత్యాధునిక సేవలను ఏపీటీఎస్ అందిస్తోందని మోహనకృష్ణ, సూర్య తేజ ఇరువురూ వివరించారు.

భవిష్యత్తులో బ్యాంకింగ్, ప్రైవేట్ రంగం మరియు ఇతర కీలక రంగాలకు కూడా సేవలను విస్తరించే లక్ష్యంతో ఏపీటీఎస్ ముందుకు సాగుతోందని మోహనకృష్ణ తెలిపారు. దీని ద్వారా రాష్ట్రానికి అదనపు ఆదాయం సమకూరడమే కాకుండా, సైబర్ భద్రత మరింత బలోపేతం కావడంతోపాటు యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సాంకేతికత ఆధారిత పరిపాలన, డిజిటల్ భద్రత మరియు నైపుణ్యాభివృద్ధి ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

# 2.5 కోట్ల సీడ్ బాల్స్ తయారీ ప్రక్రియకు శ్రీకారం

- **మహిళలు, చిన్నారులతో కలసి స్వయంగా విత్తన బంతులు చుట్టిన పవన్ కళ్యాణ్**
- **డ్రోన్ల ద్వారా సీడ్ బాల్స్ వెదజల్లే ప్రక్రియను వీక్షించిన ఉప ముఖ్యమంత్రి**



విజయవాడ (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎన్టీఆర్ జిల్లా మూలపాడు బటర్ ఫ్లై పార్క్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. 2.5 కోట్ల సీడ్ బాల్స్ తయారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలసి స్వయంగా సీడ్ బాల్స్ తయారు చేశారు. అంకుడు, తెల్లపొణికి, వేప, కుంకుడు, రావి, మర్రి, వెదురు, ఉసిరి, చింత, మోదుగ తదితర స్వదేశీ జాతి విత్తనాలతో ఈ సీడ్ బాల్స్ తయారు చేశారు.

### రాష్ట్రవ్యాప్తంగా 300 ప్రాంతాల్లో సీడ్ బాల్స్ తయారీ

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 ప్రాంతాల్లో విస్తృతంగా సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూలపాడు బటర్ ఫ్లై పార్క్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమాన్ని పవన్ కళ్యాణ్ వీక్షించారు. సీడ్ బాల్స్ తయారీ ప్రక్రియలో పాల్గొన్న ప్రజలతో ముచ్చటించారు. ఏఏ విత్తనాలతో సీడ్ బాల్స్ తయారు చేస్తున్నారు? ఎంత మొత్తంలో రూపొందిస్తున్నారు? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. వన సంరక్షణకు పని చేస్తున్న మహనీయుల స్ఫూర్తితో విత్తన బంతుల తయారీ ప్రక్రియను బాధ్యతగా ముందుకు తీసుకువెళ్లాలన్నారు. సీడ్ బాల్స్ ఆవశ్యకతను వివరించిన చిన్నారులను అభినందించారు. జూన్ 15నాటికి 2.5 కోట్ల సీడ్ బాల్స్ రూపొందించాలని అధికారులకు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. అనంతరం డ్రోన్ల సహాయంతో కొండ శిఖరాలపై విత్తన బంతులు జారవిడిచే ప్రక్రియను పరిశీలించారు.

### ప్రతి ఎకో పార్కులో ఒక యోగా హాల్

అంతకుముందు మూలపాడు బటర్ ఫ్లై పార్కులో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పవన్ కళ్యాణ్ సందర్శించారు. బటర్ ఫ్లై పార్కు నమూనా పరిశీలనలో అక్కడ యోగా హాల్ నిర్మాణం ఆయనను ఆకట్టుకుంది. ప్రతి ఎకో టూరిజం పార్కులో ఒక యోగా హాల్ నిర్మించే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

### కొయ్య బొమ్మలు, కళాకృతుల ప్రచారానికి హామీ

అనంతరం కొండపల్లి కొయ్య బొమ్మలు తయారీకి వినియోగించే తెల్ల పొణికి దుంగలను పరిశీలించారు. పక్కనే ఏర్పాటు చేసిన కొండపల్లి కొయ్య బొమ్మలు, ఉదయగిరి కళాకారులు నిర్ద, బిళ్ల నిర్ద, వేప కర్రతో తయారు చేసిన గ్లాసులు, గరిటలువంటి వంట ఇంటి సామాగ్రిని ఆసక్తిగా తిలకించారు. కళాకారులు రూపొందించిన చెక్క వాచ్, ల్యాప్ టాప్ పవన్ కళ్యాణ్‌ను ఆకట్టుకున్నాయి. చిత్తూరునుంచి వచ్చిన కళాకారులు బొమ్మల తయారీకి అవసరమైన చెక్క లభించడం లేదని తెలుపగా, వుడ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కొయ్య బొమ్మల కళాకారుల చేత ప్రముఖ స్వతంత్ర సమరయోధులు, హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ప్రతిమను తయారు చేయించాలని కోరారు. అద్భుతమైన కళారూపాలకు మార్కెటింగ్ కల్పించేందుకు, ప్రచారం ద్వారా ప్రాచుర్యం కల్పించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి రెండు నెలలకి ఓ ప్రాంతంలో చేతి వృత్తుల కళాకారులను కలిసే ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, అటవీ, పర్యావరణ శాఖల ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ పీవీ చలపతిరావు, అటవీశాఖ సలహాదారుడు మల్లికార్జునరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను, మైలవరం ఇంఛార్జ్ అక్కల రామ్మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

## సైకిల్‌పై హోంమంత్రి అనిత

***పర్యావరణ దినోత్సవాన మొక్కలు నాటిన మంత్రి***



విజయవాడ (చైతన్యరథం): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. రామవరప్పాడు రింగ్‌లోని ఎస్ఎల్‌వీ గ్రీన్ మెడోస్ నివాసం నుంచి ఆటోనగర్‌లోని ఫైర్ స్టేషన్ కార్యాలయం వరకు ఆమె సైకిల్‌పై వెళ్లారు. అనంతరం ఫైర్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తన వంతు బాధ్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత రాష్ట్ర ప్రజలకు పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని హోంమంత్రి పేర్కొన్నారు. చెట్ల పెంపకం పర్యావరణాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం "నో వెహికల్ డే"గా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని స్వచ్ఛందంగా పాటించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడటమే భావితరాలకు మనం అందించే గొప్ప ఆస్తి అని ఆమె అన్నారు. సైకిల్‌పై ప్రయాణించడం గర్వకారణమని, సైకిల్ వినియోగం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు.

ఎన్‌డీఏ ప్రభుత్వం మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన తొలి రోజునే విజయవాడ నగర వీధుల్లో సైకిల్‌పై తిరగడం ఎంతో ఆనందంగా ఉందని హోంమంత్రి తెలిపారు. జీవితం చాలా చిన్నదని, ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం గంట సమయాన్ని తమ ఆరోగ్యం కోసం కేటాయించాలని సూచించారు. సైకిల్ వినియోగాన్ని పెంచడంతో పాటు బ్యాటరీ వాహనాల వినియోగాన్నీ ప్రోత్సహించాలని హోంమంత్రి అనిత ప్రజలకు పిలుపునిచ్చారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

- **భవిష్యత్తు బాగుండాలంటే పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిందే**
- **పారిశ్రామిక వ్యర్థాలు నేరుగా సముద్రంలో కలవనీయొద్దు**
- **ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్క నాటి సంరక్షించాలి**
- **పర్యావరణ దినోత్సవ వేడుకలో మంత్రి కొల్లు రవీంద్ర**



మచిలీపట్నం (చైతన్య రథం): మన భవిష్యత్తు బాగుండాలంటే నేడు పర్యావరణాన్ని కాపాడుకోవడం తక్షణ కర్తవ్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్ వద్ద జిల్లా జాయింట్ కలెక్టర్, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, విద్యార్థులు, పార్టీ నాయకులతో కలిసి పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. బీచ్ పరిసరాల్లో పేరుకున్న చెత్తను తొలగించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర వ్యర్థాలను వేర్వేరుగా తరలించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని యువత, విద్యార్థులు, నాయకులతో ప్రమాణం చేయించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. "పర్యావరణంలో అసమతుల్యం కారణంగానే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఉష్ణోగ్రతలు పెరిగి ఇబ్బంది పడుతున్నాం. వర్షపాతంలో తేడాలొస్తున్నాయి. అకాల వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలకు పర్యావరణ అసమతుల్యమే కారణం. ఫలితంగా అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. మంగినపూడి బీచ్కు పర్యాటకులు ఎక్కువగా వస్తున్నప్పటికీ చెత్త పేరుకుపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువగా పేరుకుంటున్నాయి. ఆరోగ్యంగా ఉండాలంటే పర్యావరణం ఎంతో ముఖ్యం. వ్యర్థాలు సముద్రంలో పేరుకుపోవడం ద్వారా పర్యావరణానికి కనిపించని నష్టం జరుగుతోంది" అన్నారు.

"పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు స్వచ్ఛందంగా పాల్గొనడం ఆనందంగా ఉంది. ఈ కార్యక్రమాన్ని ప్రతి నెలా జరిగేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం. ప్రతి పౌరుడు కూడా ఒక మొక్క నాటి బాధ్యతలు తీసుకోవాలి. పర్యావరణానికి హాని చేసే వస్తువుల వినియోగంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. గోదావరి పుష్కరాల సందర్భంగా పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చాం. అదే స్ఫూర్తితో కృష్ణా నదిలో కూడా వ్యర్థాల నిర్వహణ చేపడతాం. పరిశ్రమల నుండి వ్యర్థాలు నేరుగా సముద్రంలో కలవకుండా ఎస్టీపీలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. సముద్ర జీవాల పరిరక్షణలో ప్రతి ఒక్కరినీ భాగస్వాముల్ని చేస్తా"మని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

*జాతీయ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో పాల్గొన్న నాయకులకు శుక్రవారం ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. నాయకులనుంచి బ్లడ్ శాంపిల్స్ సేకరించి వైద్య బృందం వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించింది. నాయకుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, ఆరోగ్యవంతమైన నాయకత్వమే సమర్థవంతమైన ప్రజాసేవకు పునాది అన్న లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. నేడు మొత్తం 115మంది నాయకులనుంచి బ్లడ్ శాంపిల్స్ సేకరించి ఆరోగ్య పరీక్షలు పూర్తి చేశారు.*




*ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి స్వయంగా మొక్కనునాటి పర్యావరణ పరిరక్షణకు తమ నిబద్ధతను చాటారు. ప్రకృతిని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యతని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనునాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పచ్చదనమే భావితరాలకు అమూల్యమైన సంపద అని పేర్కొంటూ, పర్యావరణ సమతుల్యత కోసం సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.*



# నేటినుంచి 'యోగాంధ్ర' రిజిస్ట్రేషన్లు

- గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా కోటి మందిని భాగస్వాములను చేసే చర్యలు
- వైద్యారోగ్య శాఖలో ప్రత్యేకంగా 'వార్ రూము' ఏర్పాటు
- 5,600 మంది యోగా మాస్టర్ల ద్వారా 2.5 లక్షలమంది ట్రైనర్లకు శిక్షణ
- ఆదివారం 'లేపాక్షి'లోని దేవాలయ ప్రాంగణంలో రాష్ట్రస్థాయి కార్యక్రమం
- మొత్తం 28 జిల్లాల్లో కలిపి 56 ప్రత్యేక కార్యక్రమాలు జరిగేలా ప్రణాళికలు
- అధికారులతో సమీక్షించిన వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్




విజయవాడ (చైతన్య రథం): 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని (జూన్ 21) పురస్కరించుకుని ఈనెల 7నుంచి 21 వరకు ప్రత్యేక యోగా కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో కలిపి కోటి మందిని యోగాసనాల కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వీలుగా "యోగాంధ్ర-2026" పోర్టల్ ద్వారా శనివారంనుంచి రిజిస్ట్రేషన్లు జరగనున్నాయి. రాష్ట్రంలోని గ్రామ/ వార్డు సచివాలయాల ద్వారా ఈ రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఆయుష్ శాఖకు చెందిన అధికారులను ప్రతి జిల్లాకు ఒక నోడల్ ఆఫీసర్‌గా నియమించారు.

రాష్ట్రవ్యాప్తంగా 5,600 యోగా మాస్టర్ ట్రైనర్ల ద్వారా 2.5 లక్షల మందికి యోగాసనాలపై శిక్షణా కార్యక్రమాలు జరగబోతున్నాయి. జిల్లా కేంద్రంనుంచి మండలస్థాయి వరకు జరిగే శిక్షణా కార్యక్రమాలు మూడు రోజులపాటు జరుగుతాయి. ఒక్కొక్క యోగా మాస్టర్ కనీసం 50మంది ట్రైనర్లకు శిక్షణ ఇచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. వీరు మిగిలివారికి యోగాసనాలపై శిక్షణ ఇస్తారు. అలాగే ఈనెల 7నుంచి 20 వరకు అన్ని జిల్లాల్లో కలిపి 56 కార్యక్రమాలు నిర్వహించేలా వైద్య ఆరోగ్య శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఈనెల 21న రాష్ట్రస్థాయి కార్యక్రమం అమరావతిలో నిర్వహించాలని తలపెట్టగా దీనికి కొనసాగింపుగా ప్రతి జిల్లా కేంద్రంలో యోగాసన కార్యక్రమాల నిర్వహణకు వీలుగా భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం నిర్వహించిన సమీక్ష (వర్చువల్)లో ఉన్నతాధికారులు ఏర్పాట్లపై వివరించారు.

**'వార్ రూము' ఏర్పాటు**

ఈ ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించేందుకు మంగళగిరిలోని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో 'ప్రత్యేక వార్ రూము' ఏర్పాటైంది. ఆయుష్ వైద్య ఆరోగ్య శాఖ, జాతీయ ఆరోగ్య మిషన్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు, సెకండరీ హెల్త్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయాలకు చెందిన 30మందితో వార్ రూము ఏర్పాటైంది.

**20వరకు 56 కార్యక్రమాల నిర్వహణ**

యోగాసన కార్యక్రమాల నిర్వహణ అధికారికంగా ఈనెల 7నుంచి ప్రారంభంకానుంది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షి ఆలయంలో జరిగే యోగాసన కార్యక్రమంలో ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొననున్నారు. ఇదేరోజు కృష్ణా జిల్లా మంగినపూడి బీచ్, తిరుపతి-ఎస్వీ జూపార్కు, వైఎస్సార్ కడప-ఒంటిమిట్ట దేవాలయ ప్రాంగణంలో యోగాసనాల కార్యక్రమాలు జరుగుతాయి. అలాగే ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో పోలీసులు, కోనసీమ జిల్లాలో రైతులతో యోగాసన (థీమాటిక్ యోగా) కార్యక్రమాలు జరుగుతాయి. మరసటిరోజు గుంటూరు జిల్లా ఉండవల్లి గుహలు, కాకినాడ-అన్నవరం, కర్నూలు-హరిత రాక్ గార్డెన్, నంద్యాల జిల్లా శ్రీశైలం దేవాలయ ప్రాంగణంలో యోగాసన కార్యక్రమాలు జరగనున్నాయి. అదే రోజు అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ వర్కర్లు, ఆరోగ్యశాఖ సిబ్బంది, తూర్పుగోదావరి జిల్లాలోని జైళ్లల్లో ఉన్న ఖైదీలు యోగాసనాలు చేస్తారు. ఈవిధంగా జూన్ 20వరకు అన్ని జిల్లాల్లో కలిపి 56 కార్యక్రమాలు నిర్వహించేలా వైద్య, ఆరోగ్య శాఖ ప్రణాళిక సిద్ధంచేసింది. ఇదే సమయంలో వయస్సులవారీగా విద్యార్థులకు యోగాసనాలపై క్విజ్‌వంటి పోటీలు నిర్వహిస్తారు.

# వారానికోసారైనా సైకిల్ జర్నీ

- విజయవాడ టు అమరావతికి సైకిల్ ప్రయాణం
- మండుటెండలో 20 కి.మీ తొక్కిన మంత్రి నిమ్మల
- పర్యావరణ దినోత్సవాన మంత్రి నిమ్మల పిలుపు
- ఉద్యోగులతో కలసి మొక్కలునాటిన మంత్రి



విజయవాడ (చైతన్య రథం): మానవ మనుగడకు ఎంతో కీలకమైన భూమి, నీరు, గాలిని కలుషితం కాకుండా పర్యావరణాన్ని కాపాడుకోవాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు విజయవాడ క్యాంపు కార్యాలయం నుండి అమరావతి సచివాలయంకు 20 కి.మీ సైకిల్ తొక్కుకుంటూ వచ్చి తన విధులకు హాజరైనట్టు జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శుక్రవారం విజయవాడలో తన క్యాంపు కార్యాలయం నుండి సైకిల్‌పై బయలుదేరిన మంత్రి నిమ్మల.. మార్గమధ్యంలో కొండవీటి వాగు దగ్గర ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జలవనరుల శాఖ ఉద్యోగులతో కలసి మొక్కలు నాటారు. అనంతరం సచివాలయానికి బయలు దేరిన మంత్రి సీడ్ యాక్సస్ రోడ్డులో మొక్కల పని చేస్తున్న మహిళా కూలీల దగ్గర ఆగి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం సచివాలయానికి చేరిన నిమ్మల మాట్లాడుతూ.. "డీజిల్, పెట్రోల్, విద్యుత్ వాడకం తగ్గించాలి, పొదుపు పాటించాలి. దుబారాను తగ్గించేందుకు కాన్వాయ్‌ను, ఎస్కార్ట్‌ను తగ్గించుకుని ప్రజా ప్రతినిధులు ఆదర్శంగా ఉండాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు" అని గుర్తు చేశారు. అందుకే ప్రతి శుక్రవారం నో వెహికల్ డే పాటించాలని సూచించారని, అందులో భాగంగానే గత రెండు శుక్రవారాలు సైకిల్‌పైనే విధులకు హాజరైనట్టు చెబుతూ... మూడో శుక్రవారం సైతం సైకిల్‌పై వచ్చి విధులకు హాజరయ్యానని నిమ్మల స్పష్టం చేశారు.

పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణాన్ని కాపాడుకోవాలి.. జీవరాశిని రక్షించుకోవాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ పర్యటనలో ఆంధ్రా యూనివర్శిటీ నుండి మీటింగ్ ప్రదేశం నోవాటెల్‌కు మండుటెండలో 11 కి.మీ సైకిల్ తొక్కుతూ వెళ్ళారన్నారు. తిరుగు ప్రయాణం 11 కి.మీ సైకిల్‌పై వచ్చారని, ప్రజా ప్రతినిధులు మాటలు చెప్పేదాని కంటే చేతల ద్వారా చూపిస్తేనే ప్రతి ఒక్కరిలో మార్పు వస్తుందనే ఆలోచనతోనే చిరు ప్రయత్నం చేశారన్నారు. ఈరోజు చేసిన ఈ చిరు ప్రయత్నమే పెద్దమార్పుకు నాంది కానుందని పేర్కొన్నారు. ఈవిధంగా నాయకులు ఆచరించి చూపించడం వల్ల భవిష్యత్‌లో ప్రజల్లో కూడా పెద్ద మార్పుతీసుకొస్తుందనే ఆశాభావంతోనే తాను సైతం ఈ చిన్న ప్రయత్నం చేస్తున్నానని మంత్రి నిమ్మల వెల్లడించారు.




*ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు నిర్వహిస్తున్న "అమ్మ పేరు మీద ఒక మొక్క -మా కా నామ్ ఏక్ పేడ్" కార్యక్రమంలో భాగంగా సచివాలయంలోని 5వ బ్లాక్‌లో ఉన్న కార్యాలయ ఆవరణలో ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మెన్ లంకా దినకర్ మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సంరక్షణ మరియు భావితరాలకు స్వచ్ఛమైన, హరిత భవిష్యత్తును అందించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ తల్లి పేరుతో మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారురర.*

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**విజయవాడలో సైకిల్ ర్యాలీలో మంత్రి సవిత**



విజయవాడ (చైతన్య రథం): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన భారీ సైకిల్ ర్యాలీలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత పాల్గొన్నారు. అశోక్ నగర్ నుండి బెంజ్ సర్కిల్ వరకు సాగిన ర్యాలీలో ఎమ్మెల్యే గద్దె రాంమోహన్‌రావుతో కలిసి మంత్రి సైకిల్ తొక్కారు. బెంజ్ సర్కిల్ వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన మంత్రి సవిత, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. భావి తరాల భవిష్యత్తు కోసం ప్రకృతిని కాపాడటం అత్యవసరమని పేర్కొన్నారు. కరోనా సమయంలో ఆక్సిజన్ కొరత వల్ల ఎదురైన ఇబ్బందులను గుర్తు చేసిన మంత్రి, గాలి, నీరు, ఆహారం కలుషితమవుతున్న నేపథ్యంలో పర్యావరణ చేతనపై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. కాలుష్యం కారణంగా ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, యోగా, మొక్కలు నాటడం, కాలుష్య నియంత్రణ వంటి చర్యలను జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. సాధ్యమైనంత వరకు సైకిళ్లు, విద్యుత్ వాహనాలు వాడాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇంధన వాహనాలు ఉపయోగించాలని సూచించారు. సైక్లింగ్ వల్ల ఏకాగ్రత, ఆలోచనా శక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని మంత్రి వివరించారు. తాము పది రోజులుగా సైకిల్ వాడటాన్ని అలవాటు చేసుకున్నామని, ప్రజలూ ఆ దిశలో అడుగు వేయాలని ఆహ్వానించారు. ప్రజల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ఆర్గానిక్ ఆహారం, యోగా వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. పుట్టినరోజులు, వివాహాలు, శుభకార్యాల సందర్భంగా మొక్కలను బహుమతులుగా ఇవ్వాలని, ప్రతి కుటుంబం కనీసం ఒక చెట్టు నాటి సంరక్షించాలని పిలుపు నిచ్చారు. చేనేత వస్త్రాలు ధరించి చేనేత కార్మికులను, హస్తకళా ఉత్పత్తులు వినియోగించి కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

# టెక్కలి సాగునీటి ప్రాజెక్టులకు రూ.7.88 కోట్లు

**- వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు భగీరథ యత్నం**
**- మంత్రి ప్రత్యేక చొరవతోనే భారీగా నిధుల కేటాయింపు**
**- సీఎం చంద్రబాబుకు మంత్రి అచ్చెన్న ప్రత్యేక కృతజ్ఞతలు**

కోటబొమ్మాళి (చైతన్య రథం): టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కొండపేట ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ, మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకం ఆధునీకరణ పనులకు మోక్షం లభించింది. ఈ రెండు ప్రాజెక్టుల పనుల కోసం ప్రభుత్వం రూ.7.88 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ జీవో ఆర్టీ సంఖ్య 308ను శుక్రవారం జారీ చేశారు. అధికారిక ఉత్తర్వుల ప్రకారం..



కొండపేట స్కీమ్ పునరుద్ధరణకు రూ.3.77 కోట్లు, మదనగోపాలసాగరం స్కీమ్ ఆధునీకరణకు రూ.4.11 కోట్లు కేటాయించారు. ఈ నిధుల మంజూరుకు స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిరంతర కృషి, ప్రత్యేక చొరవ వల్లే సాకారమైంది. నియోజకవర్గంలో సాగునీటి ఎద్దడిని నివారించేందుకు ఈ రెండు ఎత్తిపోతల పథకాలను అత్యవసరంగా పునరుద్ధరించాలని మంత్రి అచ్చెన్నాయుడు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. ఏపీఎస్ఐడీసీ అధికారుల ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేయించి, ఆర్థిక శాఖ నుంచి సత్వరమే నిధులు మంజూరయ్యేలా ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మంత్రి పట్టుదలతోనే దశాబ్దాల నాటి ఈ సాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించిందని ఈ ప్రాంత రైతాంగం కృతజ్ఞతలు తెలుపుతోంది. ఈ నిధుల ద్వారా పనులను వేగంగా ప్రారంభించి, సకాలంలో పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఈ రెండు ఎత్తిపోతల పథకాలు అందుబాటులోకి వస్తే కొండపేట కింద 2,500 ఎకరాలు, మదనగోపాలసాగరం కింద 3,300 ఎకరాల చొప్పున.. మొత్తంగా టెక్కలి నియోజకవర్గంలోని 5,800 ఎకరాల ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందుతుందని అధికారులు వెల్లడించారు.

**రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి అచ్చెన్న**

జిల్లాలోని ప్రతి ఎకరాకూ సాగునీరు అందించి రైతాంగాన్ని ఆదుకోవడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల టెక్కలి నియోజకవర్గంలో మూతపడిన, జీర్ణావస్థకు చేరిన ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించడానికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. కొండపేట, మదనగోపాలసాగరం స్కీమ్‌ల ఆధునీకరణ ద్వారా 5,800 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని, ఈ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు త్వరగతిన నీరందిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.

# రాజధాని అభివృద్ధికి 'గొడ్డలి' అడ్డంకులు

**అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైఎస్ జగన్ పిచ్చి ప్రేలాపనలు**
**వైసీపీ హయాంలో జగన్ తట్ట మట్టి ఎత్తలేదు.. ఒక్క ఇటుకా పెట్టలేదు**
**మహిళల ఉసురు తగిలే గత ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితమయ్యారు**
**'ప్రజావేదిక' శిథిలాలు.. జగన్ వికృత క్రీడకు నిదర్శనం**
**బందరు పోర్టును తాకట్టు పెట్టిన చరిత్ర జగన్, పేర్ని నానిలది**
**వైసీపీపై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు**

మంగళగిరి (చైతన్య రథం): పులివెందుల శాసనసభ్యుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమరావతి రాజధానిపై, భూములు ఇచ్చిన రైతులపై మళ్లీ విషం చిమ్ముతూ పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఐదేళ్లపాటు పరదాల వెనుక తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమై కేవలం బటన్లు నొక్కడమే పరిపాలన అనుకున్న జగన్‌కు అమరావతి అభివృద్ధిని చూసి ఓర్వలేక పిచ్చి పరాకాష్టకు చేరిందని విమర్శించారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా అసెంబ్లీకి వచ్చి చర్చించే ధైర్యం లేక, సభకు రావడానికి భయపడుతున్న జగన్ ప్రతి 15 రోజులకు ఒక ప్రెస్ మీట్ పెట్టడం, వారానికి రెండుసార్లు తాడేపల్లి, బెంగళూరు ప్యాలెస్‌ల చుట్టూ తిరుగుతూ రాజకీయ కుట్రలు పన్నడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు.

రాష్ట్రం విడిపోయిన తర్వాత నారా చంద్రబాబు నాయుడు కట్టిన సెక్రటేరియట్, అసెంబ్లీ భవనాల్లో ఐదేళ్లపాటు సుఖంగా పరిపాలన సాగించిన జగన్.. ముఖ్యమంత్రిగా ఒక్క తట్ట మట్టి ఎత్తలేదు, రాష్ట్రంలో ఒక్క ఇటుక కూడా పెట్టలేదని దేవినేని ఉమా గుర్తు చేశారు. ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా నిర్మిస్తున్నాయని, ఐకానిక్ భవనాలు, సీడ్ యాక్సిస్ రోడ్డు, రిజర్వాయర్లు, హైకోర్టు, జ్యుడీషియల్ కాంప్లెక్స్, సెక్రటేరియట్ హెచ్ఓడీ భవనాల పనులు రాత్రీ పగలూ అనకుండా శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. సుమారు 30,000 మంది కార్మికులు, ఇంజనీర్లు, ఆధునిక యంత్రాలతో ఇక్కడ శ్రమిస్తుంటే ఆ ప్రగతిని చూసి తట్టుకోలేక జగన్ ఏడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**హైదరాబాద్ నాడు.. అమరావతి నేడు**

1998 నవంబర్ 22న నాటి ప్రధాని వాజ్‌పేయి, చంద్రబాబు చేతుల మీదుగా హైటెక్ సిటీ ప్రారంభోత్సవం జరిగినప్పుడు తమకు గర్వంగా అనిపించిందని దేవినేని ఉమా స్మరించారు. కానీ



ఆనాడు కొండలు, గుట్టలుగా ఉన్న ఆ ప్రాంతంలో నిర్మాణాలు చేస్తుంటే జగన్ తండ్రి వైఎస్సార్, వారి పార్టీ నేతలు ఓఆర్ఆర్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ భూములు, ఐఎస్‌బీ భవనాలపై నానా కూతలు కూశారని, చంద్రబాబు గారి 'విజన్ 2020' డాక్యుమెంట్‌ను అవహేళన చేశారని గుర్తు చేశారు. కానీ ఇవాళ 2026లో అదే ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వల్ల అక్కడ ఎకరం భూమి వందల కోట్లు పలుకుతోందని, తెలుగువాడిగా ప్రతి ఒక్కరూ గర్వపడేలా హైదరాబాద్ ఎదిగిందని స్పష్టం చేశారు.

ఆనాడు భోగాపురం ఎయిర్‌పోర్ట్ కడుతుంటే "అక్కడికి ఎర్ర బస్సు వస్తుందా?" అని జగన్ రైతులను రెచ్చగొట్టారని, భూములు వెనక్కి ఇచ్చేస్తానంటూ కారుకూతలు కూశారని విమర్శించారు. కానీ ఇవాళ భోగాపురానికి బోయింగ్ విమానం దిగుతోందని, రాబోయే జూలైలో గౌరవ ప్రధానమంత్రి గారు, ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్ట్ జాతికి అంకితం కాబోతోందని తెలిపారు. ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చే ఈ అంతర్జాతీయ విమానాశ్రయం చుట్టుపక్కల భూముల విలువలు పెరిగి పరిశ్రమలు వస్తుంటే జగన్ ఎందుకు విషం చిమ్ముతున్నారని నిలదీశారు.

**అమరావతిలో విద్య, సాంకేతిక వెలుగులు**

ఇవాళ అమరావతిలో వేలాది మంది పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు పడుతున్నాయని దేవినేని ఉమా ఆనందం వ్యక్తం చేశారు. దేశంలోనే అత్యున్నత విద్యాసంస్థ అయిన 'బిట్స్ పిలానీ' కృష్ణా నది ఒడ్డున, వెంకటేశ్వర స్వామి ఆలయం దగ్గర, సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన 75 ఎకరాల్లో ప్రపంచ స్థాయి క్యాంపస్ నిర్మిస్తోందన్నారు. ఒకప్పుడు ఉన్నత చదువుల కోసం మన పిల్లలు మద్రాస్, బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లేవారని, కానీ ఇవాళ అమరావతిలో ఎస్ఆర్ఎం, విట్, అమృతా వంటి విశ్వవిద్యాలయాల్లో వేలాది మంది విద్యార్థులు మన కళ్ల ముందే చదువుకుంటున్నారని సంతోషంగా తెలిపారు. కొండవీటి వాగు పరివాహక ప్రాంతంలో అమరావతికి ప్రపంచ గుర్తింపు వచ్చేలా నిర్మాణాలు జరుగుతున్నాయని, భవిష్యత్ టెక్నాలజీ అయిన క్వాంటం కంప్యూటింగ్‌పై పెద్దఎత్తున కార్యక్రమాలు జరుగుతుంటే జగన్ తట్టుకోలేక ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు.

**రైతులకు చేసిన అన్యాయానికి సమాధానం చెప్పు**

గతంలో భూములు ఇవ్వకుండా అడ్డుపడిన కొద్దిమంది వ్యక్తులను తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చోబెట్టుకుని జగన్ మాట్లాడిన మాటలు వింటే ఆయనకున్న కనీస అవగాహన ఏంటో అర్థమవుతోందని దేవినేని ఉమా పేర్కొన్నారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తికి సీడ్ యాక్సిస్ రోడ్డు గురించి కనీస జ్ఞానం లేకపోవడం చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో తన మాజీ శాసనసభ్యులను అడ్డం పెట్టుకుని కోర్టుల్లో కేసులు వేయించి రాజధానిని అడ్డుకోవాలని చూశారని, కానీ ఆనాడు జగన్ దగ్గరకు వెళ్లిన రైతే ఇవాళ జగన్ కుట్రలను గ్రహించి స్వచ్ఛందంగా సీఆర్‌డీఏ అధికారుల వద్దకు వచ్చి భూములు ఇవ్వడానికి ముందుకు వస్తున్నారని తెలిపారు. 1631 రోజులపాటు రాజధాని మహిళలు కార్చిన కన్నీళ్లు, వారి ఉసురు తగిలే ఇవాళ వైసీపీ అసెంబ్లీలో కేవలం 11 సీట్లకు పరిమితమైందని దేవినేని ఉమా స్పష్టం చేశారు. న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు అమరావతి మహిళలు పాదయాత్ర చేస్తుంటే నెల్లూరులో వారితో నేలమీద అన్నం తినిపించారని, విశాఖపట్నం, అరసవల్లి వైపు వెళ్తుంటే మహిళలపై సీసాలు, రాళ్లు విసిరేశారని ఆగ్రహంతో గుర్తు చేశారు. హక్కుల కోసం పోరాడిన ఎస్సీ, బీసీ, మహిళా రైతులను గుంటూరు, మాచర్ల, నరసరావుపేట, రాజమండ్రి జైళ్లకు పంపిన ఘోరమైన చరిత్ర జగన్‌దని నిలదీశారు. ఇంతమంది రైతుల జీవితాలతో ఆడుకుని ఇవాళ ఏ మొహం పెట్టుకుని అమరావతి గురించి మాట్లాడుతున్నారని, అమరావతి పేరెత్తే కనీస నైతిక హక్కు జగన్‌కు లేదని స్పష్టం చేశారు.

**బందరు పోర్టు, రాష్ట్ర ప్రగతి**

కృష్ణా జిల్లా ప్రజలు, సామాన్య కార్మికులు వందల రోజులు ప్రాణాలొడ్డి పోరాడి సాధించుకున్న మచిలీపట్నం పోర్టు గురించి మాట్లాడే కనీస నైతిక అర్హత జగన్‌కు, మాజీ మంత్రి పేర్ని నానికి లేదని దేవినేని ఉమా స్పష్టం చేశారు. నాడు వైఎస్సార్ హయాంలో బందరు పోర్టును తాకట్టు పెట్టి పక్క జిల్లాకు తరలించాలని చూస్తే ఇక్కడి రిక్షా కార్మికులు, హోటల్ సర్వర్లు, రైతులు, వర్తకులు ఉద్యమించి పోర్టును సాధించుకున్నారని గుర్తు చేశారు. ఆనాడు ముక్కు నేలకు రాస్తానన్న పేర్ని నాని ఇప్పుడేం సమాధానం చెప్తారని నిలదీశారు. మచిలీపట్నం పోర్టును కంటైనర్ పోర్టుగా అభివృద్ధి చేస్తూ ఆ ప్రాంతానికి భారీ పరిశ్రమలను కూటమి ప్రభుత్వం తీసుకువస్తోందని, బందరుకు సిక్స్-లేన్ గ్రీన్ ఫీల్డ్ రోడ్లు, భవిష్యత్తులో బుల్లెట్ ట్రైన్లు వచ్చేలా ప్రణాళికలతో ముందుకెళ్తుంటే జగన్ జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. నాగాయలంకలో స్పేస్ పరిశోధన సంస్థ, బీహెచ్ఈఎల్ వంటి భారీ ప్రాజెక్టులతో ఈ ప్రాంత ముఖచిత్రాన్ని మార్చడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

**కూటమి సంక్షేమ విప్లవం**

పేదవాడికి కేవలం రూ.5 లకే కడుపునిండా అన్నం పెట్టే అన్నా క్యాంటీన్లను జగన్ తన హయాంలో మూసేశారని, ఇవాళ కోట్లాది మంది పేదలు ఇక్కడ తింటుంటే చూసి ఓర్వలేకపోతున్నారని దేవినేని ఉమా విమర్శించారు. 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో కోట్లాది సోదరీమణులు నెలకు రూ.5,000 నుండి రూ.10,000 వరకు ఆదా చేసుకుంటున్నారని తెలిపారు. 'తల్లికి వందనం' పథకం కింద ఎనిమిది మంది పిల్లలున్నా అందరికీ ప్రయోజనాలు వర్తింపజేస్తూ కూటమి ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుందని, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరుగుతోందని వివరించారు. ఈ సంక్షేమ, అభివృద్ధి విప్లవాన్ని చూసి తట్టుకోలేకనే జగన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని హెచ్చరించారు.

**రాజధాని నిర్మాణం ముమ్మరం**

గతంలో అమరావతిని శ్మశానమన్నారు, భూకంపాలు వస్తాయన్నారు, పునాదులపై అపహాస్యం చేశారని దేవినేని ఉమా గుర్తు చేశారు. కానీ ఇవాళ శరవేగంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల నాటికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాలు పూర్తయి వారు స్వంత క్వార్టర్లలోకి వెళ్లబోతున్నారని, న్యాయమూర్తుల భవనాలు, వేలాది మంది ఉద్యోగుల ఎన్జీవో క్వార్టర్స్ నిర్మాణాలు కూడా ఈ సంవత్సరంలోనే పూర్తి కాబోతున్నాయని వివరించారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు కేటాయించిన ప్లాట్లలో మౌలిక వసతుల కల్పనను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని, జాతీయ, అంతర్జాతీయ సంస్థల ఆధ్వర్యంలో పనులు శరవేగంగా జరుగుతుంటే రైతులు దగ్గరుండి చూసి గర్వపడుతున్నారని సంతోషంగా తెలిపారు.

చంద్రబాబు నాయుడి నాయకత్వంలో కూటమి ప్రభుత్వ రెండు సంవత్సరాల దిగ్విజయ పరిపాలనను చూసి తట్టుకోలేక ప్రజలను తప్పుదారి పట్టించడానికే జగన్ 'సూపర్ సిక్స్' అంటూ విషప్రచారం చేస్తున్నారని దేవినేని ఉమా ఆరోపించారు. జగన్ ఇప్పటికైనా ఫేక్ మాటలు, విషప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, బుద్ధి మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా దక్కకుండా రాష్ట్ర ప్రజలు తగిన సమాధానం చెప్తారని జగన్ సారథ్యంలోని వైసీపీని హెచ్చరించారు.

చైతన్యరథం

# 917 ఎకరాల 22ఎ భూములకు విముక్తి

**ఏలూరు జిల్లాలో 1,749 మంది సమస్య పరిష్కారం - 22ఎ సమస్య పరిష్కారం ఎంతో తృప్తినిచ్చింది: మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి**

ఏలూరు (చైతన్య రథం): జిల్లాలో ఎంతో కాలంగా రైతులు, సామాన్యులు ఎదురుచూస్తున్న 22ఎ భూముల సమస్యకు ప్రభుత్వం విముక్తి కల్పించడం ఎంతోమందికి భారీ ఊరటనిచ్చిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జరిగిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశం అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ రికార్డుల్లో నిషిద్ధ జాబితా (22ఎ)లో చిక్కుకున్న భూములకు విముక్తి కల్పించేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా ఏలూరు జిల్లాలో ఇప్పటివరకు 1,749 మంది లబ్ధిదారులకు చెందిన 917 ఎకరాలను 22ఎ జాబితా నుండి తొలగించడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఈ విషయంపై రెండుసార్లు మెగా గ్రీవెన్స్ డే నిర్వహించి ప్రజల దగ్గర అర్జీలు స్వీకరించి అదే రోజున పరిష్కార చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, రెవెన్యూ అధికారులు అహర్నిశలు కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

కైకలూరులో 500 ఎకరాలు స్థానిక ఎమ్మెల్యే డా. కామినేని శ్రీనివాస్ సారథ్యంలో జిల్లా కలెక్టర్ చొరవతో తీసుకున్న చర్యల మూలంగా 22ఎ భూముల మినహాయింపుకు సీసీఎల్ఎ ద్వారా ఉత్తర్వులు జారీ చేయబడ్డాయన్నారు. అదే విధంగా జిల్లాలో ఇంకా 480 ఎకరాల వరకు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 216 ఎకరాలు ఎండోమెంట్‌కు సంబంధించినవిగా గుర్తించామన్నారు. వీటి పరిష్కారానికి త్వరలో గ్రీవెన్స్ డే ఏర్పాటు చేసి దేవాదాయ శాఖ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ తదితరుల సహకారంతో 22ఎ జాబితా నుండి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం సారథ్యంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో జరుగుతున్న పనులు, సంక్షేమ పథకాల పురోగతిని డీఆర్‌సీలో సమీక్షించుకోవడం జరిగిందన్నారు. ఖరీఫ్‌కు ఏ విధంగా సన్నద్ధం అవ్వాలో కార్యాచరణ రూపొందించుకోవడం జరిగిందన్నారు. ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం అద్భుతంగా ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల లోపే



రైతులకు సొమ్ములు చెల్లించడం జరిగిందన్నారు.

నూకశాతం ఎక్కువగా వచ్చే వరి వంగడాలను సాగు చేయడం మానుకోవాలని మంత్రి సూచించారు. ఈ ధాన్యాన్ని ఎఫ్‌సీఐ కొనుగోలు చేయడంలో ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. అయితే గత సీజన్‌లో రైతులను దృష్టిలో ఉంచుకుని సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నులు మొదటిసారిగా కొనుగోలు చేయడం జరిగిందన్నారు. దీంతో పీఆర్ 126, ఎంటీయూ 1153, ఎంటీయూ 1001, ఎంటీయూ 1010, ఎంటీయూ 1156, ఎంటీయూ 1293, ఎంటీయూ 1275, ఎంటీయూ 1061, ఎంటీయూ 1064 వరి వంగడాల వల్ల నూకశాతం ఎక్కువగా వస్తుందని, అందువల్ల రైతులను వీటికి బదులుగా వేరే వరి వంగడాలు వేసేలా అవగాహన పరచాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించామన్నారు. అదే విధంగా ఫైన్ వెరైటీ (సన్నబియ్యం) 75 వేల ఎకరాల్లో సాగు చేసేలా ప్రోత్సహించాలని సూచించడం జరిగిందన్నారు.

జిల్లాలో ఉద్యాన పంటలను అభివృద్ధి చేయడం ద్వారా ప్రతి సంవత్సరం 15 శాతం వృద్ధి చెందేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రతి నియోజకవర్గంలో రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పామాయిల్, మిరియాల పంట, కోకో ప్రాసెసింగ్ సాగు సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో 157 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకున్నామని, మరో 150 యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని మరింత విస్తృతం చేయాలన్నారు. మన జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్నప్పటికీ మరిన్ని చర్యలు తీసుకుని ప్రభుత్వ కార్యాలయాలు, గృహావసరాలకు పీఎం సూర్యఘర్ పథకాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో 300 యూనిట్లు ఈ నెలలో ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జిల్లాలో ఆర్గానిక్ ఉత్పత్తులు ప్రోత్సహించే దిశగా 31 రకాల సరుకులను ఉత్పత్తి చేయడం జరుగుతున్నదని, వాటికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు పైలట్ ప్రాజెక్టుగా ఆర్టీసీ బస్టాండ్లలో స్టాల్స్ ఏర్పాటుకు ప్రోత్సహించాలని ముందుకు వెళ్తున్నామన్నారు. భూగర్భ జలాలకు సంబంధించి ఏలూరు జిల్లాలో ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నాయని, 21 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలను కనీసం 16 మీటర్లకు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అన్నమయ్య జిల్లా భూగర్భ జలాల పెంపులో పురోగతి సాధించిన దృష్ట్యా ఆ జిల్లాలో పరిస్థితులను పరిశీలించేందుకు ఒక బృందాన్ని పంపడం జరిగిందన్నారు. జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

ఎన్డీఏ ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో జూన్ 9 నుండి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపట్టబోతున్నామన్నారు. గల్ఫ్ ప్రాంతంలో జరుగుతున్న యుద్ధం కారణంగా ఇటీవల వంట గ్యాస్ ఇబ్బందులు ఏర్పడ్డాయని, ప్రస్తుతం ఎటువంటి కొరత లేదని ఆయన స్పష్టం చేశారు. అయినప్పటికీ పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరాకు అవకాశం ఉన్న ఏలూరు, నూజివీడులో ఎల్‌పీజీ బదులు పీఎన్‌జీ గ్యాస్ కనెక్షన్లు అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఏలూరు నగరంలో వెయ్యి కనెక్షన్లు, నూజివీడులో రెండు వేల కనెక్షన్లు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. దీపం పథకం కింద ఏ విధమైన రాయితీ కల్పిస్తున్నామో అదే విధంగా పీఎన్‌జీ గ్యాస్ కనెక్షన్లకు కూడా వెసులుబాటు కల్పిస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), సొంగా రోషన్ కుమార్, పత్సమట్ల ధర్మరాజు, బొమ్మిడి నాయకర్ తదితరులు పాల్గొన్నారు.

## బనగానపల్లె బైపాస్ వెంట వేయి మొక్కలు

**పర్యావరణ పరిరక్షణకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పిలుపు**



బనగానపల్లె (చైతన్య రథం): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి బనగానపల్లె నూతన బైపాస్ ఇరువైపులా భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. నో వెహికిల్ డే సందర్భంగా తన క్యాంపు కార్యాలయం నుండి యాగంటిపల్లె రోడ్డు వైపు ప్రజలతో కలిసి పాదయాత్రగా వచ్చిన మంత్రి, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నంద్యాల విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన సుమారు 1,000 మొక్కల నాటే కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు. బనగానపల్లె ప్రజలు, రైతులు, యువత, కూటమి పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో భాగమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి "మొక్కలు నాటుదాం –పర్యావరణం కాపాడుకుందాం" అని పిలుపు నిచ్చారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని వివరించారు. తాము గతంలో అధికారంలో ఉన్నప్పుడు పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని, మొక్కలు నాటడాన్ని ఒక ఆనవాయితీగా పాటించామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం మాత్రం పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపట్టిన పాపాన పోలేదని, రాష్ట్రవ్యాప్తంగా చెత్త పేరుకుపోవడానికి అది కూడా కారణమైందని విమర్శించారు.

బనగానపల్లెలో ప్లాస్టిక్ నివారణలో తన భార్య ఇందిరా రెడ్డి కృషి చేస్తున్నారని, ఆమె ప్రయత్నాల ఫలితంగా పట్టణంలో 80నుండి 90 శాతం ప్లాస్టిక్‌ను నియంత్రించగలిగామని పేర్కొన్నారు. అడవులు అంతరించిపోతూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరూ ఇంటికో మొక్క నాటాలని కోరారు. రోడ్డు విస్తరణలో నరికిన చెట్ల స్థానంలో బైపాస్ వెంట భారీగా మొక్కలు నాటుతున్నామని, భవిష్యత్తులో బనగానపల్లె అంతటా మొక్కలు పెంచుతామని హామీ ఇచ్చారు. ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

## గిరిజన విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

***గిరిజన విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: గిరిజన, మహిళా సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి***



విజయవాడ (చైతన్య రథం): గిరిజన విద్యార్థుల్లో ఉన్న భయం, బిడియం, సంకోచాలను విడిచిపెట్టి ధైర్యంగా ముందుకు సాగి ఐఏఎస్, ఐపీఎస్‌వంటి అత్యున్నత స్థాయి ఉద్యోగాలను అధిరోహించాలని గిరిజన సంక్షేమ, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మార్చి 2026లో నిర్వహించిన ఎస్సెస్సీ (పదో తరగతి) మరియు ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారికి దిశానిర్దేశం చేసిన ఉపాధ్యాయులను స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఘన సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రామానికి ముఖ్య అతిథిగా మంత్రి గుమ్మిడి హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం గిరిజన విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి విద్యార్థిపై దాదాపు రూ.లక్ష వరకు వ్యయం చేస్తూ నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు కూడా ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకుని జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలన్నారు. 'తల్లికి వందనం' పథకంతో పాటు యూనిఫారాలు, బూట్లు, పుస్తకాలు, ట్రంక్ బాక్సులు, బెడ్‌షీట్లు తదితర అవసరాల కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామన్నారు.

టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించిన మంత్రి, 600 మార్కులకు గాను 591 మార్కులు సాధించిన పార్థు, 590 మార్కులు సాధించిన జాస్మిన్ వంటి విద్యార్థులు గిరిజన సమాజానికి ఆదర్శంగా నిలవడంతోపాటు తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. 90 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లకు పరిమితం కాకుండా క్రీడలు, శారీరక వ్యాయామం, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి పెట్టాలని సూచించారు. గంజాయి, బెట్టింగ్ వంటి దురలవాట్లకు, ఆత్మహత్యలు వంటి క్షణికావేశ నిర్ణయాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. తల్లిదండ్రుల సూచనలు పాటిస్తూ సరైన మార్గంలో పయనించాలని కోరారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యాల కోసం రూ. 2,500 కోట్లు కేటాయించామని తెలిపారు. గతంలో గంజాయి సాగు జరిగిన ప్రాంతాల్లో దానిని పూర్తిగా నిర్మూలించి, సుమారు రెండు లక్షల ఎకరాల్లో కాఫీ సాగును ప్రోత్సహించడం ద్వారా గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో విస్మరించిన పథకాలైన గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, టార్పాలిన్లు, ఆయిల్ ఇంజిన్లు, ట్రాక్టర్లు అందజేస్తున్నామని వెల్లడించారు.

పల్నాడు జిల్లా ఎత్తిపోతల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు పాములను ముందుగానే గుర్తించే 'ప్రోటోటైప్ షూ' రూపొందించి రాష్ట్రస్థాయి అవార్డు సాధించడం గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. వారి సృజనాత్మకతను అభినందిస్తూ, భవిష్యత్తులో రైతుల భద్రతకు ఉపయోగపడేలా ఇలాంటి ఆవిష్కరణలను ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఇటీవల భర్తీ చేసిన 16 వేల ఉపాధ్యాయ పోస్టుల్లో 2 వేల పోస్టులు గిరిజనులకు దక్కాయని, ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గిరిజన హక్కుల పరిరక్షణకు జీవో నెం. 3 స్ఫూర్తితో కొత్త విధానాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. తొలుత తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలో ఏక్ పేడ్ మాకేనాం (అమ్మ పేరుతో ఒక మొక్క) మొక్కను నాటారు. అనంతరం గిరిజన బాలికలు తమ సాంప్రదాయ నృత్యాలతో మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని సభా వేదిక వద్దకు తోడ్కొని వెళ్లారు. కార్యక్రమంలో 176మందికి ప్రతిభా పురస్కారాలు అందించి ఘనంగా సత్కరించారు. వీరిలో ట్రైబల్ వెల్ఫేర్ నుండి 87మంది, గురుకులం నుండి 89 మంది ఉన్నారు.

చైతన్యరథం

# ముంబయిలో 'తెలుగు భవనం' ఏర్పాటుకు కృషిచేస్తాం: మంత్రి దుర్గేష్

- ముంబయిలో తెలుగు సాంస్కృతిక సంబరాల్లో పాల్గొన్న మంత్రి
- ముంబయి తెలుగు ఆడిటోరియం అభివృద్ధికి హామీ
- ఎక్కడున్నా.. తెలుగు భాష మూలాలు మరువొద్దని పిలుపు




ముంబయి/ అమరావతి (చైతన్య రథం): మూడు రోజుల కేరళ పర్యటన దిగ్విజయంగా ముగించుకుని ముంబయి చేరుకున్న మంత్రి కందుల దుర్గేష్ ముంబయి ఆంధ్ర మహాసభ, జింఖానా సంయుక్తంగా నిర్వహించిన "తెలుగు సాంస్కృతిక సంబరాలు-2026"లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభా నిర్వాహకులు, కార్యవర్గ సభ్యులు మంత్రిని ఘనంగా సత్కరించారు. మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ముంబయిలోని సియాన్‌లో ఉన్న షణ్ముఖానంద చంద్రశేఖరేంద్ర సర్వసతి ఆడిటోరియంలో స్థానిక తెలుగు సంఘాలను ఉద్దేశించి మంత్రి దుర్గేష్ ప్రసంగిస్తూ.. ఎందరో మహానుభావులను కన్న తెలుగునేల వైభవాన్ని స్మరిస్తూ, పరాయి ప్రాంతాల్లో స్థిరపడినప్పటికీ మన భాష, యాస, ఆచార వ్యవహారాలను భవిష్యత్ తరాలకు అందిస్తున్న ముంబయి తెలుగు సంఘాల కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా నిడదవోలుకు చెందిన చిన్నారి నదియ ప్రదర్శించిన కూచిపూడి నృత్యాన్ని, అలాగే మహారాష్ట్ర ప్రత్యేక గీతానికి చేసిన తెలుగు ప్రాంతానికి చెందిన చిన్నారులు ప్రదర్శించిన నృత్య రూపకాన్ని అభినందిస్తూ.. స్థానిక సంస్కృతితో సమన్వయం సాధించడం గర్వకారణమన్నారు. ఎక్కడున్నా మన మూలాలను మరువకూడదని హితవు పలికారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలుగా విడిపోయినప్పటికీ తెలుగువారంతా సోదరులేనని, తెలుగువారిలో ఐకమత్యం లేదనే భావనను తొలగించి, భాషాపరంగా మనమంతా ఒక్కటేనని చాటిచెప్పారు. హిందీ, ఇంగ్లీష్ భాషలతో పాటు మాతృభాష నేర్చుకోవడం తప్పనిసరి అని చెప్తూ, ఈ తరం పిల్లలకు తెలుగు రాయడం, చదవడం, మాట్లాడటం నేర్పించాలన్నారు. ఇందుకోసం కూటమి ప్రభుత్వం ఏపీలో ప్రాథమిక స్థాయిలో తెలుగు మాధ్యమ బోధనను నిబంధనగా తెచ్చిందని గుర్తుచేశారు. ప్రపంచంలో ఒక్క తెలుగు భాషలోనే పద్యనాటక ప్రక్రియ సజీవంగా ఉందన్న మంత్రి దుర్గేష్ దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యాటక, సాంస్కృతిక మంత్రిగా తెలుగు రాష్ట్రాల సంయుక్త ఆధ్వర్యంలో ఒక "తెలుగు భవనం" ఏర్పాటుకు కృషి చేస్తానని, అందులో తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునే వీలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ముంబయిలోని తెలుగు ఆడిటోరియం అభివృద్ధికి, ముంబయి ఆంధ్ర మహాసభ నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు ఏపీ సాంస్కృతిక శాఖ తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించారు. చివరగా, ది ముంబయి ఆంధ్ర మహాసభ, జింఖానా అధ్యక్షులు కొండారెడ్డిని, వారి కార్యవర్గాన్ని కార్యక్రమాన్ని ఇంత విజయవంతంగా నిర్వహించినందుకు మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, సింగర్ గజల్ శ్రీనివాస్, ముంబయి ఆంధ్ర మహాసభ మరియు జింఖానా నిర్వాహకులు, స్థానిక తెలుగు ప్రజలు పాల్గొన్నారు.

## ఏపీకి 'బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్' అవార్డు


## కేరళ పర్యటన దిగ్విజయంగా ముగించిన మంత్రి కందుల దుర్గేష్



అమరావతి /తిరువనంతపురం (చైతన్యరథం): పర్యాటక రంగ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ చేస్తున్న కృషికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. గ్లోబల్ ట్రావెల్ మార్కెట్-2026 సదస్సులో భాగంగా తిరువనంతపురంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రతిష్ఠాత్మక 'బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్' అవార్డు లభించింది. మూడు రోజుల కేరళ పర్యటనలో పాల్గొన్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాధ్యతాయుత పర్యాటక విధానాల్లో కేరళ అందరికీ ఆదర్శమని కొనియాడారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను పర్యాటకంలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు. జీటీఎం సీఈఓ సిజి నాయర్, ఎమ్మెల్యే వి. మురళీధరన్, తిరువనంతపురం మేయర్ వి.వి. రాజేష్ తదితరులు మంత్రిని, ఏపీ రాష్ట్రాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

# నూజివీడులో 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'

- స్వచ్ఛ ఆంధ్ర ఛైర్మన్ పట్టాభిరామ్
- రూ.2.80 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్




నూజివీడు (చైతన్య రథం): నూజివీడును స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ శుక్రవారం 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమంలో భాగంగా పట్టణంలో స్వయంగా పర్యటించారు. చీపురు పట్టుకుని వీధులు శుభ్రం చేయడంతోపాటు మురుగు కాలువల పూడిక తీత పనులలో స్వయంగా పాల్గొన్నారు. రూ.2.80 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ పనులు పరిశీలించిన ఆయన, డంపింగ్ యార్డ్‌లో మిగిలిన చెత్తను త్వరగా తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు వచ్చే 35 టన్నుల చెత్తను ఆ రోజే ప్రాసెస్ చేయడానికి ఈ ప్లాంట్ ఉపయోగపడనుందని తెలిపారు. గతంలో పేరుకుపోయిన 30,000 టన్నుల చెత్తను చాలావరకు తొలగించినట్లు వివరించారు.

పర్యావరణ రక్షణకు వేస్ట్ ప్రాసెసింగ్ కీలకమని ఛైర్మన్ పేర్కొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని అన్ని మున్సిపాలిటీల్లో అమలు చేస్తున్నట్లు, ప్రత్యామ్నాయంగా బయోడిగ్రేడబుల్ ఉత్పత్తులను 'స్వయం' బ్రాండ్ పేరిట పెద్ద ఎత్తున ప్రమోట్ చేయనున్నట్లు తెలిపారు. డోర్ టు డోర్ వేస్ట్ సేకరణకు త్వరలో ఎనిమిది ఎలక్ట్రిక్ వాహనాలు సమకూర్చనున్నట్లు వెల్లడించారు.

# ప్రకృతిని కాపాడుకుందాం

### *కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ కృష్ణయ్య పిలుపు*



విజయవాడ (చైతన్య రథం): "ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు కేవలం ఒకరోజు కార్యక్రమంగా పరిమితం కాకూడదు. ప్రతి రోజు పర్యావరణ దినోత్సవంలా భావిస్తూ ప్రకృతిని కాపాడే దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలి. ప్రభుత్వం, సంస్థలు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రజలు కలిసి పనిచేస్తేనే పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్, హరితభారతం సాధ్యమవుతుంది" అని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డా.పి.క్రిష్ణయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ఆడిటోరియంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సంయుక్తంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించాయి. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆవరణలో క్రిష్ణయ్య అధ్యక్షతన మొక్కలునాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వంతోపాటు ప్రతి పౌరుడి నైతిక బాధ్యత కూడా. ప్రభుత్వం విధానాలు తీసుకురాగలదు. నియంత్రణలు అమలు చేయగలదు. కానీ ప్రజల భాగస్వామ్యం లేకుండా స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించడం సాధ్యం కాదు. మన ఇల్లు ఎలా శుభ్రంగా ఉంచుకుంటామో.. అదే బాధ్యతతో మన వీధులు, పార్కులు, బహిరంగ ప్రదేశాలను కూడా కాపాడుకోవాలి. చిన్న నిర్లక్ష్యం పెద్ద సమస్యలకు దారితీస్తుంది. రోడ్లపై పడేసే ప్లాస్టిక్ కవర్లు, నీటి సీసాలు, ఇతర వ్యర్థాలు చివరికి చెత్త కుప్పలుగా మారి పర్యావరణాన్ని కలుషితం చేస్తాయి. వాటి ప్రభావం నేల, నీరు, గాలి మాత్రమే కాదు... మన ఆరోగ్యంపైనా తీవ్రంగా పడుతుంది. విదేశీ దేశాల్లో ప్రజలు పర్యావరణ పరిరక్షణ విషయంలో ఎంతో క్రమశిక్షణతో, నిబద్ధతతో వ్యవహరిస్తారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయరు. వ్యర్థాలను వేర్వేరుగా వర్గీకరించి అందజేస్తారు. పునర్వినియోగానికి ప్రాధాన్యత ఇస్తారు. పర్యావరణాన్ని కాపాడటం అంటే తమ భవిష్యత్తును కాపాడుకోవడమే అనే అవగాహన అక్కడ ప్రతి పౌరుడిలో కనిపిస్తుంది. అదే స్ఫూర్తి మన సమాజంలో కూడా రావాలి. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ప్లాస్టిక్ కాలుష్యం ఒకటి. ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వస్తువులు భూమిని, సముద్రాలను, జీవవైవిధ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయి. అందుకే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం కాలానుగుణ అవసరం. ప్లాస్టిక్‌కు బదులుగా జూట్ సంచులు, వస్త్ర సంచులు, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలి. ఇది కేవలం అలవాటు మార్పు కాదు... భవిష్యత్ తరాలకు మనం ఇచ్చే గొప్ప బాధ్యతాయుతమైన సందేశం' అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ 'ఆంధ్రప్రదేశ్‌ను డంపింగ్ ఫ్రీ స్టేట్ చేయడం లక్ష్యమని, చెత్తను పదినుంచి పన్నెండు కేటగిరీల్లో విభజించి శాస్త్రీయంగా రీసైక్లింగ్ చేయబోతున్నామని, అందుకోసం రాష్ట్రంలో 107 వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. అలానే సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించడంలో భాగంగా ప్రతి మున్సిపాలిటీనుంచి సేకరించిన వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి ఆదాయం అందించడంతోపాటు.. తడి చెత్తను బయోఫెర్టిలైజర్లుగా మార్చి రైతులకు తక్కువ ధరకే అందించనున్నట్టు తెలిపారు. అందులో భాగంగానే స్వచ్ఛ రథాలను గ్రామగ్రామాన తిప్పుతూ సరకులు అందించి చెత్తను తీసుకుంటున్నామ న్నారు. ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ కుమార్ మాట్లాడుతూ పిచుకలతోపాటు కాకులు కూడా అంతరించిపోయే పరిస్థితి ఏర్పడిందనీ, చెట్లను నరికి, అడవుల్ని ఆక్రమించుకోవడం వల్ల ఇలాంటి మరెన్నో పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. మన చుట్టూ రకరకాల ఉద్యోగాలు చేసేవాళ్లుంటారు. ఎవరి వృత్తి వాళ్లకి గొప్పది కావచ్చుకానీ. మనం పడేసే చెత్తను నిత్యం సేకరించే పారిశుద్ధ్య కార్మికుల పని మాత్రం చాలాచాలా గొప్పదని, అలాంటి వాళ్లకి మనం తడి చెత్తనీ, పొడి చెత్తనీ వేరు చేసి సహకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత, వాతావరణ మార్పుల ప్రభావం, పచ్చదనం పెంపు, కాలుష్య నియంత్రణవంటి అంశాలపై స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బి అనిల్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ పొలంరెడ్డి దినేష్ రెడ్డి ప్రసంగించారు. అనంతరం సినీ నిర్మాత పూర్ణ బట్టు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను, ప్రకృతితో మానవ సంబంధాన్ని హృద్యంగా ఆవిష్కరించిన "ఎగ్గా" చిత్రాన్ని ఆడిటోరియంలో ప్రదర్శించారు. పర్యావరణ స్ఫూర్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఏపీపీసీబీ చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రాజశేఖర్‌తోపాటు ప్రధాన కార్యాలయం, జోనల్, ప్రాంతీయ కార్యాలయాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# పర్యావరణ పరిక్షణ మన బాధ్యత

- సీఎం, డిప్యూటీ సీఎం లక్ష్యాలకు అనుగుణంగా పనిచేద్దాం
- పెద్దాపురంలో 3 కిలోమీటర్లు సైకిల్ తొక్కిన మంత్రి కొండపల్లి
- పర్యావరణ దినోత్సవం నేపథ్యంలో మొక్కలు నాటిన మంత్రి, ఎమ్మెల్యే రాజప్ప
- సూరంపాలెం ఎంఎస్ఎంఈ పార్క్ పనులు పరిశీలన
- ఎమ్మెల్యే క్యాంప్ వద్ద గ్రీవెన్స్‌లో అర్జీల స్వీకరణ



పెద్దాపురం (చైతన్య రథం): పర్యావరణ పరిక్షణలో రాష్ట్ర ప్రజలు అందరూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు పని చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ఆయన కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా పెద్దాపురం నియోజకవర్గంలో పర్యటించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం నేపథ్యంలో భాగంగా కూటమి నాయకులతో కలిసి మంత్రి పెద్దాపురం పట్టణంలో దర్గా సెంటర్ నుంచి మమ్మీ చర్చ్ వరకు 3 కిలోమీటర్లు సైకిల్ తొక్కారు. పెద్దాపురం కూటమి నాయకులతో కలిసి మంత్రి ఉత్సాహంగా సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మమ్మీ చర్చ్ దగ్గర ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్పతో కలిసి మంత్రి మొక్కలు నాటారు. అనంతరం మంత్రి కొండపల్లి మాట్లాడుతూ మన భూమి మన రక్షణ కవచం.. రాష్ట్రంలో 31శాతం ఉన్న గ్రీన్ బెల్ట్‌ను 50శాతానికి పెంచాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, అటవీశాఖా మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యానికి అనుగుణంగా మనం పని చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 5 కోట్ల మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. భావితరాలకు పచ్చని పర్యావరణాన్ని బహుమతిగా ఇవ్వాలని మంత్రి సూచించారు.

**రాజప్ప ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ పార్కు పనులు వేగవంతం:**

స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో సూరంపాలెంలో 29.70 ఎకరాల్లో నిర్మిస్తోన్న ఎంఎస్ఎంఈ పార్కు పనులు చాలా శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి కొండపల్లి ప్రశంసించారు. ఎంఎస్ఎంఈ పార్కు పనులు పరిశీలించిన మంత్రి అక్కడ ఇండస్ట్రీయల్ పార్కులో డ్రైనేజ్, విద్యుత్ వ్యవస్థ, రహదారుల నిర్మాణంతో పాటు ప్లాట్లను చూసి సూరంపాలెం ఎంఎస్ఎంఈ పార్కు అద్భుతంగా ఉందని ప్రశంసించారు. పెద్దాపురం శతాబ్ది పార్కును సందర్శించిన మంత్రి కొండపల్లి ఎమ్మెల్యే రాజప్ప గారి ఆధ్వర్యంలో ఇంత అందమైన పార్కు పెద్దాపురం పట్టణ వాసులకు వరంలా లభించిందన్నారు.

**ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ గ్రీవెన్స్‌లో మంత్రి:**

పెద్దాపురంలో ఎమ్మెల్యే గారి క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించి ప్రజా సమస్యల పైన మంత్రి కొండపల్లి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పెద్దాపురం నియోజకవర్గంలో గ్రీవెన్స్ ద్వారా 90 % సమస్యలు పరిష్కారం కోసం ఎమ్మెల్యే రాజప్ప గారు కృషి చేయడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. రాజప్పగారు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నందునే వరుసగా మూడుసార్లు నియోజకవర్గ ప్రజలు ఆయనకు పట్టం కట్టారని.. పెద్దాపురంలో రాజా సూరిబాబు రాజు గారి లాంటి సీనియర్ నాయకుల స్ఫూర్తితో యువనాయకత్వం ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, నూనె రామారావు, రంధి సత్యనారాయణ, అరీఫ్ అలీ, యాళ్ల వీరబాబు,పెదకాపు, శాస్త్రి, లక్ష్మణ్ దివాకర్, గున్ని, కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీపై మారీచులు మాయాస్త్రం!

ఆనాడు మారీచుడు బంగారు లేడి రూపంలో వచ్చి సీతా దేవిని మోసం చేసినట్లే, కలియుగంలో ఆధునిక మారీచులు మాయాస్త్రం తో ప్రజలను మోసం చేసేందుకు మెగా డీఎస్సీ పై పొలిటికల్ మైండ్ గేమ్ ఆడుతున్నారు. పురాణాల మారీచుడికి రూపాలు మార్చే శక్తి ఉన్నట్లే, నేటి ప్రజాస్వామ్యంలో ఆధునిక మారీచులు అయిన వైసిపి అధినేత జగన్ రెడ్డి,ఆ పార్టీ నాయకులు కూడా మాయా రూపాలు ప్రదర్శించడంలో వారికి వెన్నతో పెట్టిన విద్య..నాటి మారీచుడు బంగారు రంగును నమ్ముకొంటే,నేటి ఆధునిక మారీచులు అబద్దాలను నమ్ముకొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డీఎస్సీ ఉపాధ్యాయ నియామక ప్రక్రియపై మాజీ సియం జగన్ రెడ్డి, ఆ పార్టీ నాయకులు అవినీతి ఆరోపణలు చేయడం హాస్యాస్పదం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీ ఏస్సీ ప్రకటించి దాదాపు 16000 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రారంభించి రెండేళ్లు కూడా పూర్తీ కాకముందే నియామకాలు పూర్తి చేసి ఉపాధ్యాయులను పాఠశాలలకు అందించింది.డీ ఎస్సీ ప్రక్రియను అడ్డుకొనేందుకు వివిధ అభ్యంతరాలతో దాదాపు 240 కోర్టు కేసులు దాఖలు చేశారు. కోర్టు కేసుల అడ్డంకులను దాటుకొని కేవలం 140 రోజుల్లో ఉపాధ్యాయ నియామక పక్రియను విజయ వంతంగా ప్రభుత్వం పూర్తీ చేస్తే , రాజకీయ ప్రయోజనాల కోసం మెగా డీఎస్సీపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరం.

ఉద్యోగాలు సాధించిన వారు కష్టపడి చదివి డీఎస్సీ రాశాం అని, తమ ప్రతిభకు రాజకీయ రంగును పులమడం, తమ కష్టాన్ని తక్కువ చేసి చూపించడం సరైంది కాదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఎలాంటి అవకతవకలు జరగలేదని ప్రభుత్వం ఆధారాలతో చెప్పిన తర్వాత కూడా పదే పదే ప్రభుత్వం పై ఆరోపణలు చెయ్యడం దిగజారుడు రాజకీయానికి నిదర్శనం. డీఎస్సీలో తమకు అన్యాయం జరిగిందని ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా, ఉపాధ్యాయ నియామక ప్రక్రియ ముగిసిన దాదాపు ఏడాది తర్వాత ఇప్పుడు కావాలనే కొందరు కార్యకర్తలను నిరుద్యోగులుగా సృష్టించి వారిని రెచ్చగొట్టి ప్రభుత్వంపై ఆరోపణలు చేయిస్తున్నారు. డీఎస్సీపై ప్రభుత్వం ఇచ్చిన వివరణను కూడా వక్రీకరిస్తూ దురుద్దేశపూరితంగా, ప్రజల్ని తప్పుదారి పట్టించేలా కొన్ని పత్రికలలో తప్పుడు కథనాలు రాయిస్తున్నారు.పారదర్శకంగా నిర్వహించిన ఉపాధ్యాయుల నియామక ప్రక్రియపై బురదజల్లడానికి ప్రయత్నించడం దొంగే దొంగా, దొంగా అన్నట్లు ఉంది.

**అబద్దాలకు బ్రాశీడ్ అంబాసిడర్ జగన్!**

ఉపాధ్యాయ నియామక పోస్టుల భర్తీ పై ఎలాంటి అవినీతికి తావులేకుండా సాంకేతికతను జోడించి ఉపాధ్యాయులను నియమించింది కూటమి ప్రభుత్వం.రాజకీయ ఉనికి కోసం నిరుద్యోగుల పై ఆరోపణలు చేయడం బాధ్యాతా రాహిత్యం. ఉపాధ్యాయ నియామకాల్లో అవినీతి జరిగిందంటూ జగన్ మోహన్ రెడ్డి, ఆ పార్టీ నాయకులు చేస్తున్న విమర్శలు తాము చేయలేక పోయిన నియామకాలను తెలుగుదేశం ప్రభుత్వం చెయ్యడం చూసి ఓర్వలేక చేస్తున్న ఆరోపణలుగా స్పష్టమవుతున్నది.ఐదేళ్ల తన పాలనలో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలను రోడ్డున పడేసిన చరిత్ర జగన్ రెడ్డిదే. ఆనాడు నిరుద్యోగుల ఆక్రందనలు వినపడని జగన్ రెడ్డికి, నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వేలాది పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టడం మింగుడుపడటం లేదు.నీతి భాహ్యారాజకీయాలకు ,అబద్దాలకు బ్రాశీడ్ అంబాసిడర్ అయిన జగన్ రెడ్డి 2019 లోను ఇంతే అబద్ధాలను పదేపదే వల్లెవేసి, అవే నిజాలుగా జనాన్ని నమ్మించి గెలిచి జనం గొంతు కోశారు. 16,000 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీలో అక్రమాలు జరిగాయని, పోస్టులు అమ్ముకున్నారని, మూడేళ్లు కళ్లు మూసుకుంటే తన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని..తాను అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీపై రీ-ఎంక్వయిరీ వేస్తానని, డిఎస్సి రద్దు చేస్తానని,అప్పటి దాకా ఓపిక పట్టాలని జగన్ రెడ్డి ఉత్తరకుమార ప్రగల్బాలు పలకడం చూసి ఆ పార్టీ నాయకులు కూడా నవ్వుకుంటున్నారు. తనని రాష్ట్ర ప్రజలు ఎదో ఆరాధిస్తున్నట్లు ఆయన భ్రమల్లో విహరిస్తున్నారు.

**ఆరోపణలు వెనుక ఉన్న వ్యూహం ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చడమే!.**

రాజకీయ ఉనికి కోసం అబద్ధాలనే పెట్టుబడిగా మార్చుకోవడం జగన్ రెడ్డి నైజంగా మారింది. డీఎస్సీ పై ఆరోపణలు ఉనికి కోసమే తప్ప ఉపాధ్యాయుల పై ప్రేమతో కాదు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడాన్ని చూసి తట్టుకోలేక ఉపాధ్యాయులలో లేని పోని అభద్రతా భావాన్ని సృష్టించి రాజకీయంగా పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. ఈ తప్పుడు ప్రచారం వెనుక ఉన్న వ్యూహం ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చడమే. దీనిని భూతద్దంలో చూపెట్టి ప్రభుత్వంపై బురద చల్లడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ లక్షలాది నిరుద్యోగ యువత జీవితాలతో ముడిపడి ఉంది. అలాంటి అత్యంత కీలకమైన నియామక ప్రక్రియపై ఆధారాలు లేకుండా అవినీతి ఆరోపణలు చేయడం కేవలం ప్రభుత్వాన్నే కాదు,ఉద్యోగాల కోసం కష్టపడి పరీక్షలు రాసిన అభ్యర్ధుల ప్రతిభను కూడా అవమానించడమే. డీఎస్సీ నియామకాలు సాధారణంగా కంప్యూటర్ ఆధారిత పరీక్షలు, మెరిట్ ఆధారిత జాబితాలు, రిజర్వేషన్ నిబంధనలు, ఆన్‌లైన్ కౌన్సెలింగ్ వంటి బహుళ దశల్లో జరుగుతాయి. అభ్యర్థుల మార్కులు, ర్యాంకులు, ఎంపిక ప్రక్రియ అన్నీ సాంకేతిక వ్యవస్థల ఆధారంగా నమోదవుతాయి.ఇలాంటి వ్యవస్థలో అవినీతి జరిగిందని ఆరోపిస్తే, దానికి బలమైన ఆధారాలు, నిర్దిష్ట ఉదాహరణలు, నష్టపోయిన అభ్యర్థుల వివరాలు చూపించాల్సిన బాధ్యత జగన్ ముఠా పై వుంది.

**వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో డీఎస్సీ గందరగోళం!**

గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో,తర్వాత జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఉద్యోగ నియామకాల్లో జరిగిన లోపాలు, అవినీతి వైఫల్యాల చరిత్రను ఒక్కసారి జగన్ గుర్తు తెచ్చుకోవాలి. రాజశేఖర్ రెడ్డి హయాంలో డీఎస్సీ గందరగోళం, కటాఫ్ వివాదాలు, కోర్టు కేసులు,జగన్ రెడ్డి హయాంలో జరిగిన డీఎస్సీ నియామకాలు అన్ని గందగోళమే. 2008 డీఎస్సీ నుంచి మొదలుకొని అనేక నియామకాల్లో తీవ్ర అవినీతి, బంధుప్రీతి ఆరోపణలు వెల్లు వెత్తాయి..మార్కుల తారుమారు - 'కీ' వివాదాలు,జగన్ హయాంలో డీఎస్సీ నిర్వహణలో పేపర్ లీకేజీలు, తప్పుడు 'కీ'ల వల్ల వేలాది మంది అర్హులైన అభ్యర్థులు నష్టపోయారు. మెరిట్ జాబితాలను ఇష్టారాజ్యంగా మార్చారని అభ్యర్థులు రోడ్డెక్కారు.కోర్టుల చుట్టూ తిరిగిన నియామకాలు,తప్పుడు విధానాల వల్ల 2008 డీఎస్సీ వివాదం ఏళ్ల తరబడి కోర్టుల్లో విచారణ జరిగింది. అర్హులైన ఎంతో మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయేలా చేసిన ఘనత నాటి వైఎస్ ప్రభుత్వానిదే. స్థానికత, రిజర్వేషన్ల వర్తింపులో జరిగిన అక్రమాల వల్ల ప్రతిభావంతులకు తీవ్ర అన్యాయం జరిగింది. తర్వాత జగన్ హయాంలో 2019-2024 మధ్య కాలంలో జగన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం నిరుద్యోగులను దారుణంగా వంచించడం జరిగింది. ప్రతి ఏటా మెగా డీఎస్సీ నిర్వహిస్తామని నిరుద్యోగులకు ఇచ్చిన హామీని జగన్ ప్రభుత్వం తుంగలో తొక్కి నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్నారు. చివరి నిమిషంలో ఇచ్చిన అరకొర పోస్టుల నోటిఫికేషన్ కూడా కేవలం ఎన్నికల స్టంట్‌గానే మిగిలిపోయింది.గ్రామ-వార్డు సచివాలయాల నియామకాల్లో భారీ అక్రమాలు చేశారు. లక్షకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని చెప్పుకున్న సచివాలయ నియామకాల్లో తీవ్రమైన అవినీతి ఆరోపణలు వచ్చాయి. పరీక్ష నిర్వహించిన రోజే పేపర్ లీక్ అయిందని, వైసీపి సానుభూతిపరులకే మార్కులు ఎక్కువగా వచ్చాయని అభ్యర్థులు ఆందోళనలు చేశారు. మెరిట్‌ను పక్కనబెట్టి సొంత పార్టీ కార్యకర్తలను వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులుగా మార్చుకున్నారనేది బహిరంగ రహస్యం.

**జగన్ పాలనలో ఉపాధ్యాయులకు చేదు జ్ఞాపకాలు !**

మొదటి నుండి జగన్ రెడ్డి కి ఉపాధ్యాయుల పై గౌరవం లేదు.ప్రజాస్వామ్యంలో ఉపాధ్యాయులు కేవలం ఉద్యోగులు కాదు. సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులు. జగన్ హయాంలో ఉపాధ్యాయులు ఎదుర్కొన్న దుర్భర పరిస్థితులను పరిశీలిస్తే, వారిపై యాప్ ల పేరుతో ఒత్తిడి, వేధింపులు, కక్షసాధింపు ధోరణి కనిపించింది. ఉపాధ్యాయులు తమ హక్కుల కోసం గళం విప్పిన వారిపై కేసులు నమోదు చేశారు, కొన్నిచోట్ల మద్యం దుకాణాల నిర్వహణ, పర్యవేక్షణ వంటి పనులకు కూడా ఉపాధ్యాయులను వినియోగించారు. జగన్ పాలనలో ఉపాధ్యాయులు ఎదుర్కొన్న అనుభవాలు తమకు చేదు జ్ఞాపకాలుగా మిగిలాయని అనేక సంఘాలు చెప్పాయి.అందుకే ఆయన హయాంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుక రోజు మాకే పూజలు వద్దు, పురస్కారాలూ వద్దు, మీ సన్మాన సత్కారాలు వద్దు మమ్మల్ని రోడ్డు మీద దోషులుగా నిలబెట్టకుంటే చాలు, మాకే ఉత్సవం, వూరేగింపు వద్దు, మాకే దండ వద్దు, దండమూ వద్దు, మమ్మల్ని అవమానించకుంటే చాలు, మాకే గౌరవం వద్దు, గుర్తింపూ వద్దు పొగడ్తలూ వద్దు మా మర్యాదను మంటగలపకుంటే చాలు సమాజంలో నేరస్తులుగా చిత్రీకరించకుంటే చాలు, మమ్మల్ని ఉపాధ్యాయులుగా గుర్తిస్తే చాలు, మా ఆత్మ గౌరవానికి ప్రతీక అదే మాకు మీరిచ్చే గురుపూజోత్సవ కానుక అంటూ టీచర్స్ డే రోజున జగన్ హయాంలో ఉపాధ్యాయులు గోడు వెళ్లపోసుకొవాల్సిన దుస్థితి. ఏది ఏమైనా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకం లక్షలాది మంది నిరుద్యోగుల స్వప్నం, ఎన్నో కుటుంబాల భవిష్యత్తు.. వెలాది మంది నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన డీఎస్సీ పై ఆరోపణలు రూపంలో మారీచులు సంధించే మాయాస్త్రాలు అభ్యర్థుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి.మారీచుడి మాయను గుర్తించడంలో సీతదేవి పొరబడినట్లు. ఈ ఆధునిక మారీచుల తప్పుడు ప్రచారాలను నమ్మి ఉపాధ్యాయులు తమ విలువైన సమయాన్ని, ఏకాగ్రతను కోల్పోవద్దు. అట్లాగే వైసిపి మారీచులు ఎన్ని కుయుక్తులు పన్నినా, మైండ్ గేమ్‌లతో గందరగోళం సృష్టించినా మారీచుల మాయాస్త్రాలను ప్రజలు గుర్తించలేరు అనుకోవడం వారి అజ్ఞానం అవుతుంది.

నీరుకొండ ప్రసాద్

## మహిళా సాధికారతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- బూర్జలో మన డబ్బులు - మన లెక్కలు అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే కూన రవికుమార్




"మన డబ్బులు – మన లెక్కలు" కార్యక్రమం ద్వారా సంఘాల నిర్వహణలో పారదర్శకత పెరగడంతో పాటు సభ్యుల్లో ఆర్థిక క్రమశిక్షణ, బాధ్యత పెంపొందుతుందని తెలిపారు. ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి

ఆముదాలవలస (చైతన్యరథం): నియోజకవర్గంలోని బూర్జ మండల కేంద్రం బూర్జ గ్రామంలో (SERP) & (DRDA) ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షతన స్వయం సహాయక సంఘాల సభ్యులతో "మన డబ్బులు – మన లెక్కలు" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆముదాలవలస శాసనసభ్యులు మరియు రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ... స్వయం సహాయక సంఘాలు గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు బలమైన వేదికలుగా నిలుస్తున్నాయని అన్నారు. మహిళలు తమ పొదుపులు, రుణాలు, ఆర్థిక లావాదేవీలపై పూర్తి అవగాహన కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.

కోసం అనేక సంక్షేమ, ఆర్థిక కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. మహిళలు సంఘాల ద్వారా ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు కుటుంబాలు, గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘాల లావాదేవీలు, పొదుపులు, రుణాల వినియోగం, ఖాతాల నిర్వహణ తదితర అంశాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. మహిళలు తమ ఆర్థిక వ్యవహారాలను స్వయంగా పర్యవేక్షిస్తూ సంఘాల పురోగతికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, సేర్ప్, డీఆర్‌డీఏ అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మరియు స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## న్యూజిలాండ్ గడ్డపై రెపరెపలాడిన పసుపు జెండా... ఘనంగా మహానాడు వేడుకలు



న్యూజిలాండ్ (చైతన్యరథం) ఎన్నారై తెలుగుదేశం న్యూజిలాండ్ టీమ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మహానాడు వేడుకలు ఘనంగా నిర్వహిచారు. ఈ కార్యక్రమం న్యూజిలాండ్ ఎన్నారై టీడీపీ అధ్యక్షురాలు మమత గారపాటి అధ్యక్షతన వైభవంగా చేపట్టారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయనగరం పార్లమెంట్ సభ్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి కలిశెట్టి అప్పలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "తెలుగు జాతిని ఐక్యం చేసిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను. గతంలో జరిగిన అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు, ముఖ్యంగా ఎన్నారైలు చూపిన సంఘీభావం పార్టీకి ఎంతో బలాన్ని ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోధైర్యం, తెలుగుదేశం కార్యకర్తల పోరాటస్ఫూర్తి కలిసి సైకో పరిపాలనకు ముగింపు పలికాయి" అని పేర్కొన్నారు. "తెలుగు నేలపై ఆవిర్భవించిన పసుపు జెండా ఖండాంతరాలు దాటి ప్రపంచ చివరన ఉన్న న్యూజిలాండ్‌లో ఎగరవేయడం చారిత్రాత్మక ఘట్టం. విజనరీ నాయకుడు నారా చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్ సమర్థ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీకి తిరుగులేదు" అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సహకారంతో ఎన్డీయే ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బలమైన పునాదులు వేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యూజిలాండ్ ఎంపీ హెలెన్ వైట్, ప్రస్తుత ఎంపీ కార్లోస్ చియుంగ్, మాజీ మంత్రి మైఖేల్ వుడ్ తదితరులు పాల్గొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వాన్ని ప్రస్తావించడం ఆనందాన్ని కలిగించిందని అప్పలనాయుడు తెలిపారు. అనంతరం నందమూరి తారక రామారావు, నందమూరి బాలకృష్ణకి సంబంధించిన సినీ గీతాలతో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో ఎన్నారై తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు కుటుంబ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతిఒక్కరిది



మంగళగిరి (చైతన్యరథం): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు మంగళగిరిలో సైకిల్ ర్యాలీ చేపట్టారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మంగళగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం డా. ఎంఎస్ఎస్ భవన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ గౌతమ బుద్ధ రోడ్, ఆల్ఫా సెంటర్ మీదుగా తిరిగి పార్టీ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు చెట్ల పెంపకం, సైకిల్ వినియోగం వంటి పర్యావరణ హిత చర్యలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని నేతలు పిలుపునిచ్చారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే అదితి

విజయనగరం (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనలు మేరకు నిరంతరం ప్రజాదర్బార్లు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అధికారులతో చర్చించి వీటికి పరిష్కారం చూపుతామని ఆమె హామీ ఇచ్చారు. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



## కార్యకర్తలకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్



పెదకూరపాడు (చైతన్యరథం) : 94వ రోజు ప్రజల వద్దకు ప్రవీణ్ 100 రోజులు 100 గ్రామాలు కార్యక్రమాన్ని బెల్లంకొండ మండల కేంద్రంలో నిర్వహించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్న ఎమ్మెల్యే గ్రామాలకు లింక్ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నియోజకవర్గంలో ఇప్పటికే 60శాతం రోడ్లను నిర్మించామన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని ముఖ్యమంత్రికి వివరిస్తామన్నారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో అవసరమైన నిధులను తెచ్చి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ప్రజల వద్ధకు ప్రవీణ్ 100 రోజులు 100 గ్రామాలు కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమయం పట్టే సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు. గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి గ్రామాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామంలో వీధి లైట్లు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేయాలని సూచించారు. గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా పనిచేయాలన్నారు. గ్రామ నాయకులతో సమావేశమై కలిసి కట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

## ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు కీలకమే : టీడీపీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



ఎస్.కోట (చైతన్యరథం): ఓటర్ల జాబితా పరిశీలనలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని, ఈ నెల 15వ తేది నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియ నేపథ్యంలో బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్ఏ)లు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సూచించారు. శుక్రవారం ఎల్.కోట క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా... ఈ నెల 15వ తేదీ నుండి కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (SSR) ప్రక్రియపై సుదీర్ఘంగా చర్చించామని, ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ ఎంతో విలువైందన్నారు. ఈ ప్రక్రియలో బూత్ లెవెల్ ఏజెంట్లు, బూత్ లెవెల్ అధికారులు అత్యంత క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూసేలా బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చాను. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్ మరియు యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు మరియు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరూ బాధ్యతగా తీసుకోవాలి : ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస (చైతన్యరథం): పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పలాసలో పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. పలాస ముత్యాలమ్మ కోనేరు వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని గుర్తు చేశారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఈ శ్రీనివాసులు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ విటల్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎం. శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

## పర్యావరణ హితమే... ప్రతి ఒక్కరి పరమావధి : ఎమ్మెల్యే ముప్పిడి



కొవ్వూరు (చైతన్యరథం): పర్యావరణ హితమే ప్రతి ఒక్కరి పరమావధి అని, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం హరితాంధ్ర కార్యక్రమంలో భాగంగా కొవ్వూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, ప్రజల్లో పర్యావరణ చైతన్యం కల్పించడం లక్ష్యంగా స్థానిక నందమూరి రోడ్డులోని బుద్ధ విగ్రహం వద్ద మొక్కలు నాటారు. అనంతరం అక్కడి నుండి కొవ్వూరు ఆర్‌డీఓ కార్యాలయం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు మరియు పర్యావరణ ప్రేమికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని పాల్గొన్న వారు పేర్కొన్నారు. హరితాంధ్ర కార్యక్రమం ద్వారా పచ్చదనం విస్తరణ, కాలుష్య నియంత్రణ పర్యావరణ సమతుల్యత సాధనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

## ప్రజా సమస్య పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే నక్కా



వేమూరు (చైఉతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. శుక్రవారం అమృతలూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన 'మీకోసం-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో బాపట్ల జిల్లా కలెక్టర్ డా. వినోద్‌కుమార్ కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, సమస్యలను నేరుగా స్వీకరించి త్వరితగతిన పరిష్కరించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**పర్యావరణంపై అవగాహనకు సైకిల్ ర్యాలీ**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా టీడీపీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా అమృతలూరు సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఆర్యవైశ్య కల్యాణ మండపం వరకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, సైకిల్ వినియోగంతో వాయు కాలుష్యం తగ్గడంతో పాటు ఇంధన పొదుపు జరుగుతుందని, ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆయన తెలిపారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, తగ్గుతున్న పచ్చదనం వంటి సవాళ్లను అధిగమించేందుకు ప్రభుత్వాలతో పాటు ప్రజలు భాగస్వాములు కావాలన్నారు.

## సైకిల్ తొక్కిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ (చైతన్యరథం): నందిగామ మండలం మునగచర్ల గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సైకిల్ తొక్కారు. జాతీయ రహదారి నుంచి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు సైకిల్పై వచ్చారు. ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపు పాటించాలని కోరారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ప్రజాదర్బార్లో వినతి పత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వీరాస్వామి, మాజీ సర్పంచ్ నరసింహయ్య, కొల్లూరు నాగేశ్వరరావు, ఆర్డీవో అనిల్ కుమార్, తహసీల్దార్ సురేష్ బాబు పాల్గొన్నారు.

## సైకిల్ వినియోగంతో ఆరోగ్యం... పర్యావరణ పరిరక్షణ : దూండీ



విజయవాడ (చైతన్యరథం): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం విజయవాడ, విద్యాధరపురంలో ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూండీ రాకేష్ కార్యాలయం నుంచి చర్చి సెంటర్, శివాలయం సెంటర్ మీదుగా స్వాతి థియేటర్ వరకూ సాగింది. ఈ కార్యక్రమానికి విజయవాడ పశ్చిమ నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ అయిన మల్లెల ఈశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దూండి రాకేష్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టే చర్యలను స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆదేశాల మేరకు, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ సూచనలతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, సైకిల్ వినియోగంతో వాయు కాలుష్యం తగ్గడంతో పాటు ఇంధన పొదుపు జరుగుతుందని, ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని దూండీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారదర్శకంగా రెండేళ్ల ప్రజాపాలన : టీడీపీ నేత యేదుపాటి రామయ్య




విజయవాడ (చైతన్యరథం): ఎన్డీఏ కూటమి ప్రజా పాలన రెండేళ్లు ఎంతో పారదర్శకంగా సాగిందని, రాష్ట్రాభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్రం తిరిగి గాడిన పడిందని టీడీపీ మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య వ్యాఖ్యానించారు. శుక్రవారం విజయవాడ హౌసింగ్ బోర్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్డీయే పరిపాలన రెండేళ్లు పూర్తియిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అడుగులు వేస్తున్నారని, రాష్ట్రాన్ని విధాలా ముందుకు తీసుకువెళ్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన పట్ల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని, రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్తామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజయాడలో మొక్కలు నాటిన రాష్ట్ర గవర్నర్



విజయవాడ (చైతన్యరథం): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ శుక్రవారం లోక్‌భవన్ ఆవరణలో ఎర్ర జామ మొక్కను నాటారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. పెరుగుతున్న ప్రపంచ ఉష్ణోగ్రతలు, తీవ్రమైన వాతావరణ పరిస్థితులు, పర్యావరణ క్షీణతను తగ్గించడానికి చర్యలను వేగవంతం చేయడంపై ప్రాథమికంగా దృష్టి సారించాలని అభిప్రాయపడ్డారు. ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని 'ప్రకృతి స్ఫూర్తి.. వాతావరణం కోసం.. మన భవిష్యత్తు కోసం' అనే ఇతివృత్తంతో నిర్వహించుకుంటున్నామని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర జీవనంపై అవగాహన పెంచడానికి నిర్వహించే ప్రచారంలో ప్రతి ఒక్కరూ భాగం కావాలని గవర్నర్ కోరారు.

## మానవతామూర్తి సీఎం చంద్రబాబు

**●ప్రజల నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుంది**

**●రూ.55,27,455 విలువైన చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారు**



కొత్తపేట (చైతన్యరథం): సీఎం రిలీఫ్ ఫండ్ క్రమం తప్పకుండా అందిస్తూ గొప్ప మానవతావాదిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిలుస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుందని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయనిధి అనేది మృగ్యంగా ఉండేదని, ఎవ్వరికీ దొరికేది కాదన్నారు. నేడు పేద ప్రజలకు ఎవరు ఏ విధమైన వైద్యం చేయించుకున్నా, వారికి కష్టాల్లో చేదోడు వాదోడుగా ఉండాలని కనీస సహాయం అందించాలనే దృక్పథంతో ఆర్థిక సహకారాన్ని చెక్కుల రూపంలో అందరికీ అందిస్తున్నామన్నారు. మన నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సీఎం సహాయనిధి అందుతుందన్నారు. అర్హులందరికీ పారదర్శకంగా చెక్కుల పంపిణీ జరుగుతుందన్నారు. ఇప్పటికే సంక్షేమం పెద్ద ఎత్తున ఈ ప్రభుత్వంలో అందుతుందన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ మొదలైన పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయన్నారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి థాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, పల్లి భీమరావు,కంఠంశెట్టి శ్రీనివాస్,కరుటూరి నరసింహారావు, పాలూరి సత్యానందం, చిలువురి సతీష్ రాజు, ఈదాల సత్తిబాబు, కొసంపూడి రామకృష్ణరాజు, గనిశెట్టి వీరేష్, కొప్పిశెట్టి ప్రసాద్ మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : ఎమ్మెల్యే బుచ్చిబాబు



ముమ్మిడివరం (చైతన్యరథం): డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో శుక్రవారం ఉదయం నగర పంచాయతీ పరిధిలో ముమ్మిడివరం నియోజకవర్గ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వవిప్ దాట్ల బుచ్చిబాబు ఆధ్వర్యంలో నగర పంచాయతీ 10వ వార్డ్ అంబేద్కర్ నగర్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆవరణలో ప్రపంచ పర్యావరణ సందర్భంగా హరితాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ఎమ్మెల్యే బుచ్చిబాబు మొక్కలు నాటిన అనంతరం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆపరేషన్ క్లీన్ స్వీప్ పారిశుధ్య గ్యాంగ్ వర్క్ నిర్వహించి విస్తృతస్థాయిలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుచ్చిబాబు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని ప్రకృతిని కాపాడాలని వీధుల శుభ్రత చెత్త తొలగింపు డ్రైన్ల క్లీనింగ్ వంటి కార్యక్రమాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని హరిత ముమ్మిడివరం అనే నినాదంతో ముమ్మిడివరం నగర పంచాయతీ నందు ఎక్కువ మొక్కలు నాటాలని కోరారు అనంతరం AIIదీ ప్రాజెక్ట్ మరియు అమృత్2.0 ద్వారా క్రాప చింతలపూడి మరియు అగ్రహారం నందు నిర్మించే 5 లక్షల లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంకులకు శంకుస్థాపన చేశారు, అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున ప్రజలంతా సైకిళ్లను వినియోగించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని బుచ్చిబాబు పిలుపునిచ్చారు.

## సైకిల్‌పై వచ్చి మొక్కలు నాటిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

**●అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సైకిల్ యాత్ర**



వినుకొండ (చైతన్యరథం): అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వినుకొండ మండలం అందుగుల కొత్తపాలెం గ్రామంలోని గుండ్లకమ్మ నది ఒడ్డున హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ఆయన స్వయంగా సైకిల్ తొక్కుతూ అందుగుల కొత్తపాలెం గ్రామానికి చేరుకున్నారు. అనంతరం గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతంలో ఆయన ప్రజలతో కలిసి మొక్కలు నాటారు. ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, పర్యావరణ సమతుల్యత కోసం పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షించాలని ఈ సందర్భంగా చీఫ్ విప్ పిలుపునిచ్చారు.

**ప్రజల నుంచి అర్జీలు స్వీకరణ**

మొక్కలు నాటే కార్యక్రమం అనంతరం మున్సిపల్ కార్యాలయంలో 'ప్రజా దర్బార్' నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ వార్డుల నుండి వచ్చిన ప్రజల నుంచి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు స్వయంగా అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్న ఆయన, వాటిని సత్వరమే పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## 'విజన్ యాక్షన్ ప్లాన్' వేదికగా ఎమ్మెల్యే వేగేశన అర్జీల స్వీకరణ



బాపట్ల (చైతన్యరథం): పర్యావరణ పరిరక్షణ కేవలం నినాదాలకే పరిమితం కాకూడదని, ఆచరణలో చూపించాలని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు నిరూపించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే ఒక వినూత్నమైన, స్ఫూర్తిదాయకమైన నిర్ణయం తీసుకున్నారు. పర్యావరణంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శుక్రవారం ఆయన స్వయంగా సైకిల్ తొక్కుకుంటూ బాపట్ల పట్టణ మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని 'విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్' కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బాపట్ల నియోజకవర్గంలోని నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల వద్ద నుండి స్వయంగా అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే... బాధితులతో ఓపికగా మాట్లాడి ధైర్యం చెప్పారు. అర్జీలన్నింటినీ పరిశీలించి, వాటిని తక్షణమే పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూజివీడు 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'... పాల్గొన్న చైర్మన్ పట్టాభిరామ్



నూజివీడు (చైతన్యరథం): ఏలూరు జిల్లాలోని నూజివీడుని స్వచ్ఛ మున్సిపాల్టీగా తీర్చిదిద్దుతామని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చెప్పారు. 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన నూజివీడు పట్టణంలో పర్యటించారు. మున్సిపాల్టీ పరిధిలో రూ.2.80 కోట్ల వ్యయంతో నిర్మించే ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ ప్లాంట్ పనులను పర్యవేక్షించారు. డంపింగ్ యార్డ్ వద్ద ఇంకా మిగిలి ఉన్న చెత్తని త్వరగా తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి కొన్ని సూచనలు చేశారు. పట్టణంలో మురుగునీటి కాలువలలో పూడికతీత పనులలో ఆయన స్వయంగా పాల్గొన్నారు. చీపురు పట్టుకుని వీధులను శుభ్రం చేశారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ... మంత్రి పార్థసారధి ఈ మున్సిపాల్టీపై ప్రత్యేక దృష్టి పెట్టారని, ఆయన సారధ్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ దీనిని స్వచ్ఛ మున్సిపాల్టీగా తీర్చిదిద్దుతుందని చెప్పారు. 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'లో భాగంగా రాష్ట్రంలోని మున్సిపాల్టీలలో ఈ వారం డ్రైనేజీలు క్లీన్ చేస్తున్నట్లు తెలిపారు. నూజివీడులో కూడా కాలువలలో పూడిక తీస్తున్నట్లు చెప్పారు. నూజివీడు మున్సిపాల్టీ పరిధిలో ప్రతి రోజు వచ్చే 35 టన్నుల చెత్తని ఏ రోజుకా రోజు ప్రాసెస్ చేయడానికి స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఈ ప్లాంట్‌ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. గతంలో ఇక్కడ పేరుకుపోయిన 30 వేల టన్నుల చెత్తని క్లియర్ చేస్తున్నట్లు తెలిపారు.

## స్వచ్ఛ గుడివాడకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే వెనిగండ్ల

**●శానిటేషన్, డ్రైనేజీ వ్యవస్థలపై... ఎమ్మెల్యే రాము రివ్యూ సమావేశం**



గుడివాడ (చైతన్యరథం): స్వచ్ఛ గుడివాడ రూపకల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆ దిశగా ఇప్పటికే గుడివాడలో అనేక మార్పులు చోటు చేసుకున్నట్లు తెలిపారు. నైట్ శానిటేషన్‌తో... పొద్దున్న లేవగానే ప్రశాంతమైన గుడివాడని ప్రజలు చూడాలనేదే లక్ష్యం అని ఎమ్మెల్యే రాము పునరుద్ఘాటించారు. గుడివాడ పట్టణంలో శానిటేషన్ సమస్యల పరిష్కారం, స్వచ్ఛ గుడివాడ లక్ష్యంపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ అధికారులు, శానిటేషన్ ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ముందుగా రాబోవు వర్షాకాలం దృష్ట్యా తీసుకోవలసిన ముందస్తు చర్యలపై ఎమ్మెల్యే రాము అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను శానిటేషన్ అధికారులు ఎమ్మెల్యే రాము, కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. బాధ్యతతో పనిచేస్తూ సమస్యలను పరిష్కరించుకుందామని, ప్రజలను కూడా భాగస్వామ్యం చేద్దామని సమావేశంలో ఎమ్మెల్యే రాము, కమిషనర్ మనోహర్ అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ... పరిశుభ్రమైన గుడివాడను భావితరాలకు అందించడమే మన అందరి లక్ష్యం కావాలన్నారు. ఉద్యోగులందరూ శానిటేషన్ పనులను బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. నైట్ శానిటేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని, పొద్దున్న లేవగానే ప్రజలు ప్రశాంతమైన గుడివాడను చూడాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ప్రస్తుతం చేపడుతున్న చెత్త తొలగింపు డ్రైవ్‌ను ఏడాది క్రితమే గుడివాడలో విజయవంతంగా చేశామని తెలిపారు.

## గుంటూరులో సమస్యల పరిష్కారానికి ప్రజా గ్రీవెన్స్



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు ప్రజాగ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి వినతులు, అర్జీలు స్వీకరించారు. మహమ్మద్ రఫీ, కసుకుర్తి హనుమంతరావు, గుర్రం ప్రసాద్, పరుచూరి సంజీవరావు, తన్నీరు కృష్ణ, మువ్వా వేణు బాబు, ముత్తినేని శివలీల, కల్పన పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను నమోదు చేసుకుని ఎమ్మెల్యే గళ్ళా మాధవి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గళ్ళా మాధవి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, భద్రత, సాధికారత కోసం ప్రభుత్వం మరియు ప్రజాప్రతినిధులు కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఇలాంటి గ్రీవెన్స్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలు నిర్భయంగా తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సైకిల్ తొక్కిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



విజయవాడ (చైతన్యరథం): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు పిలుపు మేరకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సైకిల్ తొక్కారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో శుక్రవారం ఆయన సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సైకిల్, ఈ-సైకిళ్ల వాడకం పెంచాలన్న ముఖ్యమంత్రి సూచనను అనుసరిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సైకిల్ వినియోగం పెంచాలని ఎమ్మెల్యే కోరారు. కాలుష్యాన్ని తగ్గించడానికి సైకిళ్లు, ఈ-సైకిళ్లే ఉత్తమ మార్గమని ఆయన పేర్కొన్నారు. సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. సైకిల్ ర్యాలీ అనంతరం గొల్లపూడిలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. పర్యావరణాన్ని కాపాడటం మన బాధ్యత మాత్రమే కాదు, భావి తరాలకు కానుక అని తెలిపారు. ఒక్క మొక్క నాటితే ప్రకృతికి ఊపిరి, పర్యావరణాన్ని కాపాడితే భవిష్యత్తుకు భరోసా అన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత : ఎమ్మెల్యే బూర్ల



ప్రత్తిపాడు (చైతన్యరథం): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన సైకిల్ ర్యాలీ స్ఫూర్తితో పెదనందిపాడులో శుక్రవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమానికి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సైకిల్‌పై విచ్చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి పెదనందిపాడు వీధుల్లో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తూ, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ... ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు సమాజానికి సైకిల్ వినియోగం ద్వారా గొప్ప సందేశం ఇచ్చారని, ఆస్ఫూర్తితోనే సైకిల్‌పై రావడం జరిగింది. వాహనాల వినియోగం వల్ల పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ వారంలో కనీసం ఒకరోజు సైకిల్‌ని వినియోగించాలని సూచించారు. దీంతో పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్య సంరక్షణ కూడా సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి ఇంటి ముందు, ప్రతి వీధిలో ఒక మొక్క నాటాలని, చెట్ల పెంపకం ద్వారా వర్షపాతం పెరగడంతో పాటు ఉష్ణోగ్రతల తగ్గుతాయని, భావితరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అనే ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు పిలుపు.. పర్యావరణ ప్రియులకు మేలుకొలుపు!

## పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిదీ... డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



దర్శి (చైతన్యరథం): పపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రమైన ముండ్లమూరులో కలెక్టర్ పి రాజబాబుతో కలిసి దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ ఏపీ మోడల్ స్కూల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన హరితమైన వాతావరణాన్ని అందించాలంటే పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా తీసుకొని మొక్కలు నాటాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలో చేపట్టారన్నారు. అదేవిధంగా ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ గారు అమ్మ పేరుతో మొక్క నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. అదే స్ఫూర్తితో మనం కూడా మన పిల్లలు, తల్లుల పేరుతో పుట్టిన రోజు సందర్భంగా ఇలా ఏదో ఒక సందర్భాన్ని భవిష్యత్ తరాలు కాపాడేందుకు మొక్కలు నాటే మహోద్యమంలో పాల్గొని, పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ప్రకృతి వైపరీత్యాలు మానవాళికి హెచ్చరికలుగా మారాయన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కళ్ళు ప్లాస్టిక్ వినియోగాన్ని ఆపివేసి చెట్లు పెంపకానికి ప్రాధాన్యత నివ్వాలన్నారు. నీటి సంరక్షణకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒక మొక్క నాటి హరిత విప్లవ స్ఫూర్తిని అందించాలన్నారు. ఇది ప్రజా ఉద్యమంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. మన ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యమైన సమాజం సాధించవచ్చన్నారు. నీటి పొదుపును పాటించాలన్నారు. వాయు కాలుష్యానికి దూరంగా ఉండి ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలన్నారు. రైతులు వ్యవసాయదారులు పొలాలలో వ్యర్థాలను తగలబెట్టవద్దని కోరారు. దానివల్ల వాయు కాలుష్యం ఏర్పడుతుంది. అంతేకాకుండా రైతులు ప్రాణాలు కూడా కోల్పోతున్నారన్నారు. మనం ఇటీవల మండలంలోని పోలవరం గ్రామంలో ఒక రైతు కుటుంబం పొలంలో వ్యర్థాలు తగలబెడుతూ సజీవ దహనం అయిన ఘటన మన కళ్ళ ఎదుట ఇంకా కనిపిస్తూనే ఉందని గుర్తు చేశారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు మొక్కలను పెంచే మహోద్యమంలో ముందుండి ప్రజలను చైతన్యవంతులు చేసి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. నీటి సంరక్షణ పర్యావరణ పరిరక్షణ నా బాధ్యత అంటూ ప్రమాణ పత్రాన్ని చదివి ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో దర్శి ఏఎంసి చైర్మన్ దారం, డ్వామా పీడీ గంగవరపు జోసఫ్ కుమార్ డీఈఓ ఎంపీడీఓ, ఏపీవో, ఏఎంసి వైస్ చైర్మన్ మస్తాన్ రావు, క్లస్టర్లు, యూనిట్ ఢ బూత్ ఇంచార్జ్ లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ముండ్లమూరు మండలం నియోజకవర్గంలోని వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.




# దోర్నాలలో ప్రజాదర్బార్

## పాల్గొన్న గూడూరి ఎరిక్సన్‌బాబు

దోర్నాల (చైతన్యరథం): పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్సన్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దోర్నాల మండలంలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించగా, వాటిని స్వయంగా పరిశీలించిన ఎరిక్షన్ బాబు తక్షణమే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సంప్రదించి, కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వినతులపై కూడా వెంటనే చర్యలు తీసుకుని ప్రజలకు న్యాయం చేయాలని అధికారులను సూచించారు. ప్రతి వినతి పత్రాన్ని ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దోర్నాల మండల అధ్యక్షులు షేక్ మహబూబ్, వీఆర్వో అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

## సైకిల్ ర్యాలీలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు



రాజంపేట (చైతన్యరథం): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాజంపేట నియోజకవర్గంలోని సుండుపల్లి టౌన్ వీధుల్లో నిర్వహించిన సైకిల్ ర్యాలీలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు చప్పిడి మహేష్ నాయుడు, స్థానిక టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు రమేష్ నాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సైకిల్ తొక్కుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రకృతి సంపదను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని, కాలుష్య నియంత్రణలో భాగంగా సైకిళ్ల వినియోగాన్ని పెంచాలని సూచించారు. అలాగే విద్య, సాంకేతికత, పర్యావరణ పరిరక్షణ అంశాల్లో యువతను ముందుకు నడిపిస్తున్న నారా లోకేష్ ఆలోచనలు యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ చెట్లు నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ప్రకృతిని సంరక్షించడం వంటి చర్యలను అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పిచ్చి ప్రేలాపనలు ఆపకపోతే ద్వారకానాథ్‌కు దబిడి దిబిడే!

## తంబళ్లపల్లె తెలుగుతమ్ముళ్ల హెచ్చరిక



తంబళ్లపల్లె (చైతన్యరథం): నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే ద్వారకానాథ్ రెడ్డి టీడీపీ ప్రభుత్వం పైన మాట్లాడిన చేసి తప్పుడు ఆరోపణలు, పిచ్చి ప్రేలాపనలపై తంబళ్లపల్లె తెలుగుతమ్ముళ్ళు విరుచుకుపడ్డారు. తంబళ్ల పల్లె నియోజకవర్గం అభివద్ధి, మీరు చేసిన అక్రమాలు, దౌర్జన్యాలు, టీడీపీ నాయకులు కార్యకర్తలపై జరిపిన దాడులు పైన బహిరంగ చర్చ కి సిద్ధమా అని సవాలు విసిరారు. 2019 నుండి ద్వారాకానథ్‌రెడ్డి ఎమ్మెల్యేగా న్నపుడు మల్లయ్య కొండలో ఉన్న మూల విరాట్ విగ్రహం ఏమి అయింది చర్చ కి సిద్ధమా అని నిలదీశారు. ఎక్కడ నుండో తంబల్లపల్లె నియోజకవర్గం లోకి వచ్చి ఎమ్మెల్యేగా గెలిచాక ఇపుడు వందల ఎకరాల భూములు ఎక్కడ నుండి వచ్చాయి చర్చకు రావాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తల పైన పెట్టిన అక్రమ కేసులు సృష్టించిన గొడవలు తేల్చడానికి దమ్ముంటే రావాలన్నారు. ఇసుక అక్రమ మాఫియా గురించి మీరు ఇటాచిలు, టిప్పర్ లు పెట్టీ తంబళ్లపల్లె నియోజకవర్గం లో ఇసుక దోచుకొని ఇతర రాష్ట్రాలకు తరలించి సంపాదించిన అక్రమ సంపాదన పైన బహిరంగ చర్చకు సిద్ధమా అని నిలదీశారు. మా తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నపుడు మీరు ప్రశాంతంగా మీ పర్యటన, మీ పార్టీ కార్యక్రమాలు చేసారు కానీ అదే మీరు ఎమ్మెల్యేగా ఉన్నపుడు నుండి మా తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షం లో ఉన్నపుడు మీరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పైన ఎన్ని దాడులు చేయించారు ఎన్ని అక్రమ కేసులు పెట్టించారో చెప్పాలన్నారు. మీ దౌర్జన్యాలకు, మీ అక్రమాలకు, మీ బెదిరింపులకు కాలం చెల్లిపోయింది నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఇంకా టీడీపీ నాయకులు కార్యకర్తలు ఎవరు చూస్తూ ఊరుకోరు అని హెచ్చరించారు. అప్పటి ప్రతిపక్ష నాయకుడు ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రాజెక్ట్ సందర్శనకు వస్తే రాళ్ళ దాడి చేయించిన చిల్లర రాజకీయాలు చేసింది నివు ఈ రోజు రాజకీయ విలువలు గురించి మాట్లాడే అర్హత ఉందా ద్వారకానాథ్‌రెడ్డీ అని నిలదీశారు. సదుం సంగమేశ్వర స్వామి నదిలో అక్రమంగా ఇసుక కర్ణాటక కి తరలించిందెవరో తేలుద్దాం రావాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నపుడు పేదలకు అన్నా క్యాంటీన్ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ ఉంటే అడ్డుకుంది, అక్రమ కేసులు పెట్టింది నీవు కాదా ద్వారకానాథ్ రెడ్డి ఈ రోజు రాజకీయ విలువలు, అభివృద్ధి గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుందని ఎద్దేవా చేశారు. ద్వారకానాథ్ రెడ్డి మీ దౌర్జన్యాలకు,మీ అక్రమాలకు మీ అవినీతి కి కాలం చెల్లిపోయిందన్నారు. ఇంకా అలాగే చేయాలి అనుకుంటే ఇక్కడ చూస్తూ ఉండలేమని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బి కొత్తకోట మండల అధ్యక్షుడు నారాయణ స్వామి రెడ్డి, మొలకల చెరువు మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, పెద్దమండ్యం మండల అధ్యక్షుడు జి వెంకటరమణ, నియోజక వర్గం పోల్ మేనేజ్మెంట్ కుడుము శ్రీనివాసులు, బి కొత్తకోట టౌన్ అధ్యక్షుడు బంగారు వెంకటరమణ , తంబళ్లపల్లె మండల అధ్యక్షుడు రెడ్డెప్ప రెడ్డి, కురబలకోట మండల క్లస్టర్ రమణ, మండల అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పర్వీన్ తాజ్, మాజీ జడ్పీటీసీ ఈశ్వరప్ప, సర్పంచ్ నటరాజ్ నాయక్,రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, కురబల కోట యూనిట్ ఇంచార్జి లక్ష్మణ్,ఎ సెల్ రాష్ట్ర కార్యదర్శి తమక శ్రీనివాసులు, మొలకల చెరువు క్లస్టర్ చెన్న కృష్ణ, మొలకల చెరువు ప్రధాన కార్యదర్శి వెంకట స్వామి, మాజీ ఉప సర్పంచ్ షమీముల్ల, బి కొత్తకోట టౌన్ తెలుగు యువత అధ్యక్షుడు రాజా, ప్రకాష్,రియాజ్ అలీఖాన్ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

## మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ (చైతన్యరథం): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో కలెక్టర్‌తో కలిసి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. చెట్లు మనకు ప్రాణవాయువును అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల విద్యార్థులు చిన్న వయసు నుంచే ప్రకృతి పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామస్థులు పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించారు…" ఒక్క మొక్క వందల మందికి జీవం… ప్రతి ఇంట ఒక మొక్క, ప్రతి మనిషికి పర్యావరణ బాధ్యత" అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా జరిగింది.





ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుమేరకు ధర్మవరం నియోజికవర్గం, బత్తలపల్లి కేంద్రం ఇందిరమ్మ కాలనీలో నిర్వహించిన సైకిల్ అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

## సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్ కుమార్

సంతనూతలపాడు (చైతన్యరథం): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం, మొక్కలు నాటుదాం, నీటిని సంరక్షిద్దాం, ప్రకృతిని కాపాడుదామని ఎమ్మెల్యే విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మద్దిపాడు మండలం మల్లవరం గ్రామం గుండ్లకమ్మ ప్రాజెక్టు దగ్గర హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్, శ్రీవారి వనం వారి ఆధ్వర్యంలో గుండ్లకమ్మా నది ఇరువైపులా సంతనూతలపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు విజయ్ కుమార్, బీజేపీ నాయకులు మాజీ కలెక్టర్ దాసరి శ్రీనివాసరావు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి మనకు అమూల్యమైన వరం. స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, పచ్చని చెట్లు మన జీవితానికి ఆధారమన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన వాతావరణాన్ని అందించాలంటే మనం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి అని ఎమ్మెల్యే విజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు,మండల నాయకులు, గ్రామ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దర్శి నియోజకవర్గంలో సైకిల్‌పై పర్యటిస్తున్న టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి





# శ్రద్ధగా ఓటరు జాబితా పర్యవేక్షణ

## టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పిలుపు

మార్కాపురం (చైతన్యరథం): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అత్యంత కీలకంగా వ్యవహరించాలని మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్ లో మార్కాపురం నియోజకవర్గంలోని తెలుగుదేశం కీలక నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి దిశానిర్దేశం చేస్తూ ఈనెల 15వ తేదీ నుండి జరిగే కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జులు, యూనిట్ ఇన్చార్జిలు, బూత్ ఇన్చార్జిలు, పార్టీ నియమించిన బీఎల్ఏలు అత్యంత చురుకుగా వ్యవహరించాలని అన్నారు. బీఎల్వోలు ఓట్ల వెరిఫికేషన్ చేసేటప్పుడు ఓటర్ లిస్ట్ తమ దగ్గర ఉంచుకొని జాగ్రత్తగా పూర్తి చేయాలని అన్నారు.

ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ఇన్చార్జీలను నియమించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ లు, యూనిట్ ఇంచార్జిలు, అత్యంత కీలక నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.









# సముద్ర తీరంలో వనరులు దెబ్బతినకుండా చర్యలు

**పర్యావరణ పరిరక్షణ, గ్లోబల్ వార్మింగ్‌పై ట్రోంసోలో శాస్త్రవేత్తలతో ఎంపీల బృందం చర్చలు**

**ఆర్కిటిక్ సవాళ్లపై 'పోలార్ ఇన్‌స్టిట్యూట్'తో ఎంపీలు శ్రీభరత్, శబరి భేటీ**

**విపత్తుల నియంత్రణ చర్యలపై 'కేశాట్' శాటిలైట్ నెట్‌వర్క్ సందర్శన**

**ట్రోంసో (నార్వే):** ఇండియా-నార్వే నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్ టూర్‌లో భాగంగా నాలుగో రోజు నార్వేలోని ట్రోంసో నగరంలో భారత పార్లమెంట్ సభ్యుల బృందం పర్యటించింది. 'ఫ్రామ్‌సెంటెరెట్' వేదికగా నార్వేజియన్ పోలార్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులతో పాటు ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ నలన్ కోచ్‌తో సుదీర్ఘంగా చర్చించారు. ధ్రువ ప్రాంతాల్లో జరుగుతున్న తాజా పరిశోధనలు, ఆర్కిటిక్ పరిరక్షణకు అంతర్జాతీయంగా అవలంబిస్తున్న పాలనా నియమాలను ప్రతినిధులు వివరించారు. అనంతరం ఆర్కిటిక్ పర్యావరణ వ్యవస్థలు ఎదుర్కొంటున్న వాతావరణ సవాళ్లను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఎంపీల బృందం 'పోలారియా' కేంద్రాన్ని సందర్శించింది. ఆర్కిటిక్ ప్రాంతంలో పర్యావరణ సుస్థిరత, వివిధ దేశాల మధ్య ప్రాంతీయ సహకారంపై 'ఆర్కిటిక్ కౌన్సిల్' ప్రతినిధులతో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. గ్లోబల్ వార్మింగ్ ప్రభావం భారతదేశంపై ఎలా ఉంటుందో విశ్లేషించారు. 'కిస్టెన్స్ హస్'లో నార్వేజియన్ సీఫుడ్ కౌన్సిల్‌తో ఎంపీలు సమావేశమయ్యారు. సముద్ర వనరులను దెబ్బతీయకుండా సుస్థిర పద్ధతుల్లో మత్స్య పరిశ్రమను ఎలా లాభసాటిగా మార్చుకోవచ్చు, గ్లోబల్ సీఫుడ్ మార్కెట్లలో సరికొత్త ఆవిష్కరణల పాత్రపై లోతైన అవగాహన సాధించారు. ట్రోంసోకు చెందిన స్థానిక భాగస్వాములు మాజా సాండ్విక్ లాకర్ట్, సెబాస్టియన్ హాన్సెన్ హెన్రిక్సెన్, స్టైన్ విల్లమ్ అడ్రియన్, ఎలెన్ ఓసెత్, బల్ప్రీత్ సింగ్ అహ్లువాలియాలతో డిన్నర్ సందర్భంగా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నార్వే సామాజిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులు, ఇరు దేశాల మధ్య పరస్పర సహకారంపై అర్థవంతమైన చర్చలు జరిగాయి.




ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన శాటిలైట్ గ్రౌండ్ స్టేషన్ నెట్‌వర్క్‌ల్లో ఒకటైన కేశాట్ (KSAT-Kongsberg Satellite Services)లో నిర్వహించిన ప్రత్యేక సెషన్‌లో పాల్గొన్నారు. అంతరిక్ష ఆధారిత సాంకేతికతలు గ్లోబల్ కనెక్టివిటీని ఎలా మెరుగుపరుస్తాయో ఈ సందర్భంగా వారు క్షుణ్ణంగా పరిశీలించారు. స్పేస్-బేస్డ్ టెక్నాలజీ (అంతరిక్ష ఆధారిత సాంకేతికత) ద్వారా ఆధునిక కమ్యూనికేషన్ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను చూశారు. శాటిలైట్ సాంకేతికతను ఉపయోగించి గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు, పర్యావరణాన్ని నిరంతరం ఎలా పర్యవేక్షించవచ్చో తెలుసుకున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, తుఫానులు, వరదలు సంభవించినప్పుడు శాటిలైట్ డేటా ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని ఎలా తగ్గించవచ్చో, తక్షణ సహాయక చర్యలు ఎలా చేపట్టవచ్చో కేశాట్ ప్రతినిధులు ఎంపీలకు వివరించారు.

అంతర్జాతీయ పర్యావరణ సవాళ్లను ఎదుర్కోవడంలో, శాస్త్ర సాంకేతిక రంగాలలో సరికొత్త విధానాలను భారతదేశంలో అమలు చేయడంలో నార్వే పర్యటన ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీలు శ్రీభరత్ మతుకుమిల్లి, బైరెడ్డి శబరి ఆశాభావం వ్యక్తం చేశారు.




# 'తానా' ఆధ్వర్యంలో చలివేంద్రం

**మజ్జిగ, పళ్ల రసాల పంపిణీ**

**విశాఖపట్నం (చైతన్యరథం):** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా), తానా ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్ కృష్ణప్రసాద్ సోంపల్లి సహకారంతో విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం 16వ వార్డులో విశాఖపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొల్లి శోభ ఆధ్వర్యంలో కృష్ణా కళాశాల రహదారిలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. విశాఖ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాపరుద్ర మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించి అందరికీ మజ్జిగ, పళ్ల రసాలు పంపిణీ చేశారు. నిర్వాహకులను 'తానా' అధ్యక్షుడు నరేన్ కొడాలి, తానా ఫౌండేషన్ చైర్మన్ ప్రసాద్ నల్లూరి, ఫౌండేషన్ ట్రస్టీ శ్రీనివాస్ ఎండూరి అభినందించారు. కార్యక్రమంలో మాకినేని శ్రీనివాస్, మారుతి, ముగడ వాసు, ధనరెడ్డి బుగత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.






# న్యూజిలాండ్‌లో పసుపు పండుగ

**ఎన్నారై టీడీపీ అధ్యక్షురాలు మమత టీమ్ ఆధ్వర్యంలో ఘనంగా మహానాడు**

**ప్రవాసాంధ్రుల పోరాట స్ఫూర్తిని కొనియాడిన విజయనగరం ఎంపీ అప్పలనాయుడు**

**న్యూజిలాండ్:** తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పోరాటం ఫలితంగానే ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన సైకో పాలన అంతమైందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. ఎన్నారై తెలుగుదేశం న్యూజిలాండ్ టీమ్, ఎన్నారై టీడీపీ అధ్యక్షురాలు మమత గారపాటి ఆధ్వర్యంలో శుక్రవారం మహానాడు వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ కలిశెట్టి మాట్లాడుతూ... "తెలుగు జాతిని ఐక్యం చేసిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను. గతంలో జరిగిన అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు, ముఖ్యంగా ఎన్నారైలు చూపిన సంఘీభావం, తెగువ మరువలేనివి. మీరు చేసిన పోరాటం పార్టీకి ఎంతో బలాన్ని ఇచ్చింది. రాష్ట్ర ప్రజల మనోధైర్యం, కార్యకర్తల పోరాట స్ఫూర్తితో గొడ్డలి పార్టీ ప్రభుత్వాన్ని అంతం చేశాం. "తెలుగు నేలపై ఆవిర్భవించిన పసుపు జెండా ఖండాంతరాలు దాటి ప్రపంచం చివరన ఉన్న న్యూజిలాండ్‌లో ఎగరవేయడం చారిత్రాత్మక ఘట్టం. విజనరీ నాయకుడైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువ నేత మంత్రి నారా లోకేష్ సమర్ధ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందజేశాం. ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సహకారంతో ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి బలమైన పునాదులు వేస్తోంది.' అన్నారు. న్యూజిలాండ్ ఎంపీ హెలెన్ వైట్, ప్రస్తుత ఎంపీ కార్లోస్ చియుంగ్, మాజీ మంత్రి మైఖేల్ వుడ్ తదితరులు సీఎం చంద్రబాబు నాయకత్వాన్ని ప్రస్తావించడం తనకెంతో ఆనందం ఇచ్చిందని ఎంపీ కలిశెట్టి పేర్కొన్నారు.

# న్యూయార్క్‌లో రేపు స్ప్రింగ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా

**అల్బానీ:** అమెరికాలోని ప్రవాస భారతీయులను ఒకే తాటిపైకి తీసుకొస్తూ న్యూయార్క్ రాష్ట్ర రాజధాని అల్బానీలో 'స్ప్రింగ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా' వేడుకలకు సర్వం సిద్ధమైంది. భారత సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని అమెరికా వేదికపై ఘనంగా చాటిచెప్పేలా ఈ భారీ ఈవెంట్‌ను ప్లాన్ చేశారు.

తేదీ: జూన్ 7, ఆదివారం

సమయం: మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు

వేదిక: ఎంపైర్ స్టేట్ ప్లాజా కన్వెన్షన్ సెంటర్ (Empire State Plaza Convention Center), అల్బానీ, న్యూయార్క్

సాంస్కృతిక ప్రదర్శనలు...

ఈ ఉత్సవంలో పలు రకాల ప్రాంతీయ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇక్కడికి వచ్చే సందర్శకులకు సంపూర్ణ భారతీయ అనుభూతి అందించేలా మరికొన్ని విభాగాలను కూడా యాడ్ చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నోరూరించే సంప్రదాయ వంటకాలతో కూడిన ప్రత్యేక ఫుడ్ స్టాళ్లను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. భారతీయ దుస్తులు, ఆభరణాలు, హస్తకళలు, సంప్రదాయ వస్తువులతో కూడిన వైవిధ్యభరితమైన షాపింగ్ స్టాళ్లు సందర్శకులను ఆకట్టుకోనున్నాయి.

ఈ ఉత్సవాన్ని గ్రాండ్‌గా సక్సెస్ చేసేందుకు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎలంగోవన్ రామన్ నేతృత్వంలోని టీమ్ మెంబర్స్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేశారు.

# ఆదిలోనే హంసపాదు

## బాలారిష్టాల్లోనే డీకే పాలనా ప్రస్థానం, మంత్రి పదవికి మిత్రుడు రామలింగారెడ్డి రాజీనామా



కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టి వారం కూడా కాకముందే సీనియర్ మంత్రి రామలింగా రెడ్డి రాజీనామా చేయడం రాష్ట్రంలో కలకలం రేపుతోంది. రామలింగా రెడ్డి రాజీనామాపై సీఎం తొలిసారిగా స్పందించారు. తాము ఈ సమస్యను పరిష్కరించుకుంటామని చెప్పారు. 'ఆయన నాకు మంచి ఫ్రెండ్. మేము ఈ సమస్యను పరిష్కరించుకుంటాము' అని విలేకరులతో సీఎం అన్నారు. తనకు బెంగళూరు డెవలప్‌మెంట్ శాఖ దక్కకపోవడంతో రామలింగా రెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ శాఖే కేటాయిస్తానని తనకు సీఎం డీకే రెండు సార్లు చెప్పారని అన్నారు. విలేకరుల ముందే ఆయన రాజీనామా లేఖపై సంతకం చేశారు. లేఖను తాను స్వయంగా ఇవ్వనని కూడా చెప్పారు. మరో వ్యక్తితో రాజీనామా లేఖను పంపిస్తానని అన్నారు. అయితే, సీఎంపై తనకు ఎలాంటి అసంతృప్తి లేదని కూడా స్పష్టం చేశారు. సిద్దరామయ్య ప్రభుత్వంలో బెంగళూరు డెవలప్‌మెంట్ శాఖ బాధ్యతలను డీకే శివకుమార్ నిర్వహించేవారు. సీఎం అయ్యాక ఈ శాఖను ఆయన వదులుకున్నారు. మరో కీలక నేత కృష్ణ బైర గౌడకు బెంగళూరు డెవలప్‌మెంట్ శాఖను కేటాయించారు. ఈ పరిణామం సీనియర్ నేత రామలింగా రెడ్డికి తీవ్ర అసంతృప్తిని కలిగించింది. ఎప్పటి నుంచో ఈ శాఖను కోరుకుంటున్న ఆయన చివరకు శుక్రవారం మంత్రి పదవికి రాజీనామా చేశారు.

# లోక్‌సభ వైపు దీదీ చూపు

తృణమూల్ కాంగ్రెస్‌కు లోక్‌సభలోనూ అసమ్మతి పెరుగుతున్న సంకేతాలు వెలువడుతుండటంపై ఆ పార్టీ సుప్రీం మమతా బెనర్జీ పార్లమెంటు దిగువసభకు పోటీ చేసే ఆలోచనలో ఉన్నారని తెలుస్తోంది. ఇటీవల జరిగిన పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలో టీఎంసీ ఓటమి పాలై అధికారం కోల్పోయింది. 80 సీట్లు గెలుచుకుని ప్రతిపక్షానికే పరిమితమైంది. ఈ నేపథ్యంలో లోక్‌సభకు పోటీ చేసే ఆలోచనలో మమతాబెనర్జీ ఉన్నట్టు పార్టీ వర్గాల సమాచారం. బహరాంపూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి మమతా బెనర్జీ పోటీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ నియోజకవర్గానికి ప్రస్తుతం టీఎంసీ ఎంపీ యూసఫ్ పఠాన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయనను రాజీనామా చేసి మమత పోటీకి మార్గం సుగమం చేయాలని కోరనున్నట్టు తెలుస్తోంది. 2011 ప్రపంచ కప్ విన్నింగ్ స్క్వాడ్‌లో ఒకరైన భారత మాజీ క్రికెటర్ పఠాన్ 2024 పార్లమెంటు ఎన్నికల్లో బహరాంపూర్ నుంచి గెలిచారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత అధీర్ రంజన్ చౌదరిపై 85,000 ఓట్ల ఆధిక్యంతో పఠాన్ గెలుపొందారు. మమతా బెనర్జీ గతంలోనూ లోక్‌సభ సభ్యురాలిగా ఉన్నారు. కోల్‌కతా సౌత్ నుంచి ఆరుసార్లు ఎంపీగా గెలిచారు. అయితే తొలి ఎన్నిక మాత్రం జాదవ్‌పూర్ నియోజకవర్గం నుంచి సీపీఐ అగ్రనేత సోమనాథ్ ఛటర్జీపై పోటీ చేసి గెలుపొందారు. 2011లో బెంగాల్



అసెంబ్లీకి వెళ్లేంతవరకూ లోక్‌సభ సభ్యురాలిగానే ఆమె ఉన్నారు. ఆ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఘనవిజయం సాధించింది. కాగా, ఇటీవల కాలంలో పార్టీ నాయకత్వం పనితీరుపై లోక్‌సభ టీఎంసీ సీనియర్ ఎంపీల్లో అసమ్మతి తలెత్తెది. కొందరు పార్టీ వీడే ఆలోచనలో ఉన్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. మమతకు సన్నిహితురాలిగా పేరున్న పార్టీ సీనియర్ ఎంపీ కాకోలి ఘోష్ దస్తిదార్ బహిరంగంగానే ఇటీవల తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. బరాసత్ నుంచి నాలుగు సార్లు ఎంపీగా ఉన్న ఆమె లోక్‌సభలో తనపై అనుచితంగా మాట్లాడుతున్నారంటూ టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీపై లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు ఫిర్యాదు చేశారు. పార్టీ పనితీరును ప్రశ్నించిన సీనియర్ ఎంపీల్లో సుఖేందు శేఖర్ రాయ్, శాంతను సేన్ సైతం ఉన్నారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో తిరుగుబాటును టీఎంసీ ఎదుర్కొంటోంది. టీఎంసీ బహిష్కృత నేత రితబ్రత బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా పార్టీకి చెందిన 57 మంది ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. స్పీకర్ రతీంద్ర బోస్ కూడా ఈ నియామకాన్ని గుర్తించారు. ఈ క్రమంలో ముందుగా లోక్‌సభలో అసమ్మతికి కళ్లెం వేసేందుకు దిగువ సభలో అడుగుపెట్టాలనే ఆలోచనలో మమతా బెనర్జీ ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# కేజేపీ నిరసన పిల్‌పై విచారణకు నో

## సేవ్ ఇండియా ఫౌండేషన్‌కు తేల్చి చెప్పిన ఢిల్లీ కోర్టు

దేశరాజధాని న్యూఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ తలపెట్టిన నిరసన కార్యక్రమం అదుపు తప్పకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలంటూ ఢిల్లీ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. అయితే, ఈ పిటిషన్‌పై తక్షణ విచారణకు హైకోర్టు నిరాకరించింది. జూన్ 6న కాక్రోచ్ జనతా పార్టీ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సేవ్ ఇండియా ఫౌండేషన్ అనే సంస్థ ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలు చేసింది. కాక్రోచ్ జనతా పార్టీ నిరసన కార్యక్రమం నేపథ్యంలో పబ్లిక్ ఆర్డర్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఢిల్లీ పోలీసులు




చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలంటూ సేవ్ ఇండియా ఫౌండేషన్ ఈ పిల్‌ను దాఖలు చేసింది. ఈ మేరకు పోలీసులకు మార్గదర్శకాలు జారీ చేయాలని ఢిల్లీ హైకోర్టును అభ్యర్థించింది. ప్రజల మౌలికవసతుల నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదని చెప్పింది. నిరసన చేపట్టేందుకు కాక్రోచ్ జనతా పార్టీ భారీ ఎత్తున ఆన్‌లైన్‌లో ప్రచారం చేస్తోందని సంస్థ తన పిటిషన్‌లో పేర్కొంది. భారీ ఎత్తున యువత పాల్గొనేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పింది. ఈ దిశగా ఆన్‌లైన్‌లో ప్రచారంలో ఉన్న కంటెంట్‌లో రెచ్చగొట్టే సందేశాలు ఉన్నాయని తెలిపింది. భద్రతా దళాలను అడ్డుకోవడం వంటి సందేశాలు కూడా ఉన్నాయని వెల్లడించింది. భారీ ఎత్తున జనాలు హాజరు కావాలని కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యంలో పరిస్థితి అదుపు తప్పకుండా ముందస్తు చర్యలు అవసరమని పేర్కొంది. ట్రాఫిక్, ప్రజాభద్రతకు ఇబ్బంది లేకుండా ఢిల్లీలో ఏర్పాట్లు చేయాలని చెప్పింది. ఈ విషయాలపై ఇప్పటికే ఢిల్లీ పోలీసు కమిషనర్‌ను సంప్రదించినా ఇప్పటివరకూ ఎలాంటి మార్గదర్శకాలు జారీ కాలేదని తెలిపింది. చివరకు కోర్టును ఆశ్రయించినట్టు తెలిపింది. అయితే, న్యాయస్థానం మాత్రం ఈ పిటిషన్‌పై తక్షణ విచారణకు నిరాకరించింది.


# రాజ్యసభ సీట్లపై జేఎంఎం, కాంగ్రెస్ సిగపట్లు!

జార్ఖండ్‌లోని 'ఇండియా' కూటమిలో తాజాగా విభేదాలు పొడచూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. జార్ఖండ్ నుంచి రెండు రాజ్యసభ సీట్లకు ఎన్నికల జరగాల్సి ఉండగా, రాష్ట్రంలో జేఎంఎం భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ ఒక సీటును ఆశిస్తోంది. పార్టీ నుంచి పోటీ చేసే రాజ్యసభ అభ్యర్థి పేరును ఇప్పటికే ప్రకటించింది. అయితే రెండు రాజ్యసభ స్థానాల్లోనూ పోటీ చేసేందుకు జేఎంఎం తాజాగా నిర్ణయం తీసుకోవడం ఆసక్తికరంగా మారింది. దీనిపై భాగస్వామ్య పార్టీల మధ్య విభేదాలు తలెత్తే అవకాశాలున్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. రాజ్యసభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై జేఎంఎం శాసనసభ్యులు, మంత్రులు, ఎంపీలు, సీనియర్ నేతలు శు



క్రవారం సమావేశమయ్యారు. ఖాళీగా ఉన్న రెండు సీట్లలోనూ జేఎంఎం పోటీ చేయాలని సమావేశంలో ఏకాభిప్రాయం కుదిరినట్టు సమావేశానంతరం రాష్ట్ర మంత్రి యోగేంద్ర మహతో మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. అయితే దీనిపై తుది నిర్ణయం తీసుకునే బాధ్యత ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కే అప్పగించినట్టు వివరించారు. ఈ క్రమంలో రాజ్యసభకు పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేసేందుకు భాగస్వామ్య పార్టీలతో సోరెన్ సంప్రదింపులు చేపట్టనున్నట్టు తెలుస్తోంది. కాగా, కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే జార్ఖండ్ నుంచి పోటీ చేసే అభ్యర్థితో పాటు ఏడు రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. భాగస్వామ్య పక్షంగా తమకు ఒక సీటును జేఎంఎం కేటాయిస్తుందనే అభిప్రాయంతో కాంగ్రెస్ ఉంది. రెండు సీట్లూ తమకే కావాలని జేఎంఎం పట్టుపడితే దీనిపై రాబోయే రోజుల్లో ఇరుపార్టీల మధ్య ముమ్మరంగా సంప్రదింపులు జరిగే అవకాశాలు ఉన్నాయి. వివిధ రాష్ట్రాల్లోని 24 రాజ్యసభ స్థానాలకు జూన్ 18న ఎన్నికలు జరుగనున్నాయి. జార్ఖండ్‌లో చాలాకాలంగా జేఎంఎం, కాంగ్రెస్ భాగస్వాములుగా ఉన్నాయి. సోరెన్ నాయకత్వంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో కూడా ఉంది. రెండు రాజ్యసభ సీట్లు ఆశించడం ద్వారా జార్ఖండ్ రాకీయాల్లో తమ బలం చెక్కుచెదరకూడదని జేఎంఎం భావిస్తుండగా కూటమి ప్రభుత్వంలో తాము రాజకీయ ప్రాధాన్యం కోల్పోరాదని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది.

# సుప్రీం కోర్టు తీరుపై మద్రాస్ హైకోర్టు తీవ్ర అసంతృప్తి



ఎన్నికల ఫలితాలకు సంబంధించి కింది కోర్టు తీర్పుపై అప్పీల్ సుప్రీం కోర్టులో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంపై మద్రాస్ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇలాంటి కేసుల్లో ఆరు నెలల్లోపు తీర్పు ఇవ్వాలని సుప్రీం స్వయంగా గతంలో జారీ చేసిన మార్గదర్శకాలను ప్రస్తావించింది. వీటికి సుప్రీం కోర్టు కట్టుబడకపోతే దేశంలో నిరంకుశత్వానికి దారితీస్తుందని అసంతృప్తి వ్యక్తం చేసింది. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే నేత ఇన్బదురై గెలుపును సవాలు చేస్తూ డీఎంకే నేత అప్పావు దాఖలు చేసిన కేసులో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. 2016 నాటి ఎన్నికల్లో ఇన్బదురై రాధాపురం నియోజకవర్గం నుంచి స్వల్ప మెజారిటీతో గెలిచారు. అయితే, ఈ ఫలితాన్ని అప్పావు మద్రాస్ హైకోర్టులో సవాలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ పేపర్ల కౌంటింగ్‌లో అవకతవకలు జరిగాయని అన్నారు. మిడిల్ స్కూల్ హెడ్‌మాస్టర్లు అటెస్ట్ చేసిన పోస్టల్ బ్యాలెట్లు చెల్లవని అనడం నిబంధనలకు విరుద్ధమని వాదించారు. అప్పావు వాదనతో హైకోర్టు ఏకీభవించింది. మిడిల్ స్కూల్ హెడ్‌మాస్టర్లు కూడా గెజిటెడ్ ఆఫీసర్లేనని పేర్కొంది. వారు అటెస్ట్ చేసిన పోస్టల్ బ్యాలెట్‌లు చెల్లుతాయని పేర్కొంది. ఈ క్రమంలో న్యాయస్థానం ఆధ్వర్యంలోనే మూడు ఈవీఎంలలోని ఓట్ల రీకౌంటింగ్ జరిగింది. అయితే, ఓట్ల కౌంటింగ్ ఫలితం వెలువడక ముందే ఇన్బదురై సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టు తీర్పుపై స్టే విధించింది. అప్పీలుపై తుది తీర్పు మాత్రం దాదాపు ఆరేళ్ల పాటు పెండింగ్‌లో ఉండిపోయింది. ఇక మే 21న అప్పీలుపై విచారించిన సుప్రీం కోర్టు హైకోర్టు తీర్పుపై స్టేను ఎత్తేసింది. అయితే, 2016 నాటి అసెంబ్లీ రద్దైపోయిన విషయాన్ని ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో కేసులోని న్యాయపరమైన వివాదంపై తీర్పు వెలువరించడం అనవసరమని చెబుతూ అప్పీలును క్లోజ్ చేసింది. ఈ నేపథ్యంలో మద్రాస్ హైకోర్టు సుప్రీం కోర్టు తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎన్నికల వివాదాలను ఆరు నెలల్లోగా పరిష్కరించాలని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాలను ప్రస్తావించింది. ప్రజాప్రతినిధుల చట్టంలోని స్ఫూర్తికి కట్టుబడి ఉండకపోతే ప్రజాస్వామ్యం బలహీనమవుతుందని వ్యాఖ్యానించింది. అందరికీ ఓటు హక్కు ఉండాలన్న స్ఫూర్తి దెబ్బతింటుందని పేర్కొంది. రాజ్యాంగానికి రక్షణగా ఉండే న్యాయవ్యవస్థ ఇతర ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశంగా భారత్‌కు ఉన్న గౌరవాన్ని కాపాడాలని పేర్కొంది. ఇన్బదురై ఎన్నికను రద్దు చేస్తూ అప్పావును విజేతగా ప్రకటించింది. ఈ మేరకు అసెంబ్లీ రికార్డుల్లో ప్రతి చోటా మార్పులు చేయాలని అసెంబ్లీ సెక్రటరీని ఆదేశించింది.

# ఖమేనీపై దాడి జరిగినప్పుడు నేనక్కడే ఉన్నా

## ఇరాన్ విదేశాంగ మంత్రి సంచలన వ్యాఖ్యలు



అమెరికా–ఇజ్రాయెల్ ఫిబ్రవరి 28న ఇరాన్‌పై జరిపిన దాడిలో నాటి సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే ఆ దాడి జరిగిన సమయంలో తాను సుప్రీం లీడర్ కార్యాలయంలోనే ఉన్నానని ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ సంచలన విషయాన్ని వెల్లడించారు. లెబనాన్ కేంద్రంగా పనిచేసే ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. దాడి అనంతరం ఖమేనీ ఆరోగ్య పరిస్థితి ఏంటనే విషయం తెలియక తాను తీవ్ర ఆందోళన చెందా నని పేర్కొన్నారు. ఆనాటి భయానక పరిస్థితులను అబ్బాస్ అరాగ్చీ ఈ విధంగా గుర్తు చేసుకున్నారు.

"జెనీవాలో కీలక దౌత్య చర్చలు ముగించుకుని వచ్చా. ఆ వెంటనే నివేదిక ఇవ్వడానికి మరుసటి ఉదయం ఖమేనీ కార్యాలయానికి వెళ్లా. నేను ఆ భవనంలో ఉండగానే దాడి జరిగింది. మేము కూర్చున్న విభాగం కూడా దెబ్బతింది" అని చెప్పారు. "శిథిలాల నుంచి బయటకు వస్తున్నప్పుడు నా ఆలోచనంతా సుప్రీం లీడర్‌పైనే ఉంది. నా గురించి నేను పట్టించుకోలేదు. ఆయన ఆరోగ్య పరిస్థితి ఏంటనే విషయం తెలియక రెండు రోజుల పాటు తీవ్ర ఆందోళనచెందా" అని అరాగ్చీ వివరించారు.

అమెరికా, ఇజ్రాయెల్ నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో, సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లాలని అంతకుముందే సుప్రీం లీడర్‌కు సూచించినప్పటికీ ఆయన దాన్ని నిరాకరించారని అరాగ్చీ పేర్కొన్నారు. ఇరాన్ పౌరులందరికీ రక్షణ కల్పించే వరకు తాను ఎక్కడికీ వెళ్లనని ఖమేనీ స్పష్టం చేశారని, తన ప్రజలకు ఏది జరిగితే.. తనకూ అదే జరుగుతుందని ఆయన చెప్పినట్లు వెల్లడించారు. ఇరాన్‌పై దాడులకు అమెరికా సైనిక స్థావరాలను ఉపయోగిస్తే ప్రతికార చర్యలు తప్పవని తాము గల్ఫ్ దేశాలను ముందుగానే హెచ్చరించామని అరాగ్చీ వెల్లడించారు. పొరుగు దేశాల్లో ఒకవేళ అమెరికా స్థావరాలు లేకుంటే, వాటిపై ప్రతికార దాడులు ఉండేవి కావన్నారు. తమ భూభాగాన్ని ఈ విధంగా వినియోగించడాన్ని ఆయా దేశాల ప్రభుత్వాలు వ్యతిరేకించినప్ప టికీ.. వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా అమెరికా ముందుకు వెళ్లిందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# మార్షల్ ఆర్ట్స్ ఫీట్లు చేస్తూ..

# బాలుడిపై రోబో దాడి



బీజింగ్: సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతున్న వేళ రోబోల భద్రతపై సరికొత్త చర్చకు దారితీసే ఘోర ప్రమాదం ఒకటి చైనాలో వెలుగుచూసింది. హ్యూమనాయిడ్ రోబోల ప్రదర్శనను ఆసక్తిగా తిలకిస్తున్న ఒక చిన్నారిపై రోబో దాడి చేసింది. మార్షల్ ఆర్ట్స్ విన్యాసాలు చేస్తూ.. ఊహించని విధంగా సదరు బాలుడి కడుపులో బలంగా తన్నడంతో ఆ బాలుడు తీవ్ర నొప్పితో విలవిల్లాడాడు. చైనాలోని పింజియాంగ్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

స్థానిక మీడియా కథనాల ప్రకారం... చైనాలోని పింజియాంగ్‌లో గల 'ఉర్మికి బొటానికల్ గార్డెన్'లో ప్రత్యేకంగా హ్యూమనాయిడ్ రోబోల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ఆధునిక రోబోల విన్యాసాలను చూడ్డానికి నగర పౌరులతో పాటు పెద్ద ఎత్తున చిన్నారులు తరలివచ్చారు. అక్కడ ఉన్న ఒక రోబో.. వీక్షకులను ఆకట్టుకునేందుకు విభిన్నమైన మార్షల్ ఆర్ట్స్ విన్యాసాలను ప్రదర్శిస్తోంది. ఆ రోబో చేస్తున్న ఫీట్లను చూసేందుకు చిన్నారులంతా ఉత్సాహంగా దాని చుట్టూ చేరారు. ఈ క్రమంలో రోబోలోని సెన్సార్లు సరిగ్గా పనిచేయలేదో ఏమో కానీ అకస్మాత్తుగా అక్కడ నిలబడి ఉన్న ఒక బాలుడి కడుపుపై తన కాలుతో బలంగా తన్నింది. రోబో ఇచ్చిన షాక్‌తో ఆ బాలుడు నొప్పితో కుప్పకూలిపోయాడు. అక్కడి అధికారులు, సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. బాలుడికి అక్కడికక్కడే ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి సురక్షితంగా, నిలకడగానే ఉందని స్థానిక అధికారులు, మీడియా సంస్థల ప్రతినిధులు వెల్లడించారు

ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారడంతో డిజిటల్ లోకంలో సరికొత్త చర్చ మొదలైంది. భవిష్యత్తులో మానవ జీవనంలో రోబోల వినియోగం పెరిగితే...వాటివల్ల తలెత్తే ఇటువంటి శారీరక, భద్రతాపరమైన ముప్పులను ఎలా అరికడతారంటూ నెటిజన్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# గల్ఫ్ దేశాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణుల దాడి

## ఒమన్ ఆయిల్ టెర్మినల్‌లో భారీ పేలుడు

గల్ఫ్ దేశాలపై ఇరాన్ యుద్ధ విమానాలు, క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతోంది. ఈ ఉద్రిక్తతల క్రమంలో ఒమన్‌లోని 'మినా అల్ ఫహల్' ఆయిల్ టెర్మినల్‌లో భారీ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి పెద్ద ఎత్తున అగ్నికీలలు చెలరేగడంతో అప్రమత్తమైన అధికారులు ఫైరింజన్ల సహాయంతో మంటలను అదుపు చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇరాన్ డ్రోన్ దాడి కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు.

**టెర్మినల్‌లో నిలిచిపోయిన చమురు లోడింగ్**

ఈ దాడి నేపథ్యంలో ఆయిల్ టెర్మినల్‌లో చమురు లోడింగ్ ప్రక్రియను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. చమురు కోసం వచ్చిన పలు సూపర్ ట్యాంకర్లు అక్కడే చిక్కుకుపోయాయి. మళ్లీ చమురు కార్యకలాపాలు పునఃప్రారంభమయ్యే వరకు అవి అక్కడే వేచి ఉండక తప్పని పరిస్థితి నెలకొంది. మరోవైపు ఒమన్ సముద్రంలో ఉన్న అమెరికా సైనిక నౌకను లక్ష్యంగా చేసుకుని తమ నౌకాదళం దాడి చేసిందని ఇరాన్ ప్రభుత్వ మీడియా ప్రకటించింది. అమెరికా నౌక తమ దేశ జలాల్లోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తుండగా దానిపై దాడి చేసినట్లు ఇరాన్ వెల్లడించింది. అయితే ఇరాన్ చేసిన ఈ ప్రకటనను అమెరికా సెంట్రల్ కమాండ్ తీవ్రంగా ఖండించింది. ఒమన్ సముద్ర జలాల్లోని అమెరికా సైనిక ఆస్తులన్నీ సురక్షితంగా ఉన్నాయని... తమ ఏ నౌకపైనా ఎలాంటి దాడి జరగలేదని స్పష్టం చేసింది.

ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణుల వల్లే కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయం తీవ్రంగా దెబ్బతిందని ఆ దేశ అధికారులు వెల్లడించారు. దీనిపై ఇరాన్ సైనిక విభాగం 'ఐఆర్జీసీ' స్పందిస్తూ విచిత్రమైన వాదనను తెరపైకి తెచ్చింది. విమానాశ్రయ టెర్మినల్‌లో జరిగిన నష్టానికి తాము బాధ్యులం కాదని ఐఆర్జీసీ పేర్కొంది. అమెరికా తయారుచేసిన 'పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థ'లో తలెత్తిన సాంకేతిక లోపం వల్లే ఈ విధ్వంసం జరిగిందని ఆరోపించింది. ఐఆర్జీసీ చేసిన ఈ ఆరోపణలను అమెరికా సైన్యం పూర్తిగా తిప్పికొట్టింది. ఇరాన్ ఉద్దేశపూర్వకంగానే డ్రోన్లతో కువైట్ పౌర విమానాశ్రయంపై దాడి చేసిందని స్పష్టం చేసింది. ఈ ఘటనపై అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు ఎదురవుతుండటంతో తన తప్పును కప్పిపుచ్చుకునేందుకే ఇరాన్ తమపై ఇటువంటి అబద్ధపు ఆరోపణలు చేస్తోందని అమెరికా మండిపడింది.





## భారత విదేశాంగ విధానం భేష్

## ప్రశంసించిన వ్లాదిమిర్ పుతిన్

భారతదేశ విదేశాంగ విధానంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసలు కురిపించారు. ఇండియాతో బంధాన్ని మరింత విస్తృతం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. రష్యాతో రిలేషన్ అంశంలో భారత్‌పై అమెరికా ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించిందని, కానీ ఆ ప్రయత్నాల్లో అమెరికా విఫలమైందని పుతిన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ సంబంధాలను అమెరికా బలహీనపరిచే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేటి న్యూస్ ఏజెన్సీలతో పుతిన్ మాట్లాడారు. ఈ సందర్భంగా భారత ఆర్థిక వృద్ధిని ఆయన ప్రశంసించారు. భారత వ్యక్తిగత విదేశాంగ విధానాన్ని కూడా ఆయన మెచ్చుకున్నారు. భారత్‌తో ఆర్థిక సంబంధాన్ని కొనసాగించేందుకు దృఢ నిశ్చయంతో ఉన్నట్లు పుతిన్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని... ఆ దేశంలో ప్రస్తుతం ఆర్థిక వృద్ధి ఇంప్రెసివ్‌గా ఉందని పుతిన్ అన్నారు. రాబోయే రోజుల్లో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు వంద బిలియన్ల డాలర్లకు చేరుకోనున్నట్లు ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. భారత్‌పై పశ్చిమ దేశాలు ఒత్తిడి తేవాలని ప్రయత్నిస్తే అది ఆ దేశాలకు బ్యాక్‌ఫైర్ అవుతుందని పుతిన్ అన్నారు. ఇండియాపై ప్రెజర్ పెట్టాలని అమెరికా ప్రయత్నిస్తోందన్నారు. కానీ అత్యధిక జనాభా గల భారత్‌పై కానీ, మోదీపై కానీ ఒత్తిడి తేస్తే... అది అంతర్జాతీయ సంబంధాలకు, ద్వైపాక్షిక బంధాలకు విఘాతం అవుతుందని పుతిన్ తెలిపారు.

## కిమ్ నవ్వాడు...

## ఉత్తర కొరియా పులకించింది



కిమ్ జోంగ్ ఉన్.. ఉత్తరకొరియా నియంత.. అసలు అది ఓ దేశమని.. దానికి ఓ రాజ్యాంగం ఉంటుందన్న విషయాన్ని ఉత్తరకొరియా ప్రజలు మర్చిపోయి దశాబ్దాలు దాటుతోంది. వారందరికీ తెలిసింది ఒక్కటే. అదీ కిమ్ నుంచి వచ్చే ఆదేశాలు పాటించడం... నవ్వాలన్నా, ఏడవాలన్నా.. కనీసం పడుకోవాలన్నా అంతా కిమ్ జోంగ్ ఉన్ దయ. కాదన్నారో మెడకాయమీద తలకాయ ఉండదు. అంతే కాదు.. ఎప్పుడు చూసినా కిమ్ సీరియస్ గా ఉంటాడు. వివిధ దేశాధినేతలతో చర్చల సమయంలోనూ ఆయన నవ్వగా చూసింది లేదు. అలాంటి కిమ్ ఓసారి నవ్వితే.. ఆదేశం ఆనందంతో ఊగిపోదా.. ప్రస్తుతం అదే జరిగింది. కిమ్ నవ్వాడు. ఉత్తర కొరియన్లు ఆనందంతో గంతులేస్తున్నారు.

ఇటీవల ప్రతిష్ఠాత్మక ఏఎఫ్‌సీ ఛాంపియన్స్ లీగ్ ట్రోఫీని గెల్చుకుని నాగోహ్యాంగ్ ఫుట్ బాల్ క్లబ్ చరిత్ర సృష్టించింది. నార్త్ కొరియా చరిత్రలో ఈ ఘనత సాధించిన తొలి జట్టుగా రికార్డు నెలకొల్పింది. దీంతో ఆ జట్టు ప్లేయర్లను కిమ్ జోంగ్ అభినందించారు. అందరికీ నవ్వుతూ షేక్ హ్యాండ్ ఇచ్చాడు. కిమ్ తో షేక్ హ్యాండ్ తీసుకున్న తర్వాత ప్లేయర్లు ఆనందంతో గంతులు వేశారు. ఇంకొంతమంది భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నారు.

# ఫ్యాన్స్‌కు వరల్డ్ కప్ టికెట్లు 'ఫ్రీ'... కానీ ఓ షరతు!




ఫుట్‌బాల్ వరల్డ్ కప్ టికెట్లు కొందరు అభిమానులకు ఊహించని విధంగా ఉచితంగా లభించాయి. అయితే ఇది లక్కీ డ్రా వల్ల కాదు... కేవలం ఒక సాంకేతిక లోపం కారణంగానే ఇలా జరిగిందని ఫుట్‌బాల్ గవర్నింగ్ బాడీ 'ఫిఫా' వర్గాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో సదరు అభిమానులకు ఒక కీలక షరతు విధించింది. ఆ సీట్లను తమ వద్దే నిలుపుకోవాలంటే మాత్రం వారంలోగా టికెట్ల ధరను పూర్తిగా చెల్లించాలని స్పష్టం చేసింది. నిర్దేశిత సమయంలోగా డబ్బు చెల్లించకపోతే మాత్రం ఆయా టికెట్లను కోల్పోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది.

**అసలేం జరిగిందంటే..?**

జీరో డాలర్లకే టికెట్లు: జూన్ 3వ తేదీన దాదాపు 60 మంది అభిమానులు వరల్డ్ కప్ టికెట్లను ఉచితంగా పొందారని ఫిఫా ధృవీకరించింది. పేమెంట్ చేసే సమయంలో వచ్చిన సాంకేతిక లోపం కారణంగా వారికి 'జీరో డాలర్లు' గానే టికెట్లు బుక్ అయ్యాయి. ఈ లోపం తెలిసిన తర్వాత, సదరు ఫ్యాన్స్ ఆయా టికెట్లను తమకే కేటాయించాలని 'ఫిఫా'కు విజ్ఞప్తి చేశారు. దీంతో అభిమానుల అభ్యర్థనను మన్నించి టికెట్ ధర చెల్లించడానికి అవకాశం ఇచ్చింది. "పేమెంట్ ప్రక్రియను పూర్తి చేసేందుకు వారికి వారం సమయం ఇచ్చాం" అని ఫిఫా తెలిపింది. అయితే ఆ టికెట్ల అసలు ధర ఎంతనేది మాత్రం అధికారికంగా వెల్లడించలేదు.

ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌కు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. తాజాగా ఫైనల్ మ్యాచ్ టికెట్ రీసెల్ వెబ్‌సైట్లలో ఏకంగా 2.2 మిలియన్ యూరోలు పలుకుతున్నట్లు వార్తలొచ్చాయి. మన భారత కరెన్సీ ప్రకారం దీని విలువ దాదాపు రూ.21 కోట్లు! ఈ విపరీతమైన ధరలపై ఫిఫా ప్రెసిడెంట్ గియాన్ని ఇన్ఫాంటినో స్పందించారు. "ఫుట్‌బాల్‌కు ఉన్న మార్కెట్ ప్రకారమే టికెట్ ధరలు ఉంటాయి. ప్రపంచంలోనే అత్యధిక ఎంటర్‌టైన్‌మెంట్ ఇచ్చే క్రీడ ఫుట్‌బాల్" అని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

# వైభవ్ సూర్యవంశీ ఆ ఫార్మాట్లోనూ ఆడాలి

**రవిచంద్రన్ అశ్విన్**




టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ 2026లో అద్భుతమైన సత్తా చాటి అందరి దృష్టినీ ఆకర్షించిన విషయం తెలిసిందే. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఏకంగా 776 పరుగులు సాధించి 'ఆరెంజ్ క్యాప్' హోల్డర్‌గా నిలిచి సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ అసాధారణ ప్రదర్శన నేపథ్యంలో టీమిండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ స్పందిస్తూ.. వైభవ్ సూర్యవంశీ టెస్ట్ క్రికెట్ ఆడాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు తెలిపాడు.

**సుదీర్ఘ ఫార్మాట్ ఆడటం ముఖ్యం**

వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తుపై అశ్విన్ తన వ్యక్తిగత అభిప్రాయాన్ని పంచుకున్నాడు. "వైభవ్ టెస్ట్ క్రికెట్ ఆడాలనేది నా వ్యక్తిగత అభిప్రాయం. ఆట గురించి విస్తృతంగా ఆలోచిస్తుంటే మాత్రం అతడు తప్పనిసరిగా సుదీర్ఘ ఫార్మాట్ (టెస్ట్ క్రికెట్) ఆడాలి. అయితే నేర్చుకోవడానికి ఇష్టపడని విషయాలను మీరు మీ పిల్లలకు నేర్పించగలరా? అస్సలు నేర్పించలేరు. ఈ విషయాలన్నింటినీ పరిస్థితులే నడిపిస్తాయని నేను భావిస్తున్నాను. కొన్నిసార్లు ఏం చేయాలో ఆట మీకు చెప్పినప్పుడు, అది చెప్పినట్లు చేయడమే ఉత్తమం" అని అశ్విన్ వ్యాఖ్యానించాడు.

**బలవంతంగా రుద్దలేము..**

యువ క్రికెటర్ల మానసిక స్థితి, ప్రస్తుత ట్రెండ్స్ గురించి అశ్విన్ మరికొన్ని కీలక విషయాలను ప్రస్తావించాడు. ఇష్టం లేకుండా ఒకరిని ఒత్తిడి చేస్తే ఎప్పటికీ సానుకూల ఫలితాలు రావన్నాడు. క్రికెట్‌లోని ఒక నిర్దిష్ట ఫార్మాట్‌ను ఆటగాళ్లపై మీరు బలవంతంగా రుద్దలేరు. ప్రస్తుత యువ క్రికెటర్లు రెడ్ బాల్ క్రికెట్ (టెస్ట్ మ్యాచ్‌లు) ఆడటానికి అంతగా ఆసక్తి చూపడం లేదు. వారు ఒకటి లేదా రెండు బంతులను డిఫెండ్ చేసి, వెంటనే షాట్లను ఎలా ఆడాలో నేర్చుకోవాలని ఆరాటపడుతున్నారని అశ్విన్ తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచాడు.

# 34 ఎత్తుల్లోనే.. గుకేశ్‌ను ఓడించిన ప్రజ్ఞానంద




ఓస్లో: నార్వే చెస్ టోర్నీలో భారతీయ ప్లేయర్ ఆర్.ప్రజ్ఞానంద దూసుకెళు_న్నాడు. ఈ టోర్నీలో ప్రస్తుతం అతను రెండో స్థానంలో నిలిచాడు. అయితే వరల్డ్ చాంపియన్, మరో భారత ఆటగాడు గుకేశ్‌పై అద్భుతమైన విజయాన్ని ప్రజ్ఞానంద నమోదు చేశాడు. కీలకమైన మ్యాచ్‌లో కేవలం 34 ఎత్తుల్లోనే గుకేశ్‌ను మట్టికరిపించాడు. రెండు రోజుల క్రితమే గుకేశ్ తన 20వ పుట్టిన రోజు జరుపుకున్నాడు. అయితే ఈ విక్టరీ ప్రజ్ఞానందకు ప్రతీకార విజయం అవుతుంది. ఈ టోర్నీలోనే నాలుగో రౌండ్‌లో గుకేశ్ చేతిలో ప్రజ్ఞానంద ఓడిపోయారు. గుకేశ్‌పై గెలుపుతో టైటిల్ రేసుకు ప్రజ్ఞానంద చేరువయ్యారు. వరుసగా మూడు విక్టరీలతో మళ్లీ ఊపందుకున్నాడు. మూడు రోజుల క్రితం వెనుకబడ్డ తాను ఇప్పుడు టైటిల్ రేసులో ఉన్నట్లు ప్రజ్ఞానంద తెలిపారు. గత ఏడాది నార్వే చెస్ టోర్నీలో గుకేశ్, కార్ల్‌సన్ మధ్య తీవ్ర పోటీ ఉండేది. అయితే ఈ ఏడాది కార్ల్‌సన్ పెద్దగా పెర్ఫార్మ్ చేయలేకపోయాడు. గుకేశ్‌కు 8 పాయింట్లు ఉన్నాయి. పాయింట్ల పట్టికలో వెస్లే అగ్రస్థానంలో ఉన్నాడు. అతను 15.5 పాయింట్లతో దూసుకెళ్తున్నాడు. ప్రజ్ఞానంద 15 పాయింట్లతో టైట్ ఫైట్ ఇస్తున్నాడు. ఇక మూడవ స్థానంలో 14.5 పాయింట్లతో అలిరెజా ఫిరౌజా ఉన్నారు.

# నా పోటీ నాతోనే!

**ఎప్పటికైనా ఒలింపిక్ స్వర్ణం సాధిస్తా**



ఎప్పటికైనా ఒలింపిక్స్‌లో పసిడి పతకం నెగ్గడమే తన అంతిమ లక్ష్యమని, 2028 లాస్ ఏంజెల్స్ గేమ్స్ స్వర్ణమే టార్గెట్‌గా దూసుకెళ్తున్నానని భారత స్టార్ షూటర్, హైదరాబాదీ ఇషా సింగ్ అంటోంది. గతవారం జర్మనీలోని మ్యూనిచ్‌లో జరిగిన వరల్డ్ కప్‌లో ప్రపంచ రికార్డు స్వర్ణంతో పాటు రజత పతకాన్ని కైవసం చేసుకుని చరిత్ర సృష్టించిన తెలంగాణ బిడ్డ... గత పారిస్ ఒలింపిక్స్‌లో ఎదురైన నిరాశే తనలో కసిని పెంచిందని తెలిపింది. మేటి షూటర్లు బరిలో నిలిచిన వరల్డ్ కప్ మహిళల 25 మీటర్ల పిస్టల్‌లో రికార్డు వస్తుందని అస్సలు ఊహించలేదని చెప్పింది. ఈ టోర్నీలో ఎదురైన ఒత్తిడి, తోటి షూటర్లతో పోటీ, ఒలింపిక్ పసిడిపై గురిపెడుతూ సాగుతోంది.

గత మూడు, నాలుగేళ్లుగా నేను సీనియర్ లెవెల్‌లోనే స్థిరంగా రాణిస్తున్నా. గత ఏడాది వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు నేను సాధించిన తొలి పతకమే నా కెరీర్‌లో టాప్ పాయింట్ అని భావిస్తా. ఆ తర్వాత ఇప్పుడు మ్యూనిచ్ వరల్డ్ కప్‌లో సాధించిన ఈ ప్రపంచ రికార్డు స్వర్ణం చాలా సంతోషాన్నిస్తోంది. మా క్రీడలో వరల్డ్ కప్ అత్యంత కఠినంగా ఉంటుంది. అందులో క్వాలిఫై కావడమే ఒక పెద్ద యుద్ధం. అలాంటి చోట క్వాలిఫై అయ్యి ఫైనల్లో తీవ్ర ఒత్తిడిని అధిగమించి ప్రపంచ రికార్డు సృష్టించడం నిజంగా ఒక బోనస్.

25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ అనేది అత్యంత కఠినమైన ప్రక్రియ. మాకు షూట్ చేయడానికి కేవలం రెండు సెకన్ల సమయం మాత్రమే ఉంటుంది. ఆ రెండు సెకన్లలోనే గురి చూసి ట్రిగ్గర్ నొక్కడం చాలా కష్టం. అదీ కాకుండా గ్యాలరీలో ప్రేక్షకుల ముందు, ఆ తీవ్రమైన మానసిక ఒత్తిడి నడుమ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుంది. నా మునుపటి బెస్ట్ స్కోరు 30ల్లోనే ఉండేది, 40ల్లోకి రావడం చాలా కష్టంతో కూడుకున్న పని. ఏ అథ్లెట్ అయినా దేశ పతాకం అందరికంటే ఎత్తులో ఎగరాలనే లక్ష్యంతోనే బరిలోకి దిగుతారు. నేను కూడా బంగారం కోసమే పోరాడాను కానీ 43స్కోరుతో ప్రపంచ రికార్డు వస్తుందని ఊహించలేదు.

**చివరి షాట్ వరకూ పోరాటం వదలను**

రజతం నెగ్గిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్ విషయానికి వస్తే ఈ విభాగంలో నాకెప్పుడూ మంచి స్టార్ట్ దొరకదు. ఈ ఫైనల్లోనూ చివరి 3 షాట్ల వరకు కూడా నేను ఐదో స్థానంలోనే ఉన్నా. కానీ, ఒక్క షాట్ సరిగ్గా పడనంత మాత్రాన ఆట ముగిసిపోదు. చివరి షాట్ వరకు పోరాడి పుంజుకోవచ్చనే అనుభవం నాకుంది. అందుకే నేను ఎక్కడా ఆశలు వదలకుండా, చివరి షాట్ వరకు పట్టుదలగా పోరాడా.

# 32 ఏళ్లకే.. అంతర్జాతీయ క్రికెట్‌కు శ్రీకర్ భరత్ గుడ్‌బై



భారత వికెట్ కీపర్ బ్యాటర్, ఏపీ క్రికెటర్ కోన శ్రీకర్ భరత్ 32 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్టు సోషల్ మీడియా పోస్టు ద్వారా వెల్లడించాడు. రిషబ్ పంత్ అందుబాటులో లేని సమయంలో కేఎస్ భరత్ టెస్టు జట్టులోకి వచ్చాడు. 2023లో ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీతో అరంగేట్రం చేశాడు. తన కెరీర్‌లో ఏడు టెస్టులు మ్యాచ్‌లు ఆడిన భరత్.. బ్యాటింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. కేవలం 221 పరుగులు మాత్రమే సాధించాడు. దేశవాళీ క్రికెట్‌లో ఆంధ్ర జట్టు తరఫున సుదీర్ఘ కాలం పాటు స్థిరమైన ప్రదర్శన ఇచ్చిన భరత్.. 113 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 6102 రన్స్ చేశాడు. ఐపీఎల్‌లో పది మ్యాచ్‌లు ఆడాడు. దేశం తరఫున ఆడటం తన జీవితంలో దక్కిన అత్యంత గొప్ప గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్న భరత్ ఈ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన బీసీసీఐ, ఆంధ్ర క్రికెట్ సంఘం, తన కెప్టెన్లు కోహ్లీ, రోహిత్, కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు ధన్యవాదాలు తెలిపాడు.

చైతన్య రథం
# సినిమా
శనివారం 6 జూన్ 2026 X

## 'పెద్ది'... బాక్సాఫీస్ ఛాంపియన్



రామ్‌చరణ్ హీరోగా ప్రముఖ దర్శకుడు బుచ్చిబాబు తెరకెక్కించిన తాజా చిత్రం 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద భారీ హిట్‌గా నిలిచింది. ఆటలోనూ, పోరాటంలోనూ ఛాంపియన్‌గా నిలిచే ఒక యువకుడి కథతో వచ్చిన ఈ సినిమా ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. చాలా రోజుల తర్వాత రామ్‌చరణ్ ఖాతాలో ఒక సాలిడ్ హిట్ పడటంతో ఆయన అభిమానులు పండుగ చేసుకుంటున్నారు. ఈ సినిమా సాధించిన మొదటి రోజు వసూళ్లను నిర్మాణ సంస్థ అధికారికంగా వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా మొదటి రోజే ఈ చిత్రం రూ. 135.96 కోట్లు వసూలు చేసినట్టు ప్రకటించిం ది. ఈ సందర్భంగా నిర్మాణ సంస్థ 'బాక్సాఫీస్ ఛాంపియన్' అంటూ ఒక ప్రత్యేక పోస్టర్‌ను కూడా విడుదల చేసింది.

**'పెద్ది' కథేంటంటే..**

*నేపథ్యం:* విజయనగరం జిల్లాలోని ఒక కొండ కింద ఉన్న గ్రామం ఈ కథకు వేదిక. వందల మంది అక్కడ జీవిస్తున్నా ప్రభుత్వ రికార్డుల్లో ఆ ఊరికి ఎలాంటి గుర్తింపు ఉండదు. అందువల్ల ఆ ఊరన్నా, అక్కడి ప్రజలన్నా అందరికీ చులకన భావం.

*నాయకుడి ప్రయాణం:* ఆ ఊరిలోనే పుట్టి పెరిగిన యువకుడు పెద్ది (రామ్‌చరణ్). రోజువారీ కూలీ పనుల కోసం విజయనగరం వెళ్లే పెద్ది, పేరుకు కూలీ అయినా క్రికెట్‌లో తిరుగులేని నైపుణ్యం ఉన్న ఆటగాడు. విజయనగరం, బొబ్బిలి క్రికెట్ జట్ల వేలంలో పెద్దిని దక్కించుకోవడానికి అందరూ పోటీ పడుతుంటారు.

*కథలోని ట్విస్ట్:* అంతటి ప్రతిభ గల క్రికెట్ ఆటగాడు, అకస్మాత్తుగా క్రికెట్‌ను వదిలేసి కుస్తీ (రెజ్లింగ్) క్రీడాకారుడిగా ఎందుకు మారాల్సి వచ్చింది?

*కీలక పాత్రలు:* పెద్ది జీవిత ప్రయాణంలో అప్పలసూరి (జగపతి బాబు), గౌర్నాయుడు (శివరాజ్ కుమార్) ఎలాంటి పాత్ర పోషించారు? అసలు ఈ కథలో అచ్చియమ్మ (జాన్వీకపూర్) ఎవరు? ఆమె నేపథ్యం ఏంటి? అనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.

## అమ్మ మరణం...
### బరువెక్కిన గుండెతో మళ్లీ రేసింగ్ సూట్ వేసిన అజిత్ కుమార్



తల్లి మోహిని మణి మరణించిన కొన్ని రోజులకే తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ మళ్లీ రేసింగ్ ట్రాక్‌పైకి వచ్చారు. మే 30వ తేదీ ఉదయం చెన్నైలో మోహిని మణి (89) వృద్ధాప్య సమస్యలతో ప్రశాంతంగా కన్నుమూసిన విషయం తెలిసిందే. అజిత్ ఈ తీవ్ర విషాదం నుంచి కోలుకోకముందే జూన్ 5న ఆయన రేసింగ్ ప్రాక్టీస్ కోసం ట్రాక్‌పై అడుగుపెట్టారు. దీనికి సంబంధించిన ఫొటోలను అజిత్ కుమార్ రేసింగ్ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ పేజీలో షేర్ చేశారు. 'బరువెక్కిన గుండెతో మళ్లీ పనిలోకి దిగాను, కానీ జీవితం సాగిపోవాలి' అంటూ ఈ ఫొటోలకు ఒక ఎమోషనల్ క్యాప్షన్‌ను జత చేశారు.




## నిర్మాతగా నాగచైతన్య

*నాగార్జున క్లాప్‌తో గ్రాండ్‌గా ప్రారంభమైన 'దూత-2'*

అక్కినేని అభిమానులకు, ఓటీటీ ప్రియులకు అదిరిపోయే గుడ్ న్యూస్ వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో సంచలన విజయం సాధించిన సూపర్ నేచురల్ సస్పెన్స్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'దూత' సీక్వెల్ అధికారికంగా ప్రారంభమైంది. 'దూత సీజన్-2' పూజా కార్యక్రమాలు అన్నపూర్ణ స్టూడియోస్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ క్రేజీ సీక్వెల్ ప్రారంభోత్సవ పూజా కార్యక్రమానికి కింగ్ అక్కినేని నాగార్జున ముఖ్య అతిథిగా విచ్చేసి ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టి చిత్ర యూనిట్ మొత్తానికి తన ప్రత్యేక ఆశీస్సులు అందజేశారు.

ఈ సిరీస్‌తో అక్కినేని నాగచైతన్య కెరీర్‌లో ఒక మైల్‌స్టోన్ చాప్టర్ మొదలైంది. కేవలం హీరోగానే కాకుండా... 'దూత 2' సిరీస్ ద్వారా ఆయన నిర్మాతగా సరికొత్త అవతారమెత్తారు. అన్నపూర్ణ స్టూడియోస్, నార్త్ స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత శరత్ మరార్‌లతో కలిసి చైతన్య స్వయంగా ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తుండటం విశేషం. ఈ సందర్భంగా ట్విట్టర్ వేదికగా నాగచైతన్య స్పందిస్తూ... దూత సెకండ్ చాప్టర్‌లో అడుగుపెట్టడం, నిర్మాతగా తన మొదటి అడుగుపడటం చాలా సంతోషంగా ఉందని, ఇదొక శుభపరిణామమని... ఇకపై మరింత మ్యాజిక్ క్రియేట్ అవ్వబోతోందంటూ ఎమోషనల్ పోస్ట్ చేశారు.

మొదటి సీజన్‌ను మైండ్ బ్లోయింగ్ ట్విస్టులతో అద్భుతంగా తెరకెక్కించిన టాలెంటెడ్ డైరెక్టర్ విక్రమ్ కె. కుమార్ ఈ రెండో సీజన్కు కూడా దర్శకత్వం వహిస్తున్నాడు. మొదటి సీజన్లో కీలక పాత్రలు పోషించిన మలయాళ నటి పార్వతి తిరువోతు, తమిళ నటి ప్రియా భవానీశంకర్ ఈ సీక్వెల్లోనూ నటిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు ఇషాన్ ఛాబ్రా సంగీతం అందిస్తుండగా ముఖేష్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. పద్మాకర్, ప్రవళ్య, అనుష పుంజాల తదితరులు ఈ ప్రాజెక్టు నిర్మాణ పర్యవేక్షణలో భాగస్వాములుగా ఉన్నారు.

## 'స్లమ్ డాగ్'.. టీజర్ 8న




డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, వెర్సటైల్ హీరో విజయ్ సేతుపతి మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్-డ్రామా 'స్లమ్ డాగ్'. ఈ చిత్రం ప్రొడక్షన్ విజయవంతంగా పూర్తయింది. అన్ని భాషా వెర్షన్లలో పోస్ట్-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. '33 టెంపుల్ రోడ్' అనే ఆసక్తికరమైన ట్యాగ్ లైన్‌తో ఈ ప్రాజెక్ట్ దాని టైటిల్, ఆకట్టుకునే ఫస్ట్-లుక్ విడుదల నుంచి హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. 'స్లమ్ డాగ్' చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా జేబీ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించారు. నిర్మాతలు ఇప్పుడు నెక్స్ట్ ఫేజ్ ప్రమోషన్ల కోసం సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం టీజర్‌ను జూన్ 8న విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. టీజర్ పోస్టర్‌లో కనిపించిన విజువల్ ఎంతో డార్క్ అండ్ ఇంటెన్స్‌గా ఆకట్టుకుంటోంది. కళ్లకు గంతలు కట్టుకున్న ఓ వ్యక్తి మెడపై రక్తంతో తడిసిన కట్టి ఉంచిన దృశ్యం కథలోని బ్రూటల్ ప్రపంచాన్ని సూచించేలా కనిపిస్తోంది. విజయ్ సేతుపతికి జోడీగా సంయుక్త నటిస్తుండగా, టబు, కన్నడ స్టార్ దునియా విజయ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. బ్రహ్మాజీ, వీటీవీ గణేష్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న జాతీయ అవార్డు విజేత హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు మరింత బలం చేకూర్చనుంది. ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

## వైష్ణవ్ తేజ్ కొత్త సినిమాకు గ్రీన్ సిగ్నల్



మెగా హీరో వైష్ణవ్ తేజ్... ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌లో సంచలన ఎంట్రీ ఇచ్చి మొదటి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకున్నాడు. అయితే ఆ తర్వాత వచ్చిన కొండపొలం, రంగరంగ వైభవంగా, ఆదికేశవ సినిమాలు ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయి. దీంతో తన తదుపరి ప్రాజెక్ట్ విషయంలో వైష్ణవ్ తేజ్ చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడిచింది. గత మూడు సంవత్సరాల్లో వందకు పైగా కథలు విన్నప్పటికీ వాటిలో ఏ ఒక్కదానికీ ఆయన గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదని టాలీవుడ్‌లో ప్రచారం జరిగింది. పలువురు ప్రముఖ నిర్మాతలు, దర్శకులు ఆయన్ను సంప్రదించినప్పటికీ సరైన కథ కోసం ఎదురు చూశాడనే టాక్ వినిపించింది.

ఇలాంటి పరిస్థితుల్లో వైష్ణవ్ తేజ్ తన తదుపరి సినిమాకు ఎట్టకేలకు ఓకే చెప్పినట్లు సమాచారం. ఈ సినిమాకు డైరెక్టర్ మహేష్ ఎస్ దర్శకత్వం వహించనున్నారు. గతంలో సుధీర్‌బాబు హీరోగా తెరకెక్కిన హంట్ సినిమాకు ఆయన దర్శకత్వం వహించారు. మహేష్ చెప్పిన కథ, దాని ట్రీట్‌మెంట్ వైష్ణవ్ తేజ్‌ను ఆకట్టుకోవడంతో వెంటనే ప్రాజెక్ట్‌కు అంగీకరించినట్లు సినీ వర్గాలు చెప్తున్నాయి. ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చ మొదలైంది.

ఈ ప్రతిష్ఠాత్మక సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ వేగంగా జరుగుతున్నాయని సమాచారం. వచ్చే నెలలో అఫీషియల్ అనౌన్స్‌మెంట్‌తో పాటు ఇతర నటీనటులు, సాంకేతిక బృందం వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. సినిమా రెగ్యులర్ షూటింగ్ కూడా త్వరలోనే ప్రారంభం కానుందని తెలుస్తోంది. వరుస నిరాశల తర్వాత వైష్ణవ్ తేజ్ కెరీర్‌కు ఈ సినిమా కీలకంగా మారనుండటంతో 'మెగా' అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు.